ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

విజయవాడ

: fb.com/vaartha Digital

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

23-4-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 82 పేజీలు: 12 వెల: 6.50

ఉగ్రవాదానికి భారత్ తలవంచదు: ప్రధాని మోడీ

మాలెగావ్ కేసు: నలుగురు నిందితులపై కేసు కొట్టివేత

9లో

ఉమ్మడి ఎపి మాజీ సిఎం

నాదెండ్ల కన్నుమూత

నాదెండ్ల భాస్కరరావు(ఫైల్)

కొద్ది రోజులుగా ఆస్పత్రిలో చికిత్స

1980 దశకంలో టిడిపి, కాంగ్రెస్‌లో నాదెండ్ల కీలకపాత్ర

1984లో నెలరోజులు సిఎం బాధ్యతలు

సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్, మరికొందరు ప్రముఖుల ప్రగాఢ సంతాపం

నేడు హైదరాబాద్‌లో అంత్యక్రియలు

విజయవాడ, ఏప్రిల్ 22,ప్రభాతవార్తప్రతినిధి: సీనియర్ రాజకీయవేత్త, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, ఖమ్మం మాజీ ఎంపీ నాదెండ్ల భాస్కరరావు హైదరాబాద్ ఆసుపత్రిలో కన్ను మూశారు. కొంత కాలం నుంచి భాస్కరరావు అనారోగ్యంతో బాధపడుతున్నారు. నాదెండ్ల భాస్కర్ రావు 1935 జూన్ 23లో గుంటూరులో జన్మించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలో అతి తక్కువ కాలం 1984 ఆగస్టు 16నుంచి సెప్టెంబరు 16 వరకు 31 రోజులు ముఖ్యమంత్రిగా >>2

నెలలోగా పిపిపి మెడికల్ కాలేజీలు

మొదటిదశలో 4, తర్వాత 6 కాలేజీల నిర్మాణం

త్వరలో స్టేట్‌హెల్త్ ఇన్వెస్ట్‌మెంట్ విధానం

శరవేగంగా సంజీవని ప్రాజెక్టు విస్తరణ

అమరావతిలో నేచురోపతి సంస్థ కోసం కేంద్రానికి లేఖ: సిఎం చంద్రబాబు

బుధవారం సంజీవని, పాపులేషన్ మేనేజ్మెంట్‌పై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు

విజయవాడ, ఏప్రిల్ 22,ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు 2.1 వృద్ధికి చేరుకోవడమే లక్ష్యం కావాలని ఏపీ సీఎం చంద్ర బాబు నాయుడు స్పష్టం చేసారు. మానవ వనరుల వృద్ధి అధికంగా కావాల్సిన అవశ్యకత ఇప్పుడు ఉందన్నారు.. రాష్ట్రంలో పీపీపీ విధానంలో నిర్మించ తలపెట్టిన మెడికల్ కాలేజీల పనులు నెల రోజుల్లో ప్రారంభించేలా ఆయా సంస్థలకు అప్పగించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ముందుగా ఫేజ్ 1లోని 4మెడికల్ కాలేజీలు మార్కాపురం, మదనపల్లె, పులివెందుల, ఆదోని పనులు మొదలు పెట్టాలని స్పష్టం చేశారు. ఫేజ్ 2లో అమలాపురం, బాపట్ల, పెనుకొండ, నర్సీపట్నం, పాలకొల్లు, పార్వతీపురం మెడికల్ కాలేజీల నిర్మాణం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. 7 పిల్లర్లతో ఏపీ స్టేట్ హెల్త్ ఇన్వెస్ట్‌మెంట్ పాలసీ 202631 త్వరలోనే తీసుకురావాలని సీఎం నిర్దేశించారు. ఇందులో భాగంగా మెడికల్ కాలేజీలు, మల్టీ స్పెషాలిటీ హాస్పటల్స్, మెడ్ టెక్ ఉత్పాదనలు, స్టార్టప్‌ఇన్నోవేషన్, మెడికల్ టూరిజం కింద ఇంటిగ్రేటెడ్ వెల్నెస్ ఫెసిలిటీస్ అందించడం, స్కిల్లింగ్, అమరావతివీఈఆర్‌లో మెడిసిటీలు ఏర్పాటుచేయాలన్నారు. అమరావతిలో నేచరోపతి సంస్థ కేంద్ర నెలకొల్పేలా ఆయుష్ శాఖ మంత్రిత్వ శాఖకు లేఖ రాయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. సచివాలయంలో బుధవారం సంజీవని ప్రాజెక్టు, పాపులేషన్ మేనేజ్మెంట్‌పై సిఎం సమీక్ష నిర్వహించారు.

సంజీవని ప్రాజెక్టు ద్వారా లక్ష మందికి పైగా సేవలు: ప్రజలకు వైద్య ఖర్చులు భారం తగ్గించేలా ప్రివెంటివ్ హెల్త్ విధానం, సిటిజెన్ హెల్త్ స్క్రీనింగ్‌పై దృష్టి పెట్టాలని అధికారులకు సీఎం సూచించారు. ఇందుకోసం పబ్లిక్ హెల్త్ డేటాను వినియోగించుకోవాలన్నరు. సంజీవని ప్రాజెక్టు కింద ఇప్పటివరకు 1.08 లక్షల మందికి వైద్య సేవలు పొందారని, 2.8లక్షల మందికి మందులు పంపిణీ చేయగా, 19 వేల మందికి వైద్య పరీక్షలు నిర్వహించామని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. సంజీవని ప్రాజెక్టు వేగంగా రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేందుకు ప్రణాళికలు చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రభుత్వ సేవల్ని డిజిటలైజ్ చేసినా క్షేత్రస్థాయిలో సిబ్బంది ఆశించిన స్థాయిలో పనిచేయకుంటే ఫలితాలు రావని ముఖ్యమంత్రి అన్నారు. దీనిపై అధికారులు దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. ప్రజారోగ్య రక్షణకు సంబంధించి ప్రచారం జరగడం లేదని, ప్రజల్లో అవగాహన కల్పించడం ద్వారా ఆరోగ్య సమస్యలు తగ్గించుకునేందుకు అవకాశం కలుగు తుందని సీఎం అన్నారు. అనీమియా, డయాబెటిస్ >>2

విఓఎలకు రూ.22.67కోట్ల ప్రోత్సాహక నిధులు

మంత్రి కొండపల్లి శ్రీనివాస్

సచివాలయం,ఏప్రిల్ 22,ప్రభాతవార్త : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్‌లకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. వివోఏలకు రూ.22.67 కోట్ల ప్రోత్సాహక బకాయిలను తక్షణమే విడుదల చేయాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత శాఖ మంతి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. స్త్రీనిధి ద్వారా విడుదల కావాల్సిన ఈ నిధులకు సంబంధించి మంత్రి కీలక సూచనలు చేశారు. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 27,336 గ్రామ సంఘాల్లో పనిచేసే >>2

సమన్వయం ద్వారా సమగ్ర అభివృద్ధి

సింగపూర్ ప్రతినిధులతో రాష్ట్రమంత్రుల బృందం భేటీ దృశ్యం

సింగపూర్ హోంమంత్రి షణ్ముగంతో రాష్ట్ర మంత్రుల భేటీ

నగరాభివృద్ధి విధానాలు, ప్రణాళికలపై అధ్యయనం

ఇండియన్ హైకమిషనర్‌తో కూడా మంత్రుల భేటీ

విజయవాడ,ఏప్రిల్ 22,ప్రభాతవార్తప్రతినిధి: సింగపూర్‌లో జరుగుతున్న ఏపీ మంత్రుల అధ్యయన పర్యటనలో భాగంగా రెండో రోజు కార్యక్రమాలు సుసంపన్నంగా కొనసాగాయి. 'జాతీయ విధానాల్లో పారదర్శకత .జవాబుదారీ తనం, రాజకీయ బాధ్యత, ప్రజల నమ్మకం. విశ్వసనీయత' అనే ప్రధాన అంశంపై మంత్రుల బృందం వివిధ సమావేశాల్లో పాల్గొని సింగపూర్ పరిపాలనా విధానాలను అధ్యయనం చేసింది. ఉదయం నలాన్ లిటిల్ ఇండియా ప్రాంతంలో సింగపూర్ హోంమంత్రి శన్ముగంతో బ్రేక్‌ఫాస్ట్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశ ప్రాధాన్యత ఆధారిత పరిపాలన, బాధ్యతాయుత రాజకీయ వ్యవస్థ, ప్రజల రక్షణకు చర్యలు, చట్టాలపై ఆయన తన అనుభవాలను ఏపీ మంత్రులతో పంచుకున్నారు. తదుపరి సింగపూర్ కోఆపరేషన్ ఎంటర్‌ప్రైజ్‌లో డాక్టర్ ప్రేమ్ కుమార్ సమన్వయంతో జరిగిన కార్యక్రమంలో మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సమగ్ర సమన్వయ విధానంపై మాజీ హెడ్ ఆఫ్ సివిల్ సర్వీస్ పీటర్ హో ఏపీ మంత్రులకు వివరించారు. ప్రభుత్వ విభాగాల సమన్వయం ద్వారా సమగ్ర అభివృద్ధిని ఎలా సాధిస్తున్నారో ఆయన వివరణ ఇచ్చారు. అనంతరం యూఆర్ఏ గ్యాలరీను సందర్శించిన మంత్రులు పట్టణ ప్రణాళిక, భూవినియోగ పాలనపై అవగాహన పొందారు. సింగపూర్ నగరాభివృద్ధి విధానాలు, దీర్ఘకాలిక ప్రణాళిక, సమగ్ర అభివృద్ధి లక్ష్యాలపై సింగపూర్ ప్రతినిధులు వివరించారు. తరువాత నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్‌లో జరిగిన సెషన్‌లో దీర్ఘకాలిక పట్టణ ప్రణాళిక, సమగ్ర ప్రణాళిక, సమన్వయ వ్యవస్థలు వంటి అంశాలపై నిపుణులు వివరించారు. ఈ అధ్యయన పర్యటన ద్వారా ప్రజా నమ్మకాన్ని పెంపొందించే విధానాలు, పారదర్శక పాలన, సమగ్ర అభివృద్ధి లక్ష్యాలు వంటి అంశాలను సమగ్రంగా అవగాహన చేసుకుంటున్నారని ఏపీ మంత్రులు తెలిపారు. ఈ అనుభవాలను మన రాష్ట్రంలో అమలు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మంత్రుల బృందంలో పి. నారాయణ, వంగలపూడి అనిత, కింజరాపు అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, బి.సి జనార్దన్ రెడ్డి, ప్లానింగ్ సెక్రటరీ అనంత్ శంకర్, తిశిలీదిశిలీ నిదీ ఆలపర్తి వెంకటేశ్వరరావు ఉన్నారు. పర్యటనలో భాగంగా సింగపూర్ ఇండియన్ హై కమిషనర్‌తో ఏపీ మంత్రుల బృందం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యింది.

సింగపూర్ మారిటైం వీక్ 2026 లో పాల్గొన్న మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి: సింగపూర్ పర్యటనలో భాగంగా మారిటైం వీక్ 2026 ను రాష్ట్ర పెట్టుబడులు మౌలిక సదుపాయాలు శాఖ మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి సందర్శించారు. సింగపూర్ మారిటైం >>2

హడలెత్తిస్తున్న వడగాడ్పులు

విజయవాడ,ఏప్రిల్ 22,ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి. వడగాల్పులు ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా 202 మండలాల్లో 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు వెల్లడించారు. ఇవాళ కడపలో గరిష్ఠంగా 44.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైందని పేర్కొన్నారు. గురువారం 95మండలాల్లో తీవ్ర వడగా లులు, మరో 101మండలాల్లో వడగాలులు ప్రభావం చూపే అవకాశం ఉంది. శ్రీకాకుళం జిల్లాలో 19, విజయనగరంలో 24, పార్వతీ పురం మన్యం జిల్లాలో 3, అల్లూరి జిల్లాలో 5, పోలవరంలో 8, విశాఖపట్నంలో 1, అనకాపల్లిలో 13, కాకినాడలో 10, తూర్పుగోదావరి జిల్లాలో 6, ఏలూరులో 3, ఎన్టీఆర్ జిల్లాలో 3మండలాల్లో తీవ్ర వడగాలులు ప్రభావం చూపే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. రాష్ట్రంలో ఎండలు తీవ్రత దృష్ట్యా ప్రజలు ఇళ్ళకు పరిమితం కావాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

టోల్‌ప్లాజా వద్ద ఘోర ప్రమాదం ముగ్గురి మృతి

దేవరపల్లి,ఏప్రిల్ 22 ప్రభాతవార్త: తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం వీరవల్లి టోల్ ప్లాజా సమీపంలో బుధవారం తెల్లవారు జామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. తాళ్లపూడి మండలం గజ్జరం గ్రామానికి చెందిన చాపర్ల హనుమంతరావు (45)కు వైద్యం చేయించేందుకు స్నేహితులు చాపర్ల రాజు(40), కొవ్వూరుకు చెందిన దుద్దుపూడి సాగర్ (41), గన్నిన నరేంద్రతో కలిసి ఈ నెల >>2



మూడేళ్లలో మళ్లీ వైకాపా ప్రభుత్వమే

బుధవారం ఇప్పికట్ల గ్రామంలో సుధాకర్ రెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న జగన్

అధికారంలోకి వచ్చాక ప్రతి బాధితునికి న్యాయం

నిర్వాసితుల సమస్యలపై పోరాటం: ప్రజాదర్బార్‌లో జగన్

పులివెందుల, ఏప్రిల్ 22 , ప్రభాతవార్త : రాష్ట్రంలో మరో మూడేళ్లలో వచ్చేది మన ప్రభుత్వమే అని అధికారంలోకి రాగానే ప్రతి బాధితుడికి న్యాయం చేస్తామని నిర్వాసితుల తరుపున పోరాటానికి సిద్ధం అని వైఎస్సార్సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. పులివెందుల మూడు రోజుల పర్యటనలో రెండోరోజు వైయస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజల మధ్య బిజీ బిజీగా >>2

అనంతలో హనీ ట్రాప్ కలకలం

తేలిన 19 మంది బాధితులు

రూ.5 నుండి రూ.25 లక్షలు దోపిడీ

కొనసాగుతున్న సీక్రెట్ దర్యాప్తు

ముఠాతో పోలీసుల ములాఖత్

ఇద్దరు సిఐలపై వేటుకు రంగం సిద్ధం

అనంతపురం క్రైమ్ ఏప్రిల్ 22 ప్రభాతవార్త: వయ్యారపు వలపులతో నెరవేసిన ముఠా అందిన కాడికి దోచేస్తోంది. అమాయకును టార్గెట్ చేస్తూ లక్షలాది రూపాయలను నిలుదోపిడి చేస్తున్న ఘటన వెలుగుజూసింది. మొత్తంగా బాధితులు 19 మందిని ఈ ట్రాప్ లో లాగి లక్షలాది రూపాయలను ఆ ముఠా పోగు చేసినట్లు సమాచారం. దీన్నిబట్టి చూస్తే ఈ తతంగం అంతా పోలీసుల కనుసన్నల్లోనే నడుస్తున్నట్లు విశ్వసియనీయమైన సమాచారం.

ముందు తీయగా మాట్లాడి ముగ్గులు దించిన తర్వాత బ్లాక్మెయిల్ తరహాలో డబ్బులు డిమాండ్ చేసి ఈ ముఠా అమాయకుల జీవితాలతో ఆడుకుంతోంది. వివరాల మేరకు... అనంతపురం, రూరల్ పరిధిలోని రాప్తాడులో హనీ ట్రాప్ తో పలువురు భయాందోళనకు గురవుతున్నారు. ఈ వలపు వలలో పడిన అమాయకులు వారి బారి నుండి కాపాడాలని కోరుతున్నారు. ఈ రొచ్చులో ప్రభుత్వ అధికారులు, బడా బాబులు, వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులను మహిళలతో ట్రాప్ చేస్తున్న ముఠాపై పోలీసులు కేసు నమోదు చేసారు. ముందుగా పరిచయం చేసుకొని ఇంటికి రమ్మంటారు.. ఆ తర్వాత బట్టలు విప్పించి ఫోటోలు, వీడియోలు తీస్తారు. ఆలోగా ఆమె బంధు వులమంటూ ముఠా మొత్తం రంగంలోకి దిగు తారు. పరువు కాస్తా బజారుకు ఈడుస్తామని భయపెట్టడం, అందిన కాటికి దోచేయడం చేస్తారు.. ఇలా ఓ రిటైర్డ్ అధికారిని కూడా వలలో వేసుకొని చివరకు కాళ్ళ బేరానికి వచ్చి ఆయన రూ. 3 లక్షలు సమర్పించుకున్నట్లు సమాచారం.

ఇప్పటివరకు 19 మంది బాధితుల నుండి డబ్బులు వసూలు చేసిన 8 మంది సభ్యులతో కూడిన ముఠాపై జిల్లా ఎస్పీ జగదీష్ సీరియస్ గా పరిగణించారు. ముఠాలో ఐదుగురు మహిళలు, ముగ్గరు పురుషులు ఉన్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఎస్పీ స్వయంగా దర్యాప్తు పర్యవేక్షణ కొనసాగించడంపై ఆసక్తికర విషయాలు వెలుగు చూస్తున్నాయి.

అనంతపురంలో నయా ఖిహనీ ట్రాప్ దెబ్బకు కొందరు భయపడి ఊరు వదిలి వెళ్ళినట్లు తెలుస్తోంది. బాధితుల్లో వీఆర్ ఓ, ఫిజియో థెరపిస్టు, ఆర్ఎంపీలు, కిరాణా వ్యాపారులు, రియల్టర్లు. వున్నారు. వీరి వలలో పడి చిక్కుకుని బయట పడలేక ఓ బాధితుడు ఆత్మహ? చేసుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఖిహనీఖి ముఠాకు పోలీసులు సహకరిస్తున్నట్లు విచారణలో తేలినట్లు సమాచారం.

దీంతో అనంతపురం పరిధిలోని ఇద్దరి సిఐలపై బదిలీ వేటు వేసినట్టు సమాచారం. పూర్తిస్థాయి వివరాలు తెలియాల్సి ఉంది.

వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు కోసం పోలీసుల గాలింపు

కాకినాడ ,ఏప్రిల్ 22,ప్రభాతవార్త ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి: వైసిపి ఎమ్మెల్సీ అనంత బాబు కారు డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో సాక్షులను ప్రలోభ పెట్టి డబ్బులు ఇచ్చారని సర్పవరం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడంతో ఎమ్మెల్సీ అనంత బాబు పై కేసు నమోదు చేశారు. అతనిని అరెస్టు చేసేందుకు హైదరాబాద్, ఒడిశా, తమిళనాడు ప్రాంతాలలో ప్రత్యేక బృందాలు గా పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్యకేసులో సాక్షులకు డబ్బులిచ్చి అనంతబాబు బెదిరిం పులకు గురి చేయడంతో పోలీసులను నలుగురు సాక్షులు భయంతో పోలీసులను ఆశ్ర యించారు. సాక్షుల ఫిర్యాదు మేరకు >>2

పూర్తి 'డీల్' కుదిరేదాకా ఇరాన్‌తో కాల్పుల విరమణ

గడువు పెంచిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్

జెడివాన్స్ పాక్ పర్యటన వాయిదా

వాషింగ్టన్, ఏప్రిల్ 22: మధ్యప్రాచ్యంలోయుద్ధవిరమణకు జరుగుతున్న మధ్యవర్తిత్వం ఇప్పటికీ కొలిక్కిరాలేదు. ఇస్లావ రాబాద్‌లో జరుగుతాయని భావించిన రెండో విడత చర్చలు అర్థాం తరంగా వాయిదాపడ్డాయి. జెడివాన్స్ బృందం రావడంలేదని ప్రకటించడంతో మళ్లీ ప్రతిష్టంభన నెలకొంది ఈనేపథ్యంలో అమె రికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రకటన చర్చలను మరింతగా పొడిగించినట్లయింది. ఇరాన్‌తో ఉద్రిక్త పరిస్థితులమధ్య ఇరుదేశాల మధ్య గతంలో కుదిరిన కాల్పుల విరమణను పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. ఇరాన్ నాయకత్వం ఒక సమగ్ర ప్రతిపాదనను సమర్పించే వరకు ఈ కాల్పుల విరమణ కొనసాగుతుందని తెలిపారు. అమెరికా - ఇరాన్ మధ్య ఈ నెల 8వ తేదీన కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. రెండు వారాల ఈ సీజ్ ఫైర్ మరో కొద్ది గంటల్లో ముగియనుందనగా ట్రంప్ తాజా నిర్ణయం పోస్టుచేసారు. అయితే, పాకిస్థాన్ నుంచి వచ్చిన అభ్యర్థన మేరకే కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగించినట్లుగా ట్రంప్ తెలిపారు. ముఖ్యంగా పాక్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్, ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ల అభ్యర్థన మేరకు సైనిక చర్యను వాయిదా వేసి, దౌత్య చర్చలకు అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. తన ట్రూత్ సోషల్ మీడియా వేదికపై వివరాలను వెల్లడించారు. కాల్పులు విరమణ కొనసాగుతున్న సమయంలో ఇరాన్‌పై సముద్ర దిగ్బంధనాన్ని కొనసాగించాలని సైన్యానికి ఆదేశాలు ఇచ్చామని ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ ప్రభుత్వంలో అంతర్గత విభేదాలు తీవ్రంగా ఉన్నాయి. అలాంటి పరిస్థితుల్లో వారు ఏకీకృత ప్రతిపాదనతో రావడానికి సమయం అవసరం. అందుకే దాడిని నిలిపివేసి, కాల్పుల విరమణ గడువు పొడిగించామని తెలిపారు. అయితే ఇందుకు ధీటుగా ఇరాన్ కూడా స్పందించింది. ఇరాన్ నౌకాశ్రయాల్లో నౌకల >>2

విజయవాడలో మరో శాటిలైట్ రైల్వే స్టేషన్

విజయవాడ,ఏప్రిల్ 22,ప్రభాతవార్తప్రతినిధి: విజయవాడ రైల్వే స్టేషన్‌కు నిత్యం వచ్చే వందలాది రైళ్ల రద్దీని నియంత్రించడానికి శాటిలైట్ స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నారు. విజయవాడ రైల్వే స్టేషన్ కు ఉత్తరంగా రాజరాజేశ్వరి పేట వద్ద 70 వ దశకం చివర్లో బల్బ్ లైన్ నిర్మాణం జరిగింది. ప్రస్తుతం విజయవాడ నుంచి విశాఖ పట్నం వైపు వెళ్లాల్సిన గూడ్స్ రైళ్లు, కొన్ని ప్యాసింజర్ రైళ్లు నేరుగా నగరం మధ్య నుంచి బల్బ్ లైన్‌లో ప్రయాణిస్తున్నాయి. ఇటీవల అభివృద్ధి చేస్తున్న రాయనపాడు విజయవాడకు 15కిలోమీటర్ల దూరంలో >>2

ఎన్నికల సామాగ్రితో సిద్ధంగా ఉన్న పోలింగ్ సిబ్బంది

తమిళనాడు, బెంగాల్‌లో
నేడే పోలింగ్
మహారాష్ట్ర, గుజరాత్‌ల్లోని 3చోట్ల ఉప ఎన్నికలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22: తమిళనాడులో మొత్తం 234 అసెంబ్లీ నియోజకవర్గాలకు గురువారం ఒకే దశలో పోలింగ్ జరుగనుండగా, పశ్చిమబెంగాల్‌లో తొలి దశలో 152 స్థానాలకు పోలింగ్ జరుగనుంది. తమిళనాడులో 234 నియోజకవర్గాలలో 4,023 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. 5,73,43,291 మందికి పైగా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఎన్నికలకు ముందు, పోలింగ్ రోజు కార్యకలాపాలు సజావుగా సాగేందుకు జరుగుతున్న కార్యకలాపాలను సమీక్షి ంచేందుకు తమిళనాడు ప్రధాన ఎన్నికల అధికారి అర్చన పట్నాయక్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించారు. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో నూటికి నూరు శాతం ఓటింగ్ జరిగేలా చూడాలని ఎన్నికల సంఘం ప్రణాళిక రచించి, అందుకు అనుగుణంగా ఓటర్లలో అవగాహన ప్రచార కార్యక్రమాలను చేపట్టింది. తమిళనాడు వ్యాప్తంగా పోలింగ్ విధుల కోసం 1.40 లక్షలకు పైగా పోలీసు సిబ్బందిని మోహరించారు. కీలకమైన పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు భద్రతా బలగాలను అందించేందుకు కూడా ఏర్పాట్లు చేశారు. జిల్లాల్లో ప్రచారం చేసిన బయటివారిని వారి సొంత నియోజకవర్గాలకు తిరిగి వెళ్లాలని ఆదేశించారు. పశ్చిమ బెంగాల్‌లో 16 జిల్లాల పరిధిలోని 152 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 3.6 కోట్ల మంది ఓటర్లుండగా, 44వేల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. తొలి దశ ఎన్నికల్లో 1,478 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. గత ఎన్నికలతో పోలిస్తే పోలింగ్ దశల సంఖ్య గణనీయంగా తగ్గినప్పటికీ, నిబంధనలను కఠినంగా అమలు చేసే లక్ష ్యంతో ఎన్నికల సంఘం చేపట్టిన నూతన, విశిష్ట చర్యల ఫలితంగా రాష్ట్రంలో కేంద్ర భద్రతా బలగాల మోహరింపు అపూర్వ స్థాయిలో కనిపిస్తోంది. ఇందులో భాగంగా సుమారు 2,407 కేంద్ర సాయుధ పోలీసు బలగాల (సిఏపిఎఫ్) కంపెనీలకు చెందిన 2.4 లక్షల మందికి పైగా సిబ్బందిని మోహరించింది. సుమారు 7,384 బూత్‌లను "అత్యంత సున్నితమైనవి" లేదా "క్లిష్టమైనవి"గా గుర్తించారు. బ్రెయిల్‌తో కూడిన ఇవిఎంలు, ర్యాంపులు, ప్రాధాన్యతా క్యూల ద్వారా ఓటర్లకు సౌకర్యాలను కల్పించింది. మహారాష్ట్రలో రాహురి, బారామతి అసెంబ్లీ నియోజకవర్గాలకు, గుజరాత్‌లోని ఉమ్రీద్ అసెంబ్లీకి ఉప ఎన్నిక జరుగనుంది. గురువారం పోలింగ్‌కు ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేసింది.

అమరావతి రాజధాని కోసం మరో 1800 ఎకరాల భూ సమీకరణ
త్వరలో సిద్ధం కానున్న మాస్టర్ ప్లాన్..
అన్ని గ్రామాలకూ నోటిఫికేషన్ పూర్తి.
పెదపరిమిలో రెండు యూనిట్లు ఏర్పాటు..

.విజయవాడ,ఏప్రిల్ 22,ప్రభాతవార్తప్రతినిధి: రాజధాని అమరావతి రెండోదశ పూలింగు పరిధిలోని రైతులతో ముఖ్యమంత్రి చర్చల అనంతరం వారిలో సానుకూల దిశలో స్పందన వచ్చింది. వరుసగా భూ సమీకరణ కోసం నోటిఫికేషన్లు సిఆర్‌డిఎ అధికారులు ఇస్తూ వచ్చారు.ఆ క్రమంలోనే ఏడు గ్రామాలకూ భూసేకరణ నోటిఫికేషన్లు పూర్తి చేశారు. చివరిగా అమరావతి మండలంలో వైకుంఠపురం గ్రామానికి సమీకరణ ప్రకటన ఇచ్చారు. మొత్తం 22,494 ఎకరాల్లో 16,666 ఎకరాలు పట్టా భూమిగా ఉంది. దీనిలో మంగళవారం వరకూ సుమారు 1800ఎకరాలు ప్రభుత్వానికి అందింది. వీటిల్లో అత్యధికంగా అమరావతి మండలంలోని కర్లపూడిలేమల్లెలో 592 ఎకరాలు, యండ్రాయిలో 579 ఎకరాలు ఇచ్చారు. పెద్దమద్దూరులో 342 ఎకరాలు, వైకుంఠపురంలో తొలిరోజే 15.50 ఎకరాలు సిఆర్‌డిఎకు ఇచ్చారు. తుళ్లూరు మండలంలోని హరిశ్చంద్రాపురంలో 8.37 ఎకరాలు, పెదపరిమి ఒకటో యూనిట్లో 99.50 ఎకరాలు, రెండో యూనిట్లో 32 ఎకరాలు, వడ్డమానులో 113 ఎకరాలు మొత్తం 1,784 ఎకరాలు ప్రభుత్వానికి ఇచ్చారు. అయితే జనవరి 7న రెండోదశ పూలింగు ప్రక్రియ ప్రారంభించారు. ఇప్పటికి మూడు నెలలు గడుస్తున్నా ప్రభుత్వం అనుకున్నస్థాయిలో పూలింగు వేగంగా నడవడం లేదనే విమర్శ ఉంది. చట్టబద్ధత అంశం కూడా ఇటీవల కాలం వరకూ పెండింగ్‌లో ఉండటంతో అధికారులు ముందడుగు వేయలేదు. ఆ సమస్య కూడా పరిష్కారం అవడంతోపాటు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేరుగా రైతులతో చర్చించారు. ఏడాది కౌలును రూ.40 వేలకు పెంచారు. రుణమాఫీ గతంలో ఉన్నట్లుగానే రూ.1.50 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారు. దీనిపై రైతులు సంతోషం వ్యక్తం చేసినా పూలింగు ప్రక్రియ వేగవంతం అవలేదు. సింగపూర్ పర్యటనకు ముందు మంత్రి నారాయణ వైకుంఠపురంలో సమావేశం ఏర్పాటు చేయగా అక్కడి రైతులు ఇన్నర్ రింగురోడ్డు లోపల తమకు స్థలాలివ్వాలని కోరారు. దీనికి మంత్రి స్పందిస్తూ సీడ్‌యాక్సెస్ రోడ్డు వైకుంఠపురం వరకూ వస్తుందని, తూర్పు, పడమర వైపు (ఈ సిరీస్) నెంబరు రోడ్లన్నీ రెండోదశ పూలింగు ఏరియాలోకి వస్తాయని, అటువంటప్పుడు ఎక్కడైతే ఏమిటని అన్నారు. అయితే రైతులకు సానుకూలంగా చేస్తామని చెప్పారు. **త్వరలో మాస్టర్ ప్లాను:** రెండోదశకు సంబంధించి రైతులకు ఇవ్వాల్సిన ప్లాట్లకు సంబంధించి మాస్టర్ ప్లాను తుది రూపు పూర్తయినట్లు తెలిసింది. త్వరలోనే దీన్ని విడుదల చేయనున్నారు. అయితే ముఖ్యమంత్రి చేతులమీదుగా విడుదల చేయించే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. ఈ ప్లానులో గతంలో మాదిరి కాకుండా రైతులకు ఇవ్వాల్సిన ప్లాట్లన్నీ ఒకచోట ఉండేలా, అది కూడా మూడు, నాలుగు గ్రామాలకు కలిపి ఒకేచోట ఇచ్చేలా ప్లాను రూపొందిస్తున్నారు. దీనివల్ల సిఆర్‌డిఎకు చెందాల్సిన భూములన్నీ ఒకేచోట ఉండేలా ప్లాను రూపొందిస్తున్నారు.

తెలంగాణలో కదలని బస్సులు

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఏప్రిల్22: తెలంగాణలో రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు పెద్ద ఎత్తున సమ్మె దిగారు. ప్రభుత్వంతో చర్చలు విఫలం కావడంతో అర్ధరాత్రి నుంచి కార్మికులు సమ్మెకు సైరన్ మోగించారు. దీంతో డిపోల్లోనే ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. సమ్మెతో రాష్ట్రవ్యాప్తంగా ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు పలుచోట్ల ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించగా మరికొన్ని చోట్ల ప్రజల ఇబ్బందుల దృష్ట్యా ఆర్టీసీ అద్దె బస్సులు నడుపింది. తొలిరోజు(బుధవారం) ఆర్టీసి కార్మికుల సమ్మె ప్రశాంతంగా సాగింది. చాలా ప్రాంతాల్లో మగవారి నుంచి టికెట్ తీసుకోకుండా బస్సుల్లో ఎక్కించుకున్నారు

నాదెండ్ల కన్నుమూత

>> పని చేశారు. తెలుగుదేశం పార్టీ రాజకీయ చరిత్రలో నిలిచిపోయే ఆగస్టు సంక్షోభంలో ఆయన కీలక పాత్రధారి. అప్పట్లో ఎన్టీఆర్ వెన్నంటే ఉండి, ఆపై ఆయనకే వ్యతిరేకంగా వ్యవహరించారు.కాంగ్రెస్‌తో కలిసి ఎన్టీఆర్‌ను గద్దె దించారు.అయితే శాసనసభ్యుల మద్దతు కూడగట్టలేక పదవికి రాజీనామా చేసారు. 1935 జూన్ 23న గుంటూరులో జన్మించిన నాదెండ్ల భాస్కరరావు, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. వృత్తిరీత్యా న్యాయవాది అయిన ఆయన 1978లో విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికై, మర్రి చెన్నారెడ్డి, అంజయ్య మంత్రివర్గాల్లో కీలక శాఖలను నిర్వహించారు. 1982లో నందమూరి తారక రామారావు ఖితెలుగుదేశంఖి పార్టీని స్థాపించినప్పుడు భాస్కరరావు కీలక పాత్ర పోషించారు. 1983 ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధించాక, ఎన్టీఆర్ కేబినెట్‌లో ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఎన్టీఆర్ టెక్సాస్‌లో గుండె శస్త్రచికిత్స చేయించుకుని తిరిగి వచ్చిన వేళ రాష్ట్ర రాజకీయాలు అనూహ్య మలుపు తిరిగాయి. కాంగ్రెస్ మద్దతుతో 1984 ఆగస్టు 16న భాస్కరరావు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. సరిగ్గా నెల రోజులకే పదవి నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. తిరిగి కాంగ్రెస్‌లో చేరి 1998లో ఖమ్మం ఎంపీగా గెలుపొందారు. 2019లో ఆయన బీజేపీలో చేరారు. ప్రస్తుతం ఆయన వారసుడిగా జనసేన నాయకుడు,మంత్రి నాదెండ్ల మనోహర్ ఏపీ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. కుటుంబ సభ్యులు, బంధువులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అభిమానులు అంతిమ నివాళులు అర్పించుకోవడానికి వీలుగా, ఆయన పార్థివ దేహాన్ని జూబిలీహిల్స్ లోని వారి స్వగృహం వద్ద ఉంచారు. గురువారం మధ్యాహ్నం 4 గంటలకు పంజాగుట్ట, హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహిస్తారు.

నెలలోగా పిపిపి మెడికల్ కాలేజీలు

>> వంటి వ్యాధులు నియంత్రణకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాల్సి ఉందన్నారు.

సంతానోత్పత్తిలో చిట్టచివరన విశాఖ జిల్లా: జనాభా నియంత్రణ నుంచి జనాభా సంరక్షణ దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో సంతానోత్పత్తి రేట్ 2.1 నుంచి 1.5కి తగ్గిందని, అత్యధికంగా కడప జిల్లాలో 1.99 ఫెర్టిలిటీ రేట్ ఉంటే, అత్యల్పంగా 1.32 విశాఖపట్నంలో నమోదైందని అధికారులు ముఖ్యమంత్రికివివరించారు. ఫెర్టిలిటీ రేటు 2.1 లక్ష్యంగా ముందుకు వెళ్లాలని, లక్ష్యం కన్నా 6శాతం తక్కువలో ఉన్నామని సీఎం స్పష్టం చేశారు. తల్లికి వందనం పాపులేషన్ మేనేజ్మెంట్ కార్యక్రమంలో భాగమేనని చెప్పారు. మన దేశ కుటుంబ వ్యవస్థ పటిష్టంగా ఉందని దీనిని కాపాడుకునేందుకు మైక్రోఫ్యామిలీ సంస్కృతి విస్తరించకుండా చూడాలన్నారు. ఉమ్మడిపెద్ద కుటుంబాలకు అధిక ప్రోత్సాహకాలు ప్రణాళిక రూపొందించాలని సీఎం సూచించారు. జనాభా నిర్వహణ అంశాన్ని కూడా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని చెప్పారు. పాపులేషన్ మేనేజ్మెంట్‌తో పాటు ప్రజారోగ్య రక్షణకు కార్యాచరణ చేపట్టాలన్నారు. అలాగే సమతుల్య ఆహారం తీసుకోకపోవడం వల్ల ఎక్కువ మంది అనారోగ్యం పాలవుతున్నారని, పోషకాహారంప్రివెంటివ్ హెల్త్ పై దృష్టి పెట్టేలా చూడాలన్నారు. ఆయుర్వేద, నేచురోపతి చికిత్సా విధానాలను కూడా ప్రోత్సహించాలని సీఎం స్పష్టం చేశారు. ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేలా ఆస్పత్రులకు వచ్చిన రోగులకు వారి రికార్డుల ఆధారంగా డైట్ ప్యాట్రన్, పోషకాహారం అందించాల్సి ఉందన్నారు.ఈ సమీక్షకు వైద్యారోగ్య శాఖ, ఆర్థిక, స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు శాఖ, కార్మిక, మహిళా శిశు సంక్షేమ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

సమన్వయం ద్వారా సమగ్ర అభివృద్ధి

>> వీక్‌లో ఏర్పాటు చేసిన ఇండియన్ పెవిలియన్‌ను ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఇండియన్ పెవీలియన్ విచ్చేసిన మంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి ఘన స్వాగతం పలికిన కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్ జలమార్గాల మంత్రిత్వ శాఖ సెక్రటరీ విజయ్ కుమార్, జాయింట్ సెక్రటరీ వెంకటేశపతి, ఇండియన్ పోర్ట్స్ అసోసియేషన్ ఎండి నీలాభ్ర దాస్‌గుప్తా, ఏపీ మారిటైమ్ బోర్డు సీఈవో అభిషేక్ కుమార్, ఏపీ మారిటైమ్ బోర్డు ఈడి ప్రతాపరెడ్డి, ఇతర ఉన్నతాధికారులు. 4 రోజులపాటు నిర్వహిస్తున్న సింగపూర్ మారిటైమ్ వీక్ 2026లో ఇండియన్ పెవిలియన్ ప్రత్యేక ఆకర్షణగా నిలవడంపై మంత్రి అభినందనలు తెలిపారు. ఇండియన్ పెవిలియన్‌లో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో మారిటైమ్ రంగంలో ఉన్న అవకాశాలు, పోర్టుల అభివృద్ధి, పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ప్రమోట్ చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, ప్రస్తుతం నెలకొన్న అనుకూల వాతావరణంపై మరింత విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహించాలని అధికారులకు సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా మారిటైం లాజిస్టిక్ రంగంలో వేగంగా వస్తున్న మార్పులు, పోర్టుల మౌలిక సదుపాయాల అభివృద్ధి డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ వంటి అంశాలపై ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను మంత్రులు పరిశీలించారు.

విఓఎలకు రూ.22.67కోట్ల ప్రోత్సాహక నిధులు

>> వివోఏలకు ఈ నిధులు ప్రోత్సాహకంగా అందజేస్తారు.ఇప్పటికే స్త్రీనిధి ద్వారా గ్రామ సంఘాలకు 0.25శాతం ప్రోత్సాహకాలు ఇచ్చారు.స్వయం సహాయక సంఘాలు నుంచి వసూలైన వడ్డీ ఆధారంగా 0.75శాతం ప్రోత్సాహకాన్ని వివోఏలకు ఇవ్వాలని నిర్ణయించారు.గ్రామస్థాయిలో స్త్రీనిధి రుణాల వసూలు,సంఘాల బలోపేతానికి వివోఏలు అందిస్తున్న సేవలు కీలకమని మంత్రి కొండపల్లి పేర్కొన్నారు.వారి కష్టానికి తగిన ప్రతిఫలాన్ని అందించాలన్నఉద్దేశ్యంతోనే ఈ నిధులు తక్షణమే గ్రామ సంఘాల ఖాతాల్లో జమచే యాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

నైపుణ్యాభివృద్ధి శాఖలో ఇంటర్నేషనల్ స్కిల్లింగ్ సలహాదారు
సీతా శర్మ రాజీనామా !

విజయవాడ,ఏప్రిల్ 22, ప్రభాతవార్తప్రతినిధి: నైపుణ్యాభివృద్ధి శాఖలో ఇంటర్నేషనల్ స్కిల్లింగ్ సలహాదారు సీతా శర్మ తన పదవికి రాజీనామా చేశారు. ఆమె రాజీనామాను ఆమోదిస్తూ నైపుణ్యాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీచేసింది. నైపుణ్య కల్పనలో విదేశీ సంస్థలతో సమన్వయం, ఇక్కడి యువతకు అక్కడి అవసరాలపై శిక్షణ అంశాలపై ఆమె పనిచేశారు. 2025 జనవరిలో రెండేళ్ల కాల పరిమితితో ఆమె నియమితులయ్యారు. 2027 జనవరి వరకూ పదవిలో కొనసాగే అవకాశం ఉన్నప్పటికీ ఆమె ముందుగానే రాజీనామా చేసి వెళ్లిపోయారు.విభాగ పరమైన సమస్యల కారణంగా ఆమె తన పదవి కాలం ముగియడానికి ముందుగానే రాజీనామా చేసారు.

ముగ్గురి మృతి

మృతులు(ఫైల్)

>> 19న కారులో చెన్నైకు వెళ్లారు. చికిత్స అనంతరం తిరిగి వస్తుండగా బుధవారం ఉదయం వీరవల్లి టోల్‌ప్లాజా సమీపంలో వారి కారు అదుపు తప్పి రోడ్డు పక్కనున్న సూచిక బోర్డును బలంగా ఢీకొట్టింది. ఈప్రమాదంలో హనుమంత రావు, రాజు, సాగర్ తీవ్ర గాయా లతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కారులో ఉన్న మరో వ్యక్తి గన్నిన నరేంద్రకు తీవ్ర గాయాలవడంతో హైవే అంబులెన్స్ పై వెంటనే రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసు పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదే హాలను పోస్టుమార్టం నిమిత్తం గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఎమ్మెల్సీ అనంతబాబు కోసం పోలీసుల గాలింపు

>>కాకినాడ భానుగుడి సెంటర్ శంకర్ టవర్స్ అపార్ట్మెంట్ అనంతబాబు ప్లాట్‌లో పోలీసులు స్వాదాలు నిర్వహించారు. ఎమ్మెల్సీ అనంతబాబును ఏ క్షణమైనా అరెస్టు చేసే అవకాశం వుందని చెబుతున్నారు.

మాజీ సీఎం నాదెండ్ల భాస్కరరావు మృతిపట్ల సీఎం చంద్రబాబు సంతాపం: మాజీ సీఎం నాదెండ్ల భాస్కరరావు మృతి పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంతాపం తెలిపారు. భాస్కరరావు తనయుడు, క్యాబినెట్ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఫోన్‌చేసి పరామర్శించారు. మనోహర్ కుటుంబ సభ్యులకు తన సానుభూతి తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర రావు తుది శ్వాస విడిచారని తెలిసి చింతిస్తున్నానని డీసీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానన్నారు. న్యాయవాదిగా, రాజకీయవేత్తగా ఆయనకున్న పరిజ్ఞానం ఎంతో విలువైనదన్నారు. విజయవాడ ఈస్ట్, వేమూరు నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యేగా, ఖమ్మం నుంచి ఎంపీగా గెలిచి సేవలందించారని పవన్‌పేర్కొన్నారు. నాదెండ్ల భాస్కరరావు కుమారుడు, నాసహచర మంత్రి, జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాలకమిటీఛైర్మన్ మనోహర్ పితృ వియోగం బాధ నుంచి త్వరగా కోలుకోవాలి. మనోహర్‌కి,కుటుంబసభ్యులకు ప్రగాఢసానుభూతి తెలియచేస్తున్నానని పవన్ పేర్కొన్నారు.

బెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లా బెర్హంపూర్‌లో బుధవారం ఎన్నికల సామాగ్రితో పోలింగ్ సిద్ధమవుతున్న సిబ్బంది

పూర్తి 'డీల్' కుదిరేదాకా ఇరాన్‌తో కాల్పుల విరమణ

>> దిగ్బంధం కొనసాగించాలని ట్రంప్ తీసుకున్న నిర్ణయంపై ఇరాన్ మండిపడింది. ఇది కాల్పుల విరమణకు వ్యతిరేకమని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ ఆరాఘ్చి విమర్శించారు. వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకోవడమంటే యుద్ధచర్యలతో సమానం అన్నారు. తమ ప్రయోజనాలను రక్షించుకోవడం ఇరాన్‌కు తెలుసని స్పష్టం చేశారు. ఇక పాక్‌లో జరగాల్సిన చర్చలకు హాజరుకాకూడదని ఇరాన్ నిర్ణయించుకున్నట్లుగా తస్నీమ్ వార్త సంస్థ వెల్లడించింది. అమెరికా మితిమీరిన డిమాండ్లు తీసుకువస్తోందని అవి ఒప్పందానికి అడ్డుగా మారుతున్నాయి కాబట్టి చర్చల్లో పాల్గొనడం వ్యర్థమని ఇరాన్ అభిప్రాయపడినట్లుతస్నీమ్ వార్తాసంస్థ వెల్లడించింది.

ట్రంప్ మైండ్‌గేమ్ ముమ్మరం...

ఓపక్క శాంతి చర్చలు అంటూనే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రత్యర్థులతో తన మైండ్‌గేమ్ తీవ్రంచేసారు. ఇరాన్ ఆర్థికంగా కుదేలవుతున్నదని తెలిపారు. హోర్ముజ్ జలసంధిలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నందున ఇరాన్ ఆదాయం పడిపోతున్నట్లు చెప్పారు. హర్ముజ్‌ను తక్షణమే ఓపెన్ చేయాలని ఇరాన్ భావిస్తున్నదని, ఎందుకంటే ఆదేశానికి నగదు కొరత ఏర్పడిందన్నారు. ప్రతి రోజూ ఆ దేశం సుమారు 500 మిలియన్ల డాలర్లు నష్టపోతున్నదని ట్రంప్ తెలిపారు. మిలిటరీకి, పోలీసులకు జీతాలు అందడం లేదని ఫిర్యాదులు వస్తున్నట్లు ట్రంప్ చెప్పారు. హర్ముజ్‌ను మూసిన ఇరాన్ ఆ పరిస్థితి నుంచి బయటపడేందుకు ఇబ్బందిపడుతున్నట్లు ఆయన తెలిపారు. జలసంధిని బ్లాకేడ్ చేసినట్లు తాము చెప్పడం వల్లే ఇరాన్ దాన్ని మూయాలని భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. వాస్తవానికి నాలుగు రోజుల క్రితం తన వద్దకు కొందరు వచ్చి హర్ముజ్‌ను ఓపెన్ చేయాలని కోరారని, కానీ హర్ముజ్‌ను తాము ప్రారంభిస్తే, ఇరాన్‌తో డీల్ కుదుర్చుకోలేమన్నారు. ఒకవేళ ఆ దేశాన్ని మొత్తం పేల్చివేస్తే తప్ప మళ్లీ ఆ డీల్ కుదిరే అవకాశం ఉండదని ట్రంప్ అన్నారు.

జెడివాన్స్ పాక్ పర్యటన వాయిదా...

అమెరికా, ఇరాన్ మధ్య శాంతి చర్చల పునరుద్ధరణపై నెలకొన్న ఉత్కంఠకు ఇప్పటికీ ముగింపులేదు. పాకిస్థాన్‌లో జరగాల్సిన రెండో విడత చర్చల కోసం అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నేతృత్వంలోని బృందం చేయాల్సిన పర్యటన తాత్కాలికంగా వాయిదా పడింది. చర్చల్లో పాల్గొనడంపై ఇరాన్ నుంచి ఎలాంటి స్పష్టమైన హామీ రాకపోవడమే ఇందుకు కారణమని వైట్‌హౌస్ వర్గాలు వెల్లడించాయి. మధ్యవర్తిత్వం వహిస్తున్న పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ అభ్యర్థన మేరకు ఇరాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందాన్ని నిరవధికంగా పొడిగిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ విషయాన్ని తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్ సోషల్‌లో వెల్ల డించారు. ఇరాన్ ఒక స్పష్టమైన ప్రణాళికతో ముందుకు వచ్చేవరకు ఈ సీజ్‌ఫైర్ కొనసాగుతుందని తెలిపారు. దీనితో ఉపాధ్యక్షుడు జెడివాన్స్‌తో కూడిన బృందం ఇస్లామాబాద్ పర్యటనను వాయిదావేసుకోవాల్సి వచ్చింది.

విజయవాడలో మరో శాటిలైట్ రైల్వే స్టేషన్

>> ఉంటుంది. మధురా నగర్, గుణదల స్టేషన్ల నుంచి ఇతర రైళ్లకు ఇంటర్ చేంజ్ అవకాశం ఉండదు. బల్బ్ లైన్ నిర్మాణ సమయంలోనే భవిష్యత్ అవసరాలకు సరిపోయేలా రైల్వే భూసేకరణ చేసింది.ప్రస్తుతం ఆ భూముల్లో ఆక్రమణలు వెలిశాయి. గత 30 ఏళ్లలో ఏకంగా కాలనీలు తయారు అయ్యాయి. వాటిని ఖాళీ చేయించడం రైల్వేకు తలకు మించిన భారం అవుతోంది.శాటిలైట్ స్టేషన్ రాజరాజేశ్వరి పేట శివారు, ప్రస్తుత సుబ్బరాజు కాలనీ, అల్లు జయలక్షి ్మ కాలనీ(ఇవి రైల్వే స్థలాలు) నిర్మిస్తే విశాఖ వైపు ప్రయాణించే వారికి, విజయవాడ స్టేషన్ వచ్చే వారికి వీలుగా ఉంటుంది. అక్కడ ప్లాట్ ఫాం ఏర్పాటు చేసినా ప్రధాన రైల్వే స్టేషన్ మీద ఒత్తిడి తగ్గుతుంది. నగర ప్రజా ప్రతినిధులు దీనిపై దృష్టి పెట్టాలి. మొదటి వృత్తం రైల్వే జంక్షన్, రెండోది గ్రాండ్ ట్రంక్ మార్గంలో విశాఖ వైపు వెళ్ళే బల్బ్ లైన్. అది అయోధ్య నగర్, న్యూ ఆర్ ఆర్ పేట మధ్య తిరిగి ప్రధాన రైల్వే లైన్ లో కలుస్తుంది.

బెంగాల్‌లో బాబ్రీమసీదునిర్మాణం కల్ల: హోంమంత్రి అమిత్‌షా

ఉత్తర 24 పరగణాలు(బెంగాల్), ఏప్రిల్ 22: పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా మరోసారి ఘాటు విమర్శలు చేశారు. మమతా దీదీ ఎంత బలంగా కోరుకున్నా, ఎన్ని గట్టి ప్రయత్నాలు చేసినా బెంగాల్‌లో బాబ్రీ మసీదును బీజేపీ కట్టనీయదని స్పష్టం చేశారు. టీఎంసీ సిండికేట్ ముఠాలను బెంగాల్ నుంచి పారిపోయేలా చేస్తామన్నారు. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల తొలివిడత పోలింగ్ ఈనెల 23న జరుగనుండగా, రెండో విడత ప్రచారంలో భాగంగా నార్త్ 24 పరగణాల జిల్లాలోని డుమ్ డుమ్ ఉత్తర్ ఏరియాలో బుధవారంనాడు జరిగిన ర్యాలీలో అమిత్‌షా పాల్గొన్నారు. బెంగాల్ మొత్తం సిండికేట్లమయంగా మారింది. సిమెంట్, ఇసుక, ఇటుకలు ఏమి కావాలన్నా మీరు సిండికేట్లకు డబ్బులు చెల్లించాలి. డమ్‌డమ్ ప్రజలకు నేను ఒకటే చెప్పదలచుకున్నాను. ఈనెల 5వ తేదీ తర్వాత ఈ సిండికేట్ సభ్యులు తట్టాబుట్టా సద్దుకుని బెంగాల్ నుంచి పారిపోవడమో, వసలపోవడమో జరుగుతుందని అమిత్‌షా అన్నారు. హుమయూన్ కబీర్ పేరుతో బాబ్రీ మసీదు నిర్మించాలని మమతాబెనర్జీ కోరుకుంటున్నారని అమిత్‌షా విమర్శించారు. ఎవరూ ఆందోళన చెందవద్దు. మమతా దీదీ ఎంత గట్టిగా కోరుకున్నప్పటికీ బెంగాల్‌లో బాబ్రీ మసీదు నిర్మాణాన్ని బీజేపీ అనుమతించే ప్రసక్తే లేదు అని అన్నారు. ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ, దుర్గాపూర్ మెడికల్ కాలేజీ, సౌత్ కోల్‌కతా లా కాలేజీలో ఘటనలు చూస్తే రాష్ట్రంలో శంతిభద్రతలు ఎంత దయనీయంగా ఉన్నాయో అర్థమవుతుందన్నారు. రాత్రివేళల్లో మహిళల సంచారంపై మమతాబెనర్జీ చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటని విమర్శించారు. మే 5 తర్వాత ఆ పరిస్థితి ఉండదని, చిన్నారి ఆడపిల్లలు కూడా ధైర్యంగా స్కూటరుపై బయటకు వస్తే ఏ దుండగుడు అడ్డుకునే పరిస్థితి ఉండదని చెప్పారు. సోనార్ బంగ్లా కలను బీజేపీ సాకారం చేస్తుందని, బెంగాల్ సంస్కృతి, వారసత్వాన్ని తిరిగి సుసంపన్న చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ ఖాతా కూడా తెరవదనికాంగ్రెస్ పార్టీ తమిళనాడు, పుదుచ్చేరిలో రెండంకెల స్థాయిలో కూడా సీట్లు తెచ్చుకోలేదని, బెంగాల్‌లో ఆ పార్టీ ఖాతా తెరిచే పరిస్థితి కూడా లేదని అమిత్‌షా

వాసుదేవరెడ్డి,ధనుంజయ రెడ్డి ప్రాసిక్యూషన్‌కు అనుమతి కోరిన సిట్
లిక్కరు స్కాం కేసు

విజయవాడ,ఏప్రిల్ 22,ప్రభాతవార్తప్రతినిధి: ఏపీ మద్యం కుంభకోణం కేసులో ఐఏఎస్ మాజీ అధికారి ధనుంజయ రెడ్డి, ఐఆర్‌టీఎస్ అధికారి వాసుదేవ రెడ్డిని ప్రాసిక్యూషన్‌కు చేసేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ఆయా విభాగాలకు సిట్ లేఖలు రాసింది. లిక్కర్ స్కామ్‌లో ఇప్పటికే వీరిరువురినీ సిట్ అధికారులు అరెస్ట్ చేయగా... ప్రస్తుతం బెయిల్‌పై విడుదలయ్యారు. దీంతో ధనుంజయ్ రెడ్డిని ప్రాసిక్యూషన్ చేసేందుకు డీఓపీటీకి, వాసుదేవ రెడ్డిని ప్రాసిక్యూషన్ చేసేందుకు సిట్ అధికారులు. ఐఆర్‌టీఎస్‌కు లేఖ రాశారుఅవినీతి నిరోధక చట్టంలోని పలు సెక్షన్ల కింద న్యాయవిచారణ జరపాలంటే సంబంధిత విభాగాల నుంచి అనుమతి అవసరమని సిట్ అధికారులు తెలిపారు.ఇరువురినీ ప్రాసిక్యూషన్ చేసేందుకు ఆయా విభాగాలకు అధికారులు లేఖలను పంపించారు. లిక్కర్ కుంభకోణంలో వాసుదేవరెడ్డి ఏ2గా, ధనుంజయ్ రెడ్డి ఏ 31 నిందితులుగా ఉన్నారు.

మూడేళ్లలో మళ్లీ వైకాపా ప్రభుత్వమే

>> గడిపారు. లింగాల మండలం ఇప్పట్ల గ్రామంలో ఇటీవల మరణించిన పార్టీ నాయకుడు సుధాకర్ రెడ్డి కుటుంబాన్ని ఆయన స్వయంగా పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చుతూ ధైర్యంగా ఉండండి.. మీ కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది అంటూ భరోసా ఇచ్చారు. ఇప్పట్లకు బయలు దేరిన జగన్ మోహన్ రెడ్డికి దారి పొడవున చిన్నారులు మహిళలు పెద్ద ఎత్తున తరలి వచ్చి కాన్వాయ్ కి కోసం ఎదురు చూస్తున్న ప్రతి ఒక్క చోట ఆపి అక్కడ ఉన్న ప్రజల్ని ఆప్యాయంగా పలకరించారు. ఈ పర్యటన లో భాగంగా కడప-పార్నపల్లి రహదారిపై రాజారెడ్డి కాలనీకి చెందిన నిర్వాసితులు జగన్‌ను కలిసి తమ గోడును వినిపించారు. జాతీయ రహదారి నిర్మాణం కారణంగా తమ ఇళ్లు కోల్పోతున్నామని, ప్రభుత్వం తగిన పరిహారం ఇవ్వడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.వారి సమస్యలను శ్రద్ధగా విన్న జగన్ మోహన్ రెడ్డి ప్రస్తుతం పోరాటం చేద్దాం అయిన న్యాయం జరగకపోతే మూడేళ్లలో మనం అధికారంలోకి వస్తాం అప్పుడైనా తప్పకుండా న్యాయం చేస్తాం అని స్పష్టం చేశారు. అవసరమైతే బాధితుల కోసం పోరాటం చేయడానికి కూడా సిద్ధమని తెలిపారు. ఇప్పట్ల గ్రామానికి చేరుకున్న జగన్, అక్కడి శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో ఈ మధ్య మృతి చెందిన సుధాకర్ రెడ్డి ఇంటికి వెళ్ళి నివాళులు అర్పించారు. మీ కుటుంబానికి ఎల్లపుడు అవినాష్ రెడ్డి అండగా ఉంటాడు అని మీకు ఏ సమస్య వచ్చినా మీకు న్యాయం చేస్తాడు అని అధైర్య పడవద్దు ధైర్యంగా ఉండండి అని భరోసా ఇచ్చారు. అక్కడ నుంచి పులివెందులలోని క్యాంప్ కార్యాలయానికి చేరుకుని ప్రజాదర్బార్ నిర్వహించారు. పులివెందుల పర్యటనలో జగన్ ప్రజలతో నేరుగా మమేకమవుతూ, వారి సమస్యలను తెలుసు కోవడంపై దృష్టి సారించడం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. ప్రజల సమస్యలపై స్పందిస్తూ, భవిష్యత్తులో న్యాయం చేస్తానన్న హామీతో ఆయన పర్యటన రాజకీయంగా కూడా ప్రాధాన్యం సంతరించుకుంది.

వారం - వర్జ్యం

23-04-2026, గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
వైశాఖమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, శుక్లపక్షం, అశ్విని కార్తె
సప్తమి రా.8.54
పునర్వసు రా.9.01
వర్జ్యం : తె.4.47-ఉ.6.20, 2) ఉ.9.39-11.10
దు.ఉ.10.00-ఉ.10.51, 2)మ.2.56-మ.3.46
శుభసమయం: ఉ.5.30-6.30
రాహుకాలం - మ.1.30-3.00

వార్తాఫలం

మేషం: పెట్టుబడి పెట్టిన వారికి భోగములను ఇవ్వవలసి రావచ్చును. దీర్ఘకాలిక సమస్యల నుండి బయటపడతారు.

వృషభం: ఆర్థికాభివృద్ధిని సాధిస్తారు. అనేకాంశములు అనుకూలంగా ఉండడం వలన ఉత్సహంతో కార్యసాధన చేస్తారు.

మిథునం: నహోన్నిన్ని, ఓర్పును కనబరుస్తారు. దృష్టికి సంబంధించిన అనారోగ్యాలను ఎదుర్కొనవలసి వస్తుంది.

కర్కాటకం: బంధువులకు సంబంధించిన కొన్ని వ్యవహారములను పర్యవేక్షించవలసి వస్తుంది. సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

సింహం: గృహములోని ఖర్చులను తగ్గించుటకు చేసే యత్నములు అనుకూలించవు. శత్రువుల నుండి రాజీయత్నములు వస్తాయి.వస్త్రలాభం.

కన్య : మీరు ఊహించని విధంగా ఆశ్చర్యం కలిగించే రీతిలో ఒకనొక విషయంలో లాభపడతారు. నూతన విద్యావకాశాలు కలవు.

తుల: మిత్రులతో స్పర్థలు ఏర్పడతాయి. జాగ్రత్తలు వహించండి. ముఖ్యమైన వ్యవహారాలు సాఫీగా పూర్తిచేస్తారు.

వృశ్చికం: రోటిన్ సంతకాల విషయంలో జాగ్రత్తలు పాటించండి. వృత్తి వ్యాపారాలలో ప్రోత్సాహం లభిస్తుంది. ధనలాభం.

ధనుస్సు: ప్రతిష్టకు పోకుండా చర్చలతో సమస్యను పరిష్కరించుకుంటారు. ఆర్థిక లావాదేవీలు లాభిస్తాయి. వస్త్రలాభం.

మకరం: కుటుంబసభ్యుల ఆదరాభిమానాలు మీకు అండగా నిలుస్తాయి. శ్రమకు తగిన ఫలితం లభిస్తుంది.

కుంభం: ప్రతిఫలాపేక్ష లేకుండా ఇతరులకు సహాయసహకారాలు అందిస్తారు. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం.

మీనం: అదనపు ఆదాయము లభించే మార్గాలు అనుకూలిస్తాయి. నిత్యం ఆధ్యాత్మిక ప్రసంగాలు మీకు మేలు చేస్తాయి. శుభవార్తలు అందుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

తిరుమల సమాచారం

శ్రీవారి ఆలయంలో భాష్యకార్ల సాత్తుమొర

తిరుమల, ఏప్రిల్ 22 ప్రభాతవార్త ప్రతినిధి: శ్రీవారి ఆలయంలో బుధవారం భాష్యకార్ల సాత్తుమొర ఘనంగా జరిగింది. రామానుజులవారు జన్మించిన వైశాఖ మాస అరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా భాష్యకార్ల సాత్తుమొర నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఉదయం భాష్యకార్ల నిఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఆ తరువాత నడకదారిలోని భాష్యకార్ల సన్నిధిలో వైభవంగా అభిషేకం చేపట్టారు. సాయంత్రం సహస్రదీపాలంకార సేవ అనంతరం శ్రీదేవి భూదేవి సమేత మలయప్ప స్వామి ని ఒక తిరుచ్చిపై, భాష్యకార్లవారిని మరో తిరుచ్చిపై ఆలయ మాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఆ తరువాత ఆలయంలో విమాన ప్రాకారం చుట్టూ ప్రదక్షిణ చేశారు. రాత్రి భాష్యకార్లవారి సన్నిధిలో సాత్తుమొర నిర్వహిస్తారు. ప్రత్యేక ఆభరణాలతో సల్లింపు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, ఆలయ పారుపత్తేదార్ హిమత్‌గిరి, ఆలయ పేష్కార్ రామకృష్ణ, అర్చకులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, ఏప్రిల్ 22 ప్రభాతవార్త ప్రతినిధి: కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వర స్వామిని బుధవారం ఉదయం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఉదయం విఐపి బ్రేక్‌లో మలయాళం సినీ నటుడు దిలీప్, సినీ నటి కావ్య మాధవన్ కుటుంబం, కన్నడ నటి శరణ్యశెట్టి వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకుని దేవదేవుని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

తిరుచానూరు పద్మావతి ఆలయానికి ఎసిలు బహూకరణ

తిరుమల, ఏప్రిల్ 22 ప్రభాతవార్త ప్రతినిధి: టిటిడి ఆధ్వర్యంలోని తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయానికి రూ. 78 వేలు విలువైన రెండు ఎయిర్ కండీషనర్ యంత్రాలను దాత అందించారు. హైదరాబాద్‌కు చెందిన భక్తులు పూజ కౌశిక్, స్వాతి కౌశిక్ బుధవారం ఉదయం ఈ ఎసిలను అందజేశారు. ఆలయ ఎఇఒ దేవరాజులుకు దాతలు అందజేశారు. వీటిని ఆలయ పరాకామణి విభాగంలో వినియోగించనున్నట్లు అధికారులు తెలిపారు.

ఉత్తరాంధ్రకు మరో భారీ ప్రాజెక్ట్

- రాంబిల్లిలో రెన్యువబుల్ విప్లవం
- రూ.5,400 కోట్ల పెట్టుబడులతో రెన్యూ ఎనర్జీ గ్లోబల్
- 2,100 మందికి ఉపాధి కల్పించేలా ఎనర్జీ ప్లాంట్
- నేడు సిఎం చంద్రబాబు చేతుల మీదుగా శంకుస్థాపన



విజయవాడ ఏప్రిల్ 22 ప్రభాతవార్త ప్రతినిధి: పారిశ్రామిక రంగంలో అనకాపల్లి జిల్లా పేరు మరోసారి మార్మోగనుంది. ఆర్సెల్లార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపనతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పారిశ్రామిక వర్గాల్లో అనకాపల్లి జిల్లాపై జరిగిన చర్చ.. ఇప్పుడు మరోసారి ప్రస్తావనకు రానుంది. ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలు రెన్యూవబుల్ ఎనర్జీ ఉత్పత్తిపై ఫోకస్ పెడుతున్న క్రమంలో ఏపీలోని కూటమి ప్రభుత్వం ఆ రంగానికి హై ప్రయార్టీ ఇస్తోంది. దీంట్లో భాగంగా రాష్ట్రంలో క్లీన్ ఎనర్జీ ఉత్పత్తి సంస్థలకు పెద్దపీట వేస్తోంది. ఈ క్రమంలో రెన్యూవబుల్ రంగంలో భారీ పెట్టుబడులతో ఎనర్జీ ప్లాంట్ స్థాపించేందుకు ప్రముఖ రెన్యూ ఎనర్జ గ్లోబల్ సంస్థ ముందుకొచ్చింది. క్లీన్ ఎనర్జీ రంగంలోని ప్రధాన సంస్థల్లో ఒకటిగా ఉన్న రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ ఇప్పటికే దేశంలో 19.2 గిగావాట్ల సామర్థంతో వివిధ ప్రాంతాల్లో క్లీన్ ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేసి ప్రముఖ స్థానంలో ఉంది. అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ 6 గిగా వాట్లకు పైగా ఉత్పత్తి సామర్థంతో క్లీన్ ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటుకు ముందుకు వచ్చింది. దీంట్లో భాగంగా ఆ ప్లాంట్‌కు భూమి పూజ గురువారం జరగనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు భూమి పూజ చేయనున్నారు. మొత్తంగా రూ.5,400 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు చేయబోయే సంస్థకు భూమి పూజ చేపట్టడంతో అనకాపల్లి జిల్లా అభివృద్ధికి కీలక అడుగులు పడనున్నాయి. డీకార్బనైజేషన్ రంగంలో ముందంజలో ఉన్న ఈ సంస్థ.. సుమారు రూ.4,200 కోట్ల పెట్టుబడితో 6 గిగావాట్ల సామర్థం గల సోలార్ ఇంగాట్-వేఫర్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయబోతోంది. దీంతో పాటు మరో రూ.1,200 కోట్ల వ్యయంతో 125 మెగావాట్ల హైబ్రిడ్ క్యాప్టివ్ రెన్యూవబుల్ పవర్ ప్రాజెక్ట్‌ను నిర్మించనుంది. ఈ రెండు ప్రాజెక్టులు వచ్చే రెండేళ్లలో పూర్తి కానున్నాయి.

త్వరలో రాయలసీమలో మరో భారీ ప్లాంట్: రెన్యూ సంస్థ నిర్మించే సోలార్ ఇంగాట్-వేఫర్ తయారీ యూనిట్, హైబ్రిడ్ క్యాప్టివ్ రెన్యూవబుల్ పవర్ ప్రాజెక్టుల ద్వారా సుమారు 2,100 మందికి ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. దీంతో స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు లభించనున్నాయి. రాష్ట్రంలో క్లీన్ ఎనర్జీని భారీ ఎత్తున ఉత్పత్తి చేయాలనే లక్ష   ్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుకెళ్తున్నారు. ఇంధన రంగం బలోపేతమైతే పారిశ్రామిక, వ్యవసాయ, సేవా రంగాలు వేగంగా వృద్ధి చెందుతాయని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో ఏపీని రెన్యువబుల్ ఎనర్జీకి కేంద్రంగా నిలబెట్టడమే లక్ష   ్యంగా ముఖ్యమంత్రి అడుగులు వేస్తున్నారు. గతేడాది నవంబర్‌లో విశాఖపట్నంలో జరిగిన సీఐఐ పార్టనర్ సమ్మిట్‌కు హాజరైన రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ రాష్ట్రంలో దశలవారీగా రూ.82,000 కోట్ల పెట్టుబడులు పెడతామని ప్రకటించింది. దీంట్లో భాగంగా అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటుకు పనులను ప్రారంభించనుండగా త్వరలోనే సుమారుగా రూ. 22,000 కోట్లతో దేశంలోనే అతిపెద్ద హైబ్రిడ్ రిన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టులలో ఒకదాన్ని అనంతపురం జిల్లాలో ఏర్పాటు చేసేందుకు ఆ సంస్థ ప్రక్రియ చేపట్టనుంది. 201419 మధ్య కాలంలో తెలుగుదేశం ప్రభుత్వం ఉన్నప్పుడే 2015లో కళ్యాణదుర్గంలో విండ్ ప్రాజెక్ట్‌తో రాష్ట్రంలోకి రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ అడుగుపెట్టింది. 717 మెగావాట్ల విండ్, 60 మెగావాట్ల సోలార్ ఎనర్జీ సామర్థంతో ఏపీలోని రెన్యూ ఎనర్జీ గ్లోబల్ ప్లాంట్లు ఇప్పటికే పని చేస్తున్నాయి.

ఉత్తరాంధ్రలో అభివృద్ధి జోరు... పెట్టుబడుల హోరు: కూటమి ప్రభుత్వం వచ్చాక ఉత్తరాంధ్రకు పరిశ్రమలు క్యూ కడుతున్నాయి. ఇప్పటికే ఆర్సెలార్ మిట్టల్, కాగ్నిజెంట్‌కు వంటి ప్రముఖ సంస్థలకు శంకుస్థాపన చేసి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. టీసీఎస్ ఇప్పటికే కార్యకలాపాలను ప్రారంభించింది. ఈ నెలలో అతిపెద్ద అంతర్జాతీయ పెట్టుబడి గూగుల్ సంస్థకు శంకుస్థాపన చేయనున్నారు. సాఫ్ట్ వేర్, ఎనర్జీ, స్టీల్, మెడ్ టెక్, ఫార్మా వంటి రంగాల్లో ఉత్తరాంధ్ర ప్రాంతం భారీగా పెట్టుబడులను ఆకర్షిస్తోంది. అలాగే భోగాపురం ఎయిర్ పోర్టు త్వరలో అందుబాటులోకి రానుంది. మరోవైపు పర్యాటకంగా ఆధ్యాత్మికంగా కూడా ఉత్తరాంధ్రలో అభివృద్ధి పెద్ద ఎత్తున చోటు చేసుకుంటోంది.

ముఖ్యమంత్రి పర్యటన వివరాలు: గురువారం ఉదయం 09.30 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమరావతి నుంచి జెడ్.చింతువకు బయలుదేరి వెళతారు. 11.10 గంటలకు రెన్యూ గ్లోబల్ ఎనర్జీ సంస్థ శంకుస్థాపనలో కార్యక్రమంలో పాల్గొంటారు. కార్యక్రమాన్ని ముగించుకుని మధ్యాహ్నం 02.35 గంటలకు అమరావతి చేరుకుంటారు.

నాదెండ్ల భాస్కరరావు మృతి రాష్ట్రానికి తీరని లోటు

- వైసిపి అధినేత జగన్ సంతాపం

విజయవాడ, ఏప్రిల్ 22 ప్రభాతవార్త ప్రతినిధి: మాజీ సీఎం నాదెండ్ల భాస్కరరావు మృతి పట్ల సంతాపం వైసిపి అధినేత జగన్ సంతాపం వ్యక్తం చేసారు. ఏపీ రాజకీయాల్లో నాదెండ్లది విశిష్ట స్థానమని కితాబు ఇచ్చారు. ఆయన రాజకీయ అనుభవం తరతరాలకు ఆదర్శమని వ్యాఖ్యానించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు కన్ను మూసారు. కొంత కాలం నుంచి వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని కాంటినెంటల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఆయన మృతి పట్ల రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ అధినేత జగన్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ నాదెండ్ల భాస్కరరావు మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. ఏపీ రాజకీయాల్లో నాదెండ్ల భాస్కరరావు విశిష్ట స్థానం సంపాదించారని అన్నారు. ప్రజాసేవలో ఆయన నిబద్ధత, రాజకీయ అనుభవం తరతరాలకు ఆదర్శమని, ఆయన మరణం రాష్ట్రానికి తీరని లోటు అని ఆవేదన వ్యక్తం చేశారు.

వేగవంతంగా అమరావతి పనులు

- రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం
- ఖనిజాల తవ్వకం, సరఫరా కోసం

దరఖాస్తు చేసిన వారం రోజుల్లోనే అన్ని రకాల అనుమతులు

విజయవాడ, ఏప్రిల్ 22 ప్రభాతవార్త ప్రతినిధి: రాజధాని అమరావతి పనులు వేగవంతంగా పూర్తి చేయించడానికి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నిర్మాణాల కోసం ఉపయోగించే ఇసుక, కంకర, ఎర్రమట్టి తదితర ఖనిజాల సరఫరాకు పాలనాపరమైన అనుమతులు వేగంగా అందించాలని సర్కారు ఆదేశాలు జారీ చేసింది. నిర్మాణ సంస్థలు ఆ ఖనిజాల తవ్వకం, సరఫరా కోసం దరఖాస్తుచేసిన తర్వాత గరిష్ఠంగా వారం రోజుల్లోనే అన్ని రకాల అనుమతులు ఇచ్చేలా నిబంధనలను సులభతరం చేస్తూ గనుల శాఖ ముఖ్యకార్యదర్శి ముఖేశ్‌కుమార్ మీనా ఉత్తర్వులు (జీఓ 84) జారీ చేశారు. గతంలో అంటే 2016-17లో ఖనిజాల అనుమతుల కోసం నిర్దేశించిన గడువు చాలా ఎక్కువగా ఉంది. ఇప్పటికీ ఆ ఉత్తర్వులే అమల్లో ఉండటం వల్ల అమరావతి నిర్మాణంలో పాలుపంచుకొంటున్న కంపెనీలు ఇసుక, కంకర, ఎర్రమట్టి తదితర వాటి కోసం దరఖాస్తు చేసుకుంటే అన్నిరకాల అనుమతులు, ఎన్‌ఓసిలు ఇవ్వడానికి కనీసం మూడు నుంచి ఐదు నెలల సమయం పడుతోంది. దీంతో సకాలంలో మెటీరియల్ అందక నిర్మాణ పనులు ఆలస్యం అవుతున్నాయి. దీన్ని గుర్తించి ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. రాజధాని నిర్మాణ ప్రాజెక్టుల్లో భాగస్వామ్యమైన కంపెనీలు ఖనిజాల అనుమతుల కోసం దరఖాస్తు చేస్తే వారం రోజుల్లోపు నిర్ణయం తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పలు సందర్భాల్లో అధికారులకు సూచించారు. ఎర్రమట్టి, రోడ్‌మెటల్, ఇసుక, ఇతర ఖనిజాల తవ్వకం, రవాణా కోరుతూ నిర్మాణ సంస్థల నుంచి వచ్చే దరఖాస్తులను కనీసం 15 రోజుల్లోగా జిల్లా గనుల సహాయక అధికారి పరిశీలించే గడువు ఉండేది. దాన్ని 2 రోజులకే కుదించారు. మైనింగ్ దరఖాస్తు రాగానే, అది ఏ ప్రాంతం పరిధిలోకి వస్తుందో చూసి సంబంధిత తహశీల్దార్‌కు ఒక్క రోజులోనే పంపించాలి. నిరభ్యంతర పత్రం జారీకి అవసరమైన నివేదికను తహశీల్దార్ కేవలం3రోజుల్లోనే గనుల శాఖకు పంపించాలి. ఇంతకు ముందు 20 రోజుల గడువు ఉండేది. మైనింగ్ దరఖాస్తుపై సర్వే, తనిఖీ నివేదికను 3రోజుల్లో, డీఎంజీఓస్థాయిలో ప్రాసెసింగ్‌కు మరో మూడు రోజుల గడువు ఇచ్చారు. జిల్లా ఎడి, డిడి నుంచి వచ్చిన ప్రతిపాదనలను పరిశీలించి 3 రోజుల్లోనే మైనింగ్‌కు సిఫారసు చేయాలి. ఆ తర్వాత మైనింగ్‌ప్లాన్‌ను వారం రోజుల్లోనే ఆమోదించాలి. ఇక రాష్ట్ర స్థాయిలో ఇచ్చే ఎన్‌ఓసీని 5 రోజుల్లో, మైనింగ్ ఆర్డర్‌ను 2 రోజుల్లోనే ఇవ్వాలని ప్రభుత్వం

కొత్త గడువు నిర్దేశించింది. అంటే, ఏ స్థాయిలోనైనా దరఖాస్తులు వారం రోజుల్లోపే పూర్తి కావాలి. మండల, జిల్లా స్థాయిలో గరిష్ఠంగా మూడు రోజులకు మించి దరఖాస్తును అట్టిపెట్టుకోవద్దని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ దిశగా గనుల శాఖ డైరెక్టర్ వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. 2016-17లో ఖనిజాల అనుమతుల కోసం నిర్దేశించిన గడువు చాలా ఎక్కువగా ఉంది. ఇప్పటికీ ఆ ఉత్తర్వులే అమల్లో ఉండటం వల్ల అమరావతి నిర్మాణంలో పాలుపంచుకొంటున్న కంపెనీలు ఇసుక, కంకర, ఎర్రమట్టి తదితర వాటి కోసం దరఖాస్తు చేసుకుంటే అన్నిరకాల అనుమతులు, ఎన్‌ఓసీలు ఇవ్వడానికి కనీసం మూడు నుంచి ఐదు నెలల సమయం పడుతోంది. దీంతో సకాలంలో మెటీరియల్ అందక నిర్మాణ పనులు ఆలస్యం అవుతున్నాయి. దీన్ని గుర్తించి ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. రాజధాని నిర్మాణ ప్రాజెక్టుల్లో భాగస్వామ్యమైన కంపెనీలు ఖనిజాల అనుమతుల కోసం దరఖాస్తు చేస్తే వారం రోజుల్లోపు నిర్ణయం తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పలు సందర్భాల్లో అధికారులకు సూచించారు. ఈ నేపథ్యంలో ముఖేశ్‌కుమార్ మీనా రాజధాని నిర్మాణ పనులు చేస్తున్న కంపెనీల ప్రతినిధులతో మాట్లాడి పలు అంశాలపై చర్చించారు. ఇందులో ఖనిజాల తవ్వకం, రవాణా అనుమతుల్లో నెలకొంటున్న జాప్యాన్ని నివారించాలని కోరారు. అనుమతులను సులభతరం చేసే అంశంపై గనుల శాఖ డైరెక్టర్ చంద్రశేఖర్ ఇచ్చిన ప్రతిపాదనలను పరిశీలించి నూతన విధివిధానాలు రూపొందించారు.

పోలవరం గరిష్ట ఎత్తు 45.72 మీటర్లు

- 194.60 టిఎంసిల నీటి నిల్వ సామర్థ్యం
- పిపిఎ అధికారిక ప్రకటన

విజయవాడ, ఏప్రిల్ 22 ప్రభాతవార్త ప్రతినిధి: ఎపి జీవనాడిగా భావిస్తున్న పోలవరం ప్రాజెక్టు ఎత్తు విషయంలో నెలకొన్న అనుమానాలకు తెరపడింది. ప్రాజెక్టును నిర్దేశిత పూర్తిస్థాయి ఎత్తయిన 45.72 మీటర్ల వద్దే నిర్మించనున్నట్లు పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పిపిఎ) అధికారికంగా స్పష్టం చేసింది. దీంతో ప్రాజెక్టులో 194.60 టిఎంసిల నీటిని నిల్వ చేసేందుకు మార్గం సుగమమైంది. పిపిఎ తన అధికారిక వెబ్‌సైట్‌లో ఈ వివరాలను పొందుపరచడంతో ప్రాజెక్టు భవిష్యత్తుపై స్పష్టత వచ్చింది. ఇటీవల కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి విఎల్ కాంతారావు ప్రాజెక్టును సందర్శించిన తర్వాత ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆయన పర్యటనకు ముందు, ప్రాజెక్టును తొలి దశలో 41.15 మీటర్లకే పరిమితం చేస్తారన్న సమాచారం పిపిఎ వెబ్‌సైట్‌లో ఉండేది. అయితే, కాంతారావు పర్యటన అనంతరం ఆ వివరాలను సవరించి, గరిష్ఠ నీటిమట్టం వివరాలను చేర్చారు. ప్రాజెక్టు రెండో దశకు అవసరమైన అటవీ, పర్యావరణ అనుమతులు, భూసేకరణ, పునరావాసం వంటి అంశాలను కేంద్ర ప్రభుత్వమే పర్యవేక్షిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ హామీతో రెండో దశ పనులకు కేంద్రం సిద్ధమవుతోందన్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మరోవైపు, ప్రాజెక్టు తొలిదశ పనులను వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తిచేయాలని జల వనరుల శాఖ లక్ష   ్యంగా పెట్టుకుంది. ఇప్పటికే స్పిల్‌వే నిర్మాణం పూర్తవగా, ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యాం పనులు వేగంగా సాగుతున్నాయి. ప్రాజెక్టు పూర్తయితే 10.13 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణతో పాటు, కృష్ణా బేసిన్‌కు 80 టిఎంసిల నీటి తరలింపు, తాగునీరు, 960 మెగావాట్ల విద్యుదుత్పత్తి వంటి ప్రయోజనాలు చేకూరనున్నాయి. అయితే, రెండో దశ పనులు ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారనున్నాయి. రెండో దశ కోసం సుమారు 86,000 నిర్వాసిత కుటుంబాలను తరలించాల్సి ఉండగా, భూసేకరణ, పునరావాసానికి రూ.28,561 కోట్లకు పైగా ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు.

పిఎసి 1 సముదాయం... ఆస్థాన మండపాల ఆధునీకరణ

- శ్రీవారి సేవకు వైద్యులు, ఇంజనీర్లు, ఉపాధ్యాయులు, సాఫ్ట్‌వేర్ నిపుణులు
- టిటిడి ఇఒ రవిచంద్ర

తిరుమల, ఏప్రిల్ 22 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమలలో పాతబడిన యాత్రికుల వసతి సముదాయం-1తోబాటు ఆలయానికి ఎదురుగా ఉన్న ఆస్థానమండపం భవనాల ఆధునీకరణకు చర్యలు తీసుకోవాలని టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర అధికారులకు ఆదేశాలిచ్చారు. ఇందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధంచేయాలని అన్నారు. భక్తుల నుండి అభిప్రాయాలు సేకరించి, వాటి ఆధారంగా సేవలను మరింత మెరుగుపరచాలని ఇఒ సూచించారు. అన్ని ఆలయాల్లో క్యూఆర్ కోడ్ ద్వారా అభిప్రాయ సేకరణ చేపట్టాలని తెలిపారు. టిటిడి పరిపాలన భవనంలో బుధవారం మధ్యాహ్నం టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఇఒలు వి.వీరబ్రహ్మం, డాక్టర్ ఎ.శరత్, సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవితో కలసి సమీక్షా సమావేశం నిర్వహించారు. శ్రీవారి దర్శనార్థం విచ్చేసే భక్తులకు తిరుమల, తిరుపతిలో మరింత మెరుగైన వసతి సదుపాయాలు కల్పించాలని ఇఒ రవిచంద్ర సూచించారు. ప్రస్తుత వసతి సదుపాయాలు సరిపోవడం లేదని, వాటిని విస్తరించేందుకు సమగ్ర అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని తెలిపారు. ముఖ్యంగా తిరుపతిలో వసతి సదుపాయాల పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని తిరుమలలో మాడవీధులు, ఆలయ పరిసరాలు, ముఖ్య ప్రదేశాల్లో నిరంతరం నీటి పిచికారీ చేయాలని ఆదేశించారు. తిరుమలలో నెయ్యి నిల్వ ట్యాంకులు, ముడి సరుకుల గోదాముల సామర్థ్యాన్ని పెంచేందుకు కొత్త గోదాములు నిర్మించాలని, పెండింగ్ వ్యర్థాలను త్వరగా తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శ్రీవారి సేవ వ్యవస్థను మరింత బలోపేతం చేసి, ఇతర ఆలయాలకు విస్తరించేలా చర్యలు తీసుకోవాలని సిపిఆర్ఒ డాక్టర్ రవికి సూచనలు చేశారు. భవిష్యత్తులో వైద్యులు, ఇంజనీర్లు, ఉపాధ్యాయులు, సాఫ్ట్‌వేర్ నిపుణుల సేవలను వినియోగించుకునేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని చెప్పారు. ఇంకా టిటిడి కళ్యాణ మండపాల నిర్వహణ, ఎస్‌విబిసి, స్విమ్స్, ఎఫ్‌ఎంఎస్, వసతి గృహాలు, ఎస్‌ఎస్‌డి, ఎస్ఇడి, శ్రీవాణి దర్శనం టికెట్ల జారీ తదితర అంశాలపై లోతుగా చర్చించారు. ఈ సమావేశంలో టిటిడి సిఇ సత్యనారాయణ, అదనపు ఎఫ్.ఎ.సి.ఎ.ఒ రవిప్రసాద్, ఇంఛార్జి న్యాయాధికారి వెంకట సుబ్బానాయుడు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణదారులకు ఊరట విఎల్‌టిపై 50శాతం రాయితీ

విజయవాడ, ఏప్రిల్ 22 ప్రభాతవార్త ప్రతినిధి: ఇళ్లు, భవనాలు నిర్మించుకోవాలనుకునే వారికి రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. నిర్మాణ సమయంలో ఖాళీ స్థలాలపై విధించే పన్ను (వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్: విఎల్‌టి)ను 50శాతం తగ్గిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నగరాలు, పట్టణాలు, నగర పంచాయతీల పరిధిలో అనుమతి పొందిన అన్ని నిర్మాణాలకు ఈ తగ్గింపు వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిర్ణయంతో ఏటా ప్రజలపై పడే రూ.30 కోట్ల ఆర్థిక భారం తగ్గనుంది. ఇళ్లు లేదా వాణిజ్య భవనాలు నిర్మించడానికి అన్ని రకాల అనుమతులు తీసుకున్నప్పటికీ, నిర్మాణ కాలంలో అధికారులు మళ్లీ ఖాళీ స్థలం పన్ను విధించడం ప్రజలకు భారంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రజలతో పాటు రియల్ ఎస్టేట్ వర్గాల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం, ఈ పన్నును సగానికి తగ్గించాలని నిర్ణయించింది. తాజా ఉత్తర్వుల ప్రకారం భవన నిర్మాణానికి అనుమతి పొందిన రోజు నుంచి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేసే వరకు లేదా అనుమతి గడువు ముగిసే వరకు (వీటిలో ఏది ముందైతే అది) ఈ 50 శాతం పన్ను తగ్గింపు వర్తిస్తుంది. అయితే, ఎలాంటి అనుమతులు లేకుండా చేపట్టే అక్రమ నిర్మాణాలకు ఈ తగ్గింపు వర్తించదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ పన్ను తగ్గింపునకు సంబంధించిన చట్ట సవరణ బిల్లును ప్రభుత్వం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే ఆమోదించింది. దానికి అనుగుణంగా ఇప్పుడు అధికారిక జీవోను విడుదల చేసింది. వాస్తవానికి వీఎల్‌టీ ద్వారా పట్టణ స్థానిక సంస్థలకు ఏటా సుమారు రూ.60 కోట్ల ఆదాయం సమకూరేది. తాజా తగ్గింపుతో ఈ ఆదాయం రూ.30 కోట్లకు పరిమితం కానుంది.

మూడేళ్ల కిందటి నోటిఫికేషన్‌పై ప్రేమెందుకో!?

- వైసిపి నేతల ధోరణితో టిటిడి బోర్డు రాజీపడిందా!?
- టిటిడిలో ఇంజనీరింగ్ పోస్టుల భర్తీపై వీడని అనుమానాలు
- సిఎం జోక్యం చేసుకోవాలని అభ్యర్థనలు

తిరుమల, ఏప్రిల్ 22 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానంలో ఎప్పటికప్పుడు కొత్త పంథాలో ఆలోచనలు ఉండాలని, వినూత్న విధానాలు అమలుకావాలని పదేపదే ముఖ్యమంత్రి చంద్రబాబు హితోక్తులు టిటిడి అధికారులకు చెవికెక్కడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వాలు మారినపుడు నియామకమైన అధికారులు భక్తులకు మెరుగైన సేవలు,సౌకర్యాలు కల్పించేందుకు వినూత్నంగా ఉండాలని గతంలో సిఎం హెచ్చరించారు. అయినా టిటిడి అధికారుల్లో మాత్రం అలాంటివేమీ కనిపించడంలేదనే తెలుస్తోంది. ఎప్పుడో మూడు సంవత్సరాల క్రిందట 2023 నవంబర్ 23న టిటిడిలో ఇంజనీరింగ్ పోస్టులు, సాంకేతిక పరిజ్ఞానం కలిగిన 56 టెక్నికల్ ఉద్యోగాలకు టిటిడి నోటిఫికేషన్ వెలువడించింది. ఇందులో 17 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, 10 అసిస్టెంట్ ఇంజనీర్, 19 అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్ పోస్టులు భర్తీ చేస్తున్నట్టు పేర్కొన్నారు. అప్పటి వైసిపి ప్రభుత్వం, వైసిపి టిటిడి బోర్డు ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి హయాంలో టిటిడి-99021(31), /33/ 2023- ఆర్ఇసిటిఎస్ ఎస్ఇసి-టిటిడి జిఒతో ఎలక్ట్రికల్ విభాగంలో హిందువులైన అభ్యర్థులతో నాలుగు ఎఇఇ పోస్టులు, 46 ఎఇఇ, టెక్నికల్ అసిస్టెంట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు. అప్పట్లో ఈ పోస్టుల భర్తీలో ఏకంగా ఓ కాంట్రాక్టర్ తనదైన శైలిలో అభ్యర్థుల నుండి బేరం మాట్లాడుకుని రూ.50లక్షల వరకు నిర్ణయించి అమ్ముకోవడానికి సిద్దమయ్యారనే ఆరోపణలు వినిపించాయి. దీంతో అప్పటి టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి ఈ ఉద్యోగాల భర్తీని నిలుపుదల చేశారు. ఆ తరువాత 2024 మేలో రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో టిడిపి నేతృత్వంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. అప్పటి నుండి గత మూడేళ్ళుగా ఇంజనీరింగ్ పోస్టుల భర్తీ నోటిఫికేషన్ చెత్తబుట్టలో చేరింది. ఇదే సందర్భంలో గత ఏడాది నవంబర్‌లో "డయల్ యువర్ ఇఒ" కార్యక్రమంలో కొందరు ఇంజనీరింగ్ అభ్యర్థులు పోస్టుల భర్తీగురించి అడిగారు. దీనిపై అప్పటి ఇఒ సింఘాల్ కూడా తమ అధికారులతో చర్చించి వివరాలు తెలియజేస్తామన్నారు. ఇలా పుణ్య కాలం గడచిపోవడంతో ఇప్పుడు మళ్ళీ 2023 నోటిఫికేషన్‌తోనే ఆ ఎఇఇ పోస్టుల భర్తీకి, టెక్నికల్ అధికారులు, ఎఇల పోస్టుల భర్తీకి ప్రస్తుత టిటిడి బోర్డు, ఇఒ, అదనపు ఇఒ కూడా సుముఖంగానే ఉన్నారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఆ నోటిఫికేషన్‌కు గడువు ముగియడం, 2023లో తయారుచేసిన ప్రశ్నాపత్రం కూడా లీకైందనేది టిటిడిలో పెద్ద దుమారంగా మారింది. ఈ సమయంలో పాత నోటిఫికేషన్‌తోనే ఓ కాంట్రాక్టర్ ఒత్తిడి మేరకు ఓ అధికారి తెరవెనుక రాజకీయంతో వైసిపికి వీరవిధేయులైన వాళ్ళు చెప్పినట్లు తాజా బోర్డు, టిటిడి ఇఒ కూడా సుముఖంగా ఉండటం వెనుక మతలబు ఏంటనేది అర్థంకావడం లేదు. పైగా 2025లో జోనల్ వారీగా విభజన చేయడంతో తిరుమల తిరుపతి దేవస్థానంలో ఉద్యోగాల భర్తీ జోన్ ప్రకారం చేపడితే రాయలసీమ వాసులకు న్యాయం జరుగుతుందనేది టిటిడి వర్గాల వాదన.

పాత నోటిఫికేషన్ రద్దుకు డిమాండ్: 2023లో భూమన కరుణాకర్ రెడ్డి ఛైర్మన్ గాఉన్న సమయంలో నిర్వహించాల్సిన ఇంజనీర్ ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్‌కు ఇప్పుడు ఛైర్మన్ బి ఆర్ నాయుడు ప్రయత్నించడం విమర్శలకు తావిస్తోంది. దీని వల్ల రాయలసీమ ప్రాంత నిరుద్యోగులు నష్ట పోయే అవకాశాలు ఉన్నాయని పలువురు ఉద్యోగులు అంటున్నారు. 2023 నవంబర్ 23న టిటిడి నోటిఫికేషన్ తరువాత ఆగిపోయింది. రాష్ట్ర స్థాయిలో ఆన్ లైన్ దరఖాస్తులకు అవకాశం కల్పించారు. అయితే కొంత మంది ముందుగానే ఉద్యోగార్థుల పోస్టుకు రూ.50 లక్షలు వసూలు చేసినట్టు ఆరోపణలు వచ్చాయి. ఇప్పుడు అదే నోటిఫికేషన్‌పై 2023 దరఖాస్తుదారులకు రానున్న మే 10వ తేదీన రాత పరీక్షలు నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. పాత నోటిఫికేషన్ ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేస్తే జోన్ వైస్ పోస్ట్ భర్తీకి విఘాతం కలుగుతోంది. దీనివల్ల రాయలసీమ, తిరుపతి జిల్లాకు చాలా నష్టం కలుగుతుంది. టిటిడిలోని కొందరు కోస్తా అధికారులు తెలివిగా ఎపి మొత్తం ఒకేలా అవకాశం కల్పిస్తున్నారని అంటున్నారు. అలా అయితే దేశవ్యాప్తంగా కూడా ఇవ్వాలి అంటూ కొందరు కొత్త వాదన వినిపిస్తున్నారు. ఇప్పటి పరిస్థితుల్లో పాత నోటిఫికేషన్ రద్దు చేసి ప్రభుత్వ కొత్త జిఒ ప్రకారం లోకల్ రిజర్వేషన్ అమలు చేస్తూ కొత్త నోటిఫికేషన్ ఇవ్వాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్య శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు
నెం.టిఒ/01/2026-27, తేది: 17.04.2026
కార్యనిర్వాహక ఇంజనీరు, గ్రా.నీ.స విభాగము, మచిలీపట్నం వారిచే కృష్ణా జిల్లా పరిధిలో Police Dept నిధుల నుండి మంజూరైన త్రాగునీటి సరఫరా (1) పనికిగాను రూ.13.00 లక్షల అంచనాతో ఆన్‌లైన్ టెండర్లు కోరడమైనది. టెండరు డాక్యుమెంట్లు తేది: 24.04.2026, ఉ.11.00గం.ల నుండి అందుబాటులో ఉండును. వివరాలకు https://tender.apeprocurement.gov.in నందు చూడగలరు. ఫోన్: 9100121319.
సం/-. కార్యనిర్వాహక ఇంజనీరు, గ్రా.నీ.స విభాగము, మచిలీపట్నం.
DIPR.NO. 20194/CL/ADVT/1/1/2022-23 తేది: 22.04.2026

వార్త

అనుభవించడం కంటే అనుభవం కోసం ఎదురు చూడటంలోనే మనిషి జీవితం ఎక్కువ కాలం గడిచిపోతుంది.

-వోల్టేర్

ఎంతకాలమీ ప్రతిష్టంభన?

పశ్చిమాసియా యుద్ధానికి 'కాల్పుల విరమణ' గడువు బుధవారంతో ముగియనుండగా 'ఇక సమయం లేదు మిత్రమా! అమీ తుమీ' తేల్చుకోండని శ్వేత సౌధాధినేత ట్రంప్ అల్టిమేటమ్ జారీ చేశారు. అయినా కాస్త తగ్గి మరోసారి గడువు పెంచారు. హర్మూజ్ జల సంధిని అష్ట దిగ్బంధనం చేయగలిగామని చెప్పుకుంటున్న అమెరికా ఇరాన్‌ను భయపెట్టగలిగిందేమీ లేదు. అమెరికా, ఇరాన్ రెండో దఫా చర్చలపై సందిగ్ధత తొలగినా కొంత కాలం ఉత్కంఠ తప్పదు. అవసరమైతే ఇస్లామాబాద్‌లో జరిగే చర్చలకు తానే స్వయంగా హాజరవుతానని ట్రంప్ చెబుతున్నారు. ఇరుపక్షాల మధ్య 'గొంతెమ్మ కోరిక'లకు పరిష్కార మార్గాలు, వాటికి ప్రత్యామ్నాయాలు కరువైన పరిస్థితుల్లో ఎవరు చర్చల్లో దిగినా మరింత ప్రతిష్టంభనే తప్ప ఏమీ ఉండదు. అమెరికా ఒక్క అడుగు వెనక్కి వేయదు. ఇరాన్ 'రాజీ' పడదు. పైగా కీలక సమయంలో మొండికేస్తోంది. మళ్లీ మళ్లీ చర్చలంటే తమకిష్టం లేదని చర్చలు ఫలవంతమవ్వాలని చిత్తశుద్ధి ఉంటేనే ఆలోచిస్తామంటోంది ఇరాన్. ఈసారి కూడా ఒప్పందం కుదరకపోతే ఇక బాంబుల దాడి తప్పదంటోన్న ట్రంప్ ఇరాన్‌తో మళ్లీ కఠినవైఖరితోనే ఉన్నారు. తాజాగా హర్మూజ్ జల సంధిని అంతర్జాతీయ ప్రయోజనాల రీత్యా తెరిచే ఉంచాలని చైనా అధినేత జిన్‌పింగ్ ఇరాన్‌కు హితవు చెబుతున్నారు. అడుగుఅడుగుకీ ఆటంకాలు తెచ్చిపెడుతున్న ట్రంప్ వాచాలతను ఎవరూ కట్టడి చేయలేకపోవడం విచారకరం. ఇరాన్‌లో 8 మంది మహిళలను ఉరికంబమెక్కిస్తున్న తరుణంలో ట్రంప్ వారిని ఉరితీయకుండా ఉండటం తమకు, తమతో చర్చలకు సుహృద్భావ వాతావరణం కల్పించినట్లవుతుందని ఇరాన్‌కు సందేశం పంపారు. అమెరికా, ఇరాన్‌ల మధ్య 'హర్మూజ్' చిచ్చు ఇంకా ఆగలేదు. హర్మూజ్ జలసంధి దిగ్బంధంలో అమెరికా తమ కార్గోనౌకపై దాడి చేసి స్వాధీనం చేసుకొన్నామన్న ప్రకటనతో ఇరాన్ దాదాపు తల్లడిల్లిపోయింది. ఇరాన్ తన శాంతిచర్చల బృందాన్ని ఇస్లామాబాద్‌కు పంపబోమని తెగేసి చెప్పింది. ఇప్పటికే అమెరికా ఇరాన్‌ల మధ్య శాంతి ఒప్పందం సర్వత్రా మంచిదని కొన్ని దేశాలు తమకు సానుకూలంగా స్పందించే దేశాలకు హితవు చెప్పడం ప్రారంభించాయి. హిందూ మహాసముద్రంలో ఇరాన్ నౌకను అమెరికా తమ ఆధీనంలోకి తీసుకోవడం ఇరాన్‌కు రుచించడం లేదు. ఇవన్నీ ప్రతిష్టంభన పరిస్థితుల్లోకి నెట్టివేసాయంటోంది ఇరాన్. అందుకే ఈ సారి గడవుకు పాక్ అభ్యర్థించింది. ఇండోనేషియా, శ్రీలంక మధ్యన హిందూ మహాసముద్ర జలాల్లో అమెరికా స్వాధీనం చేసుకున్న ఇరాన్ నౌక ఎంటీ టిఫానీ నౌకను ఇంతదాక ఇరాన్‌కు విడుదల చేయకపోవడం కూడా వారి ఆగ్రహావేశాలకు దారితీసింది. అందుకే ఇరాన్ లొంగి రావడం లేదు. యుద్ధ వ్యూహాలు పన్నడం అటుంచి శాంతి చర్చల విషయంలో ఇరాన్ మెట్టు దిగకపోవడం అమెరికాను నమ్మకలేకపోవడమే. అమెరికా అల్టిమేటంను ఖాతరు చేయకుండా ఇరాన్ మొండికేయటంతో ఇక చేసేది లేక ట్రంప్ గడువు సమయాన్ని పెంచారు. మలి విడత చర్చలకు మరోగడువు దొరకడంతో శాంతిచర్చల బృందాలు ఊపిరి పీల్చుకున్నాయి. టెహ్రాన్‌ను ఒప్పించేందుకు పాక్ ప్రతినిధులు చేయని ప్రయత్నం లేదు. ట్రంపే స్వయంగా గడువును పొడిగించడంతో అమెరికా బాంబులకు ప్రస్తుతానికి పనిలేకుండాపోయింది. శాశ్వత శాంతి ఒప్పందం దిశగా చర్చలను తీసుకెళ్లాలని మధ్యవర్తిత్వ దేశం పాక్ ఉవ్విళ్లూరుతోంది. ప్రపంచ శాంతికి, చమురుధరలు ప్రజ్వలనం కాకుండా చూసామన్న ఖ్యాతి తమకే దక్కాలనీ పాక్ ఎదురుచూస్తోంది. పాక్ ఇప్పటికీ ఆశావహదృక్పథంతోనే ఉంది. ఈసారి రణరంగంలో కొత్త షాకులియ్యాలని ఎదురుచూస్తున్న టెహ్రాన్ పెద్దలు 'కాల్పుల విరమణ' గడువు పొడిగించడంతో ఊపిరి పీల్చుకున్నారు. మరోపక్క హర్మూజ్ జలసంధి వద్ద అమెరికా స్వాధీనం చేసుకున్న 'తౌస్కా' నౌకలో క్షిపణుల తయారీ రసాయనాలు ఉన్నాయంటూ ఐక్యరాజ్యసమితిలో అమెరికా మాజీ రాయబారి నిక్కీ హేలీ ఆందోళన వ్యక్తం చేశారు. ఇవన్నీ చైనా నుంచి ఇరాన్‌కు అందుతున్నక్షిపణులేనని ఆరోపించారు. ఏ విధంగానూ నిజనిరూపణలేకుండా ఇరాన్‌కు చైనా యుద్ధ వనరులను, పరికరాలను అందిస్తోందని తెలియచెప్పడానికి వ్యూహం పన్నారు. అంతేకాదు హిందూ మహాసముద్రంలో అమెరికా ఇరాన్ నౌకను స్వాధీనం చేసుకోవడంలో తప్పేమీ లేదని చెప్పుకోవడమే దీని నేపథ్యం. కాగా హర్మూజ్‌లో ఇరాన్ దాడులతో పరిస్థితి అల్లకల్లోలంగా తయారైంది. ఒమన్ వైపు వెళ్లే నౌకలపై దాడులు జరిగాయి. మరో కార్గోషిప్‌పై కూడా ఇరాన్ సేనలు విధ్వంసానికి ఒడిగట్టాయి. పశ్చిమాసియా యుద్ధం సత్వర పరిష్కారం జరిగితే తప్ప ప్రతిష్టంభన తొలగే ఛాయలు కనపడటం లేదు. ఇరాన్ స్పందించకున్నా మధ్యవర్తిత్వం వహిస్తున్న పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఆర్మీ చీఫ్ మునీర్ అభ్యర్థన మేరకు ఇరాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందాన్ని నిరవధికంగా పొడిగిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారంటే తాత్కాలికంగానైనా ఇక యుద్ధం ఆగినట్లు భావించాలి. హర్మూజ్ జలసంధి, ఖర్గ్ ద్వీపం మీద కన్నేయడంతో ఇరాన్ ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తోంది. హర్మూజ్‌పై అమెరికా దిగ్బంధనం అలాగే ఉంటుందని ట్రంప్ అంటుండగా ఇరాన్ మాత్రం అమెరికా సైన్యాన్ని అక్కడ్నించి ఉపసంహరించుకుంటే తప్ప చర్చలకు రాబోమని ఇరాక్ విదేశాంగ ప్రతినిధి స్పష్టం చేశారు. ఇలాగైతే చర్చలపై ప్రతిష్టంభన ఎంతకాలం ఉంటుందో ఊహాకందదు. ఇరాన్‌ను ఆర్థికంగా బలహీనపరచడమే లక్ష్యంగా పావులు కదుపుతున్న ట్రంప్ కూడా సామరస్యంగా వ్యవహరించాల్సిన అవసరం కనపడుతోంది.

మీరు గౌరవాన్ని కోరుకుంటే ముందు మిమ్మల్ని మీరు గౌరవించుకోవాలి. మీ అనుమతి లేనిదే మిమ్మల్నెవరూ చిన్నచూపు చూడరు.

శామ్యూల్ జాన్సన్

విజయం మేధావిని వినయవంతుణ్ని చేస్తుంది. సామాన్యుడిని ఆశ్చర్యపరుస్తుంది. అవివేకిని అహంభావిగా మారుస్తుంది.

స్వామి వివేకానంద

విపత్తు నివారణకు మరిన్ని జాగ్రత్తలు

ఆంధ్రప్రదేశ్,తెలంగాణ రాష్ట్రాల్లో ప్రస్తుత పరిస్థితులు ఒక సవాల్ వంటివి. ముంచుకొస్తున్న ఎండలు, నీటి కొరత, పిడుగుల ముప్పును ఎదుర్కోవడానికి జిల్లా యంత్రాంగాలు ఇప్పటి నుంచే సమ న్వయంతో పనిచేయాలి. జలాశయాల నీటి మట్టాల పర్య వేక్షణ, తాగునీటి సరఫరా ప్రణాళికలు, విద్యుత్ డిమాండ్ ను తట్టుకునే ఏర్పాట్లు యుద్ధ ప్రాతిపదికన జరగాలి. విపత్తు సంభవించిన తర్వాత సహాయక చర్యలు చేపట్టడం కంటే, విపత్తు రాకుండా లేదా దాని తీవ్రతను తగ్గించేలా వ్యవహరించడమే మేలైన పరిపాలన. పాలకుల చిత్తశుద్ధి, అధికారుల అప్రమత్తత, ప్రజల సహకారం తోడైతేనే ఈ ఎల్‌నినో గండాన్ని మనం సురక్షితంగా దాటగలం. కాలం మించిపోకముందే అడుగులు వేయకపోతే,ఆనష్టాన్ని పూడ్చుకోవడం భవిష్యత్తులో అసాధ్యంగా మారుతుంది. పకడ్బందీ ప్రణాళికే ఇప్పుడు మనకున్న ఏకైక ఆయుధం. మన ముందున్న ఈ క్లిష్ట సమయాన్ని ధైర్యంగా, శాస్త్రీయంగా ఎదుర్కోవడమే తెలుగు రాష్ట్రాల తక్షణ కర్తవ్యం.

డి. అశోక్

ప్రకృతి వైపరీత్యాలు ముంచుకొచ్చినప్పుడు మాత్రమే స్పందించడం కంటే, అవి రాకముందే అప్రమత్తం కావడం నాగరిక సమాజ లక్షణం. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు మునుపెన్నడూ లేని విధంగా ఒక గడ్డు కాలం ఎదురుకాబోతోందని స్పష్టమవుతోంది. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం వల్ల రుతుపవనాలు మొహం చాటేసే ప్రమాదం ఉందని, వేసవి ఉష్ణోగ్రతలు ఆకాశాన్ని తాకనున్నాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరికలు జారీ చేసింది. 2026లో నైరుతి రుతుపవనాలు సాధారణం కంటే తక్కువగా, కేవలం 92 శాతం మేరకే ఉండవచ్చుననే అంచనా ఆందోళన కలిగిస్తోంది. సాధారణంగా జూన్ మొదటి వారంలో పలకరించే రుతుపవనాలు ఈసారి ఆలస్యంగా వచ్చే అవకాశం ఉండటమే కాకుండా, అవి అత్యంత బలహీనంగా ఉండే సూచనలు కనిపిస్తున్నాయి. దీనివల్ల కేవలం వర్షాలు తగ్గడం మాత్రమే కాదు, సుదీర్ఘ కాలం పాటు వేడి, ఉక్కపోత కొనసాగి జనజీవనాన్ని అతలాకుతలం చేసే ముప్పు ఉంది. చేతులు కాలక ముందే ఆకులు పట్టుకోవడం అన్న సామెతను గుర్తు చేసుకుంటూ, ప్రభుత్వ యంత్రాంగం ఇప్పుడే కార్యాచరణకు దిగాల్సిన అత్యవసర పరిస్థితి ఏర్పడింది. లేదంటే అటు వ్యవసాయ రంగం,ఇటు ప్రజారోగ్యం తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉంది. ఎల్‌నినో ప్రభావం వల్ల తలెత్తే పరిణామాలు గొలుసుకట్టు సమస్యలను సృష్టిస్తాయి. రుతుపవనాల రాక ఆలస్యమైతే అస్థిరమైన వాతావరణం ఏర్పడి, ఉరుములు, మెరుపులతో కూడిన పిడుగులు పడే ప్రమాదం గణనీయంగా పెరుగుతుంది. ఇప్పటికే రెండు రాష్ట్రాల్లో ఎండలు మండిపోతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ ప్రాంతం నిప్పుల కొలిమిలా మారింది. కడప, నెల్లూరు, తిరుపతి వంటి నగరాల్లో ఉష్ణోగ్రతలు 44 డిగ్రీల సెంటిగ్రేడ్ దాటడం రాబోయే తీవ్రతకునిదర్శనం.తెలంగాణలోనూ జగిత్యాల, ఆదిలాబాద్, నల్గొండ వంటి జిల్లాల్లో భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. ఈ ఎండల వల్ల వాతావరణంలో విద్యుత్ అయస్కాంత మార్పులు సంభవించి పిడుగులు పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. గత ఏడాది గణాంకాలను పరిశీలిస్తే, దేశవ్యాప్తంగా పిడుగుల బారిన పడి మరణించిన వారి సంఖ్య 2,560గా ఉంది. ఇందులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కలిపి సుమారు 150 మంది ప్రాణాలు కోల్పోవడం విచారకరం. పొలాల్లో పనిచేసే రైతులు, కూలీలు వర్షం రాగానే చెట్ల కిందకు వెళ్లడం వల్ల ఈ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ ఏడాది పిడుగుల ముప్పు మరింత ఎక్కువగా ఉంటుందన్న అంచనాల దృష్ట్యా, గ్రామీణ ప్రాంతాల్లో ముందస్తు అవగాహన కల్పించడం అత్యంత కీలకం. కేవలం ప్రాణ నష్టం జరిగిన తర్వాత పరిహారం ప్రకటించడం వల్ల ప్రయోజనంఉండదు, ప్రాణాలు పోకుండా రక్షించే సాంకేతికతను, హెచ్చరికలను క్షేత్రస్థాయికి చేరవేయడమే అసలైన పరిష్కారం. మరోవైపు, వర్షపాతం తగ్గడం వల్ల నీటిఎద్దడి సమస్య భూతంలా విరుచుకుపడే అవకాశం ఉంది. ఏప్రిల్ మాసం నాటికే కృష్ణా నదిపై ఉన్న శ్రీశైలం, నాగార్జున సాగర్ వంటి ప్రధాన జలాశయాల్లో నీటి మట్టాలు ఆందోళనకర స్థాయికి పడిపోయాయి.శ్రీశైలంలో కేవలం 15శాతం నిల్వలు మాత్రమేఉండటం రాబోయే జల సంక్షోభానికి సంకేతం. వర్షాలు సమయానికి కురవకపోతే సాగునీటి మాట పక్కన పెడితే, కనీసం తాగు

నీటి సరఫరాకు కూడా ఇబ్బందులు తప్పవు. దీనివల్ల నగరాల్లోనూ, గ్రామాల్లోనూ ప్రజలు నీటిచుక్క కోసం అల్లాడాల్సి వస్తుంది. భూగర్భ జల మట్టాలు కూడా పడిపోతుండటంతో బోరుబావులపై ఆధారపడటం కష్టతరమవుతుంది. జల వనరుల నిర్వహణలో ఇప్పటి నుంచే పొదుపు చర్యలు పాటించకపోతే, వేసవి చివరలో పరిస్థితి చేయి దాటిపోయే ప్రమాదం ఉంది. నీటి వినియోగంపై ప్రజల్లో చైతన్యం తేవడంతో పాటు, అందుబాటులో ఉన్న నీటిని ప్రాధాన్యత క్రమంలో తాగునీటి అవసరాలకు కేటాయించే ప్రణాళికలను పాలకులు సిద్ధం చేసుకోవాలి. ఈప్రకృతి వైపరీత్యాల ప్రభావం అన్నింటికంటే ఎక్కువగా రైతాంగంపైనే పడుతుంది. జూన్ నెలలో సాధారణంగా ఖరీఫ్ పనులు ప్రారంభం కావాలి. కానీ రుతుపవనాల అనిశ్చితి వల్ల విత్తనాలు విత్తడం ఆలస్యమవుతుంది. ఇది పంటల దిగుబడిపై నేరుగా ప్రభావం చూపుతుంది. రైతులు వానాకాలం పంటల కోసం ఆకాశం వైపు చూడటం, చివరకు గత్యంతరం లేక బోరు బావుల కింద పంటలు వేయడం వల్ల పెట్టుబడి వ్యయం పెరుగుతుంది. ఎండలు తీవ్రంగా ఉండటంతో రైతులు, కూలీలు ఆరుబయట పని చేయడం వారి శారీరక శక్తిని హరిస్తుంది. వడదెబ్బ బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. వ్యవసాయ శాఖ ఈ పరిస్థితులను గమనించి, తక్కువ నీటితో పండే పంటల గురించి, వర్షాలు ఆలస్యమైతే అనుసరించాల్సిన ప్రత్యామ్నాయ సాగు పద్ధతుల గురించి రైతులకు ముందే దిశానిర్దేశం చేయాలి. విత్తనాలు, ఎరువుల లభ్యతలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడటం యంత్రాంగం బాధ్యత. ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గితే మార్కెట్‌లో ధరలు పెరిగి సామాన్యుడిపై ఆర్థిక భారం పడుతుంది, తద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కుదేలయ్యే ప్రమాదం ఉంది. ప్రభుత్వాల స్పందన కేవలం కాగితాలకే పరిమితం కాకూడదు. వాతావరణ శాఖ ఇచ్చే హెచ్చరికలు ప్రతి గ్రామానికి, ప్రతి రైతుకు చేరువ కావాలి. స్మార్ట్‌ఫోన్ల యుగంలో కూడా సమాచారం సకాలంలో అందకపోవడం విచారకరం. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయాల్లో ఉపాధి హామీ కూలీలకు పనివేళలు మార్చడం, వారు విశ్రాంతి తీసుకోవడానికి పని స్థలాల్లో నీడ, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచడం వంటి చిన్న చర్యలు కూడా ఎంతో మంది ప్రాణాలను కాపాడతాయి. ఆరోగ్య శాఖ ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వడదెబ్బ బాధితులకు ప్రత్యేక వార్డులను సిద్ధం చేయాలి. అలాగే పిడుగుల నుండి రక్షణ పొందే మార్గాలపై విస్తృత ప్రచారం జరగాలి. ఉరుములు మెరుపులు వచ్చే సమయంలో పొలాల్లో ఉండకూడదని, ఒంటరిగా ఉన్న చెట్ల కిందకు చేరకూడదని ప్రజలకు పదేపదే వివరించాలి. సాంకేతికతను ఉపయోగించుకుని స్థానిక భాషలోఎప్పటికప్పుడు హెచ్చరికలు పంపే వ్యవస్థను బలోపేతం చేయాలి. ప్రకృతి వైపరీత్యాలను మనం ఆపలేం కానీ, వాటి వల్ల కలిగే నష్టాన్ని మాత్రం ముందస్తు జాగ్రత్తలతో తగ్గించగలం. ఆంధ్రప్రదేశ్,తెలంగాణ రాష్ట్రాల్లో ప్రస్తుత పరిస్థితులు ఒక సవాల్ వంటివి. ముంచుకొస్తున్న ఎండలు, నీటి కొరత, పిడుగుల ముప్పును ఎదుర్కోవడానికి జిల్లా యంత్రాంగాలు ఇప్పటి నుంచే సమన్వయంతో పనిచేయాలి. జలాశయాల నీటి మట్టాల పర్యవేక్షణ, తాగునీటి సరఫరా ప్రణాళికలు, విద్యుత్ డిమాండ్ ను తట్టుకునే ఏర్పాట్లు యుద్ధ ప్రాతిపదికన జరగాలి. విపత్తు సంభవించిన తర్వాత సహాయక చర్యలు చేపట్టడం కంటే, విపత్తు రాకుండా లేదా దాని తీవ్రతను తగ్గించేలా వ్యవహరించడమే మేలైన పరిపాలన. పాలకుల చిత్తశుద్ధి, అధికారుల అప్రమత్తత, ప్రజల సహకారం తోడైతేనే ఈ ఎల్‌నినో గండాన్ని మనం సురక్షితంగా దాటగలం. కాలం మించిపోకముందే అడుగులు వేయకపోతే,ఆనష్టాన్ని పూడ్చుకోవడం భవిష్యత్తులో అసాధ్యంగా మారుతుంది. పకడ్బందీ ప్రణాళికే ఇప్పుడు మనకున్న ఏకైక ఆయుధం. మన ముందున్న ఈ క్లిష్ట సమయాన్ని ధైర్యంగా, శాస్త్రీ యంగా ఎదుర్కోవడమే తెలుగు రాష్ట్రాల తక్షణ కర్తవ్యం. ●

నయా నైపుణ్యాలే ఉద్యోగావకాశాలకు మార్గం

ఉదయ్ కుమార్

తెలంగాణలో, ముఖ్యంగా హైదరాబాద్ కేంద్రంగా ఐటీ రంగం ప్రస్తుతం ఒక కీలక మార్పు దశలో కొనసాగుతోంది. ఒకవైపు వృద్ధి కొనసాగుతుండగా, మరోవైపు ఉద్యోగాల స్వరూపం వేగంగా మారుతోంది. ఈ పరిస్థితి ఉద్యోగార్థులకు ఒకేసారి అవకాశాలు,సవాళ్ల రెండింటినీ తీసుకువస్తోంది. వృద్ధి కొనసాగుతోంది – కానీ రూపాంతరం చెందుతోంది. తెలంగాణలో ఐటీ ఎగుమతులు సుమారు 3.6లక్షల కోట్ల స్థాయికి చేరుకోవడం ఈ రంగం బలాన్ని ప్రతిబింబిస్తోంది. హైదరాబాద్‌లో 400కు పైగా గ్లోబల్ సామర్థ్య కేంద్రాలు పనిచేస్తుండటం, కొత్త పెట్టుబడులు ఆకర్షితమవడం ఐటీ రంగం ఇంకా విస్తరిస్తోందనడానికి సంకేతాలు. రాష్ట్ర ప్రభుత్వం 2026 నాటికి మరిన్ని గ్లోబల్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకోవడంతో సుమారు 1.2 లక్షల ఉద్యోగాలు సృష్టించే అవకాశం ఉందని అంచనా. పలుకంపెనీలు ఇటీవల హైదరాబాద్‌లో నూతనంగా తమ కార్యకలాపాలను విస్తరించడం ప్రారంభించాయి. కొన్ని సంస్థలు వేల సంఖ్యలో టెక్నాలజీ ఉద్యోగులను నియమించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి. అయితే గతంతో పోలిస్తే నియామకాలు ఇప్పుడు మరింత ఎంపికాత్మకంగా మారాయి. డిగ్రీతో పాటు నైపుణ్యాలు, అనుభవం, బహుళ సామర్థ్యాలు ఉన్నవారికే ప్రముఖ కంపెనీలు ప్రాధాన్యత ఇస్తున్నాయి. ప్రస్తుతం ఐటీ రంగంలో అధిక డిమాండ్ ఉన్న విభాగాలుగా కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) మెషీన్ లెర్నింగ్ (ఎమ్ఎల్), డేటా ఎనాలసిస్, డేటా సైన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ భద్రత వంటి రంగాల్లో నైపుణ్యాలు ఉన్నవారికి అధిక అవకాశాలు, మంచి వేతనాలు లభిస్తున్నాయి. ముఖ్యంగా ఎఐ ఆధారిత ఉద్యోగాలు అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకున్న ఉద్యోగాలుగానూ, ఈ రంగం వేగంగా విస్తరిస్తున్న విభాగంగా వృద్ధి చెందుతోంది. అయితే ప్రస్తుతం ఇప్పటి వరకూ అనుభవం లేకుండా కొత్తగా ఉద్యోగం కోసం ప్రయత్నించే

వారికి పరిస్థితి కాస్త కఠినంగా మారింది. ఎంట్రీలెవెల్ ఉద్యోగాలు తగ్గడం, క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ పరిమితం కావడం, అనుభవం ఉన్న అభ్యర్థులకే ప్రాధాన్యత ఇవ్వడం వంటి పరిణామాలు ఎక్కువ చోట్ల కనిపిస్తున్నాయి. అయితే ప్రాజెక్ట్ అనుభవం, ఇంటర్న్‌షిప్‌లు, ప్రాక్టికల్ స్కిల్స్ ఉన్నవారికి అవకాశాలు ఇంకా అందుబాటులోనే ఉన్నాయని చెప్పవచ్చు. ప్రపంచవ్యాప్తంగా ఐటీ రంగంలో లేఆఫ్స్ కొనసాగుతున్నాయి. అమెజాన్, ఒరాకిల్, సేల్స్ ఫోర్స్, అట్లాసియన్ వంటి సంస్థలు వేలసంఖ్యలో ఉద్యోగులను తగ్గించాయి. అలాగే మరికొన్ని కంపెనీలు కూడా ఉద్యోగాల కోతలకు సిద్ధమవుతున్నట్లు నివేదికలు సూచిస్తున్నాయి. 2026 తొలి త్రైమాసికంలోనే ప్రపంచవ్యాప్తంగా 70–80 వేల మంది టెక్ ఉద్యోగులు ఉద్యోగాలు కోల్పోయినట్లు అంచనా. కాగా ఈ పరిస్థితికి ప్రధాన కారణాలుగా కోవిడ్ కాలంలో అధిక నియామకాలు, గ్లోబల్ ఆర్థిక మందగమనం, ఆటోమేషన్, ఎఐ వినియోగం పెరగడం వంటివేనని చెప్పవచ్చు. భారతదేశం గ్లోబల్ ఐటీ ఔట్ సోర్సింగ్ కేంద్రంగా ఉండటం వల్ల అంతర్జాతీయ పరిణామాల ప్రభావం నేరుగా ఇక్కడ కనిపిస్తోంది.ఫ్రెషర్స్ నియామకాలు తగ్గడం, వేతనాల పెరుగుదల మందగించడం, కాంట్రాక్ట్ ఉద్యోగాలు పెరగడం వంటి మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగార్థులు కంపెనీల అవసరాలు,అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా తమను తాము మార్చుకోవాల్సినఅవసరం ఉంది. ఈ మేరకు కొత్త టెక్నాలజీలపై నిరంతర అభ్యాసం,ప్రాజెక్ట్ అనుభవం పెంపొందించుకోవడం, బహుళ నైపుణ్యాలు సాధించడం ద్వారా ఉద్యోగార్థులు అవకాశాలను మెరుగుపరచుకునే అవకాశం ఉంటుంది. అదే విధంగా కంపెనీలు కూడా ఉన్నవారిని తొలగించకుండా ఉద్యోగులకు నూతన సాంకేతిక పరిజ్ఞానానికి తగినవిధమైన శిక్షణనివ్వడంద్వారా అవకాశాలు కల్పించడం, బాధ్యతాయుతంగా వ్యవహరించడం అవసరం.ఏదిఏమైనప్పటికీ ఐటీరంగంలో జరుగుతున్న పరిణామాలు సంక్షోభంగా కనిపించినప్పటికీ, ఇవి ఒక రూపాంతరం సంకేతాలు. పాతఉద్యోగాలు తగ్గుతున్నప్పటికీ, కొత్త నైపుణ్యాలపై ఆధారపడిన అవకాశాలు విస్తరిస్తున్నాయి. మార్పులకు సిద్ధంగా లేని వారికి ఇది సవాళ్లను ఎదుర్కొనే సమయంగా ఉన్నప్పటికీ నైపుణ్యం ఉన్నవారికి ఐటీ రంగం ఇంకా అవకాశాల వేదికగానే ఉంది. ●

ప్రజావాక్కు

ప్రాణాలకు ముప్పు

భారతదేశంలో బాణసంచా తయారీ కేంద్రాలలో తరచుగా సంభవిస్తున్నపేలుళ్లు సామాన్యుల ప్రాణాలకు ముప్పుగా పరిణమించాయి.దేశవ్యాప్తంగా గతఐదేళ్లలో సుమారు 180ప్రమాదాలు జరగగా,480 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ముఖ్యంగా తమిళనాడులోని విరుదునగర్ జిల్లా ఈ వినాశనానికి కేంద్ర బిందువుగా మారింది. 2022–2025 మధ్య ఇక్కడ 89 సంఘటనలు జరిగి 134 మంది మరణించడం వ్యవస్థీకృత వైఫల్యానికి నిదర్శనం.లాభార్జనే ధ్యేయంగా భద్రతా ప్రమాణాలను విస్మరించడం, అనుమతించిన పరిమితికి మించి కార్మికులను వినియోగించడం, నిషేధిత రసాయనాల వాడకం ఈ ఘోరాలకు ప్రధాన కారణాలు.అనుమతి ఉన్న కేంద్రాల్లో సైతం నిబంధనలకు విరుద్ధంగా సెలవు దినాల్లో పనులు నిర్వహించడం, ముడి సరుకులను భారీగా నిల్వ ఉంచడం యజమానుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

కమిటీలు ఏర్పాటు చేయాలి

తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం సోషల్ వెల్ఫేర్, ఎస్సి కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ప్రతి మండలతహసిల్దార్ అధ్యక్షతన రాష్ట్రంలోని ప్రతి గ్రామంలోనిదళిత కమ్యూనిటీ ప్రజల ఆధ్వర్యంలో దళిత గ్రామ అభివృద్ధి కమిటీలను ప్రభుత్వం అధికారికంగా ఏర్పాటు చేయాలి.నూతనసంస్కరణలో భాగంగా గ్రామాలలో ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా వెనుకబడిన దళితుల అభివృద్ధి కోసం దళిత అభివృద్ధి కమిటీలను ఏర్పాటు చేయాలి.ఆకమిటీలలో విద్యావంతులు,మహిళలు, యువకులు, దళిత ఉద్యోగి ఒకరు ఉండేవిధంగా, దళిత కాలనీలలో మౌలిక వసతులు అంబేద్కర్ విగ్రహాల పరిరక్షణ, అసైన్డ్ భూముల అభివృద్ధికి కృషి చేయాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

మహనీయుల పుస్తకాలను అందిద్దాం

వేసవి కాల దృష్ట్యా మన ఇంట్లో ఉండే పిల్లలు దాదాపు బయటికి వెళ్ళే అవకాశాలు చాలాతక్కువ. ఇలాంటి సమయంలో రోజులుకాసేపు మీపిల్లలకు మహనీయుల జీవిత పుస్తకాలను మీరే దగ్గరుండి చదివించండి. జ్ఞానం, కుల వివక్ష, అసమానతల,ప్రశ్నించేతత్వం సమాజం పట్ల అవగాహన కల్పించిన వారు అవుతారు. ఒక తల్లిదండ్రులుగా నేర్పించాల్సిన బాధ్యత మిది.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గ్రంథాలయాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

జిల్లా కేంద్ర గ్రంథాలయాలలో ఏదైనా పుస్తకము కావాలని వెళితే ఆ పుస్తకము అక్కడ ఉన్నదీ లేనిది తెలియదు.కేటలాగ్ ఉండదు. వెతుక్కోవాలి. ఎబీరువాలో ఉంటుందో తెలియదు.అసలు ఉన్నదీ లేనిదీ తెలియదు.ఏదొక పుస్తకం తెచ్చుకోవలసి వస్తుంది. ఆ బీరువాలో పుస్తకాలు గందరగోళంగా ఉంటాయి.వరుసలో ఉండవు. అటుఇటు ఇటు అటు. పుస్తకం మీద పేరు ఉండదు. పేరు కావాలంటే పుస్తకం తెరిచి చూసుకోవాలి.మనం కట్టే పన్నుల్లో లైబ్రరీ టాక్స్ ఉంటుంది. సరిగా చూడవలసిన బాధ్యత ఆ స్టాఫ్‌కు ఉంది. గ్రంథాలయంలోఎన్నిపుస్తకాలు ఉన్నాయి?కేటలాగ్ ఉండాలి. దానిలో చూపినవిధంగా వరుస క్రమంలో ఉండాలి.ప్రతి పుస్తకం అట్ట మీద పుస్తకం పేరు, రచయిత పేరు, సీరియల్ నంబరు ఉండాలి.వేటపాలెం సారస్వత గ్రంథాలయంలోకి వెళ్ళి మనకు కావలసిన పుస్తకాన్ని రెండు నిమిషాలలో తీసుకోవచ్చు.

- నార్నే వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

పిల్లల్లో నైపుణ్యాన్ని మెరుగుపరచాలి

ఉభయ రాష్ట్రాల్లో పాఠశాల విద్యార్థులకు త్వరలో వేసవి సెలవులురానున్నవి.ఈసమయాన్ని రాబోయేతరగతిలోవారికి ఏదైనా అంశాలు అవగాహన లేని వాటిపై దృష్టి పెట్టాలి. ముఖ్యంగా గణితం, తెలుగు వ్యాకరణం, ఆంగ్ల వ్యాకరణం తృప్తిగా అర్థమయ్యే విధంగా తల్లితండ్రులు, లేదా మిత్రుల సహకారంతో పునాది వేసుకోవాలి. విజ్ఞాన శాస్త్రం పాఠంలో సందేహాలు, ప్రశ్నలు రాసుకొని సందేహాలను తప్పక నివృత్తి చేసుకోవాలి. ఇవన్నీ చేసేందుకు విద్యార్థులకు ఉత్తమ కాలం, అదనంగా పత్రిక పఠనం, నీతి కథలు, చిత్రలేఖనం, దస్తూర్ని మెరుగుపరచడంతప్పకచేయాలి.కాస్తసమయం ఆటల్లో పాల్గొనాలి. వీటి అమలుకు తల్లితండ్రులే ప్రధాన పాత్రధారులు.

- బొల్లోజు మేఘనదాం, విశాఖపట్నం

సమాజానికి కొత్త సవాలు

నేటి కాలంలో సోషల్ మీడియా మన జీవితాల్లో భాగమైపోయింది. సమాచారం పంచుకోవడం, వ్యక్తిగత అభిరుచులను వ్యక్తపరచడం, ప్రపంచంతో మమేకం కావడం వంటి అనేక ప్రయోజనాలను ఇది అందిస్తోంది. అయితే అదే సమయంలో దీని దుర్వినియోగం సమాజానికి తీవ్రమైన ప్రమాదాలను కూడా సృష్టిస్తోంది.ముఖ్యంగా వదంతులు, అబద్ధపు వార్తలు వేగంగా వ్యాప్తిచెందడానికి సోషల్‌మీడియా వేదిక అవుతోంది. నిజానిజాలు తెలియకుండానే ప్రజలు షేర్‌చేయడం వల్ల చిన్న సంఘటనలు కూడా పెద్ద వివాదాలుగా మారుతున్నాయి.

- కె.రామారావు, నల్గొండజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

డీలిమిటేషన్‌తో దేశ సమగ్రతకు నష్టం!

డాక్టర్ సమర్ స్నేహ ఎనుగొండ

డీలిమిటేషన్‌తో జనాభా ఎక్కువగా ఉన్న ఉత్తరాది రాష్ట్రాలలో పాలనాపరమైన రాజధానులుగా మారే దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణతో ఆర్థిక అభివృద్ధి జరగడం వలన ఆర్థిక రాజధానులుగా మిగిలిపోతాయి. ఈ ఆర్థిక రాజధానులను దోపిడీ చేస్తూ జనాభా ఎక్కువగా ఉన్న ఉత్తరాది రాష్ట్రాలు లబ్ధి పొందడం కాయం. ఏ దేశానికైనా ఆ దేశ సమగ్రతకు రాష్ట్రాల సాధికారిత ముఖ్యం. కేంద్రం కింద రాష్ట్రాలు నలిగిపోకూడదు. తమ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ఒకరకమైన విధానాలు ఇతర పార్టీల పాలనలో ఉన్న రాష్ట్రాలలో వేరే రకమైన విధానాలు వలన దేశ సమైక్యత సమగ్రత దెబ్బతింటుంది. భారతదేశం కేంద్రీకృత సమాఖ్య వ్యవస్థగా పుట్టింది. ఈ సమాఖ్య వ్యవస్థలో అన్ని రాష్ట్రాలకు సమాన అవకాశాలు కేంద్ర ప్రభుత్వం కల్పించాలి. నేడు కేంద్రంలో ఉన్న ప్రభుత్వం జనాభా ప్రాతిపదికన పార్లమెంటరీ స్థానాలను, అసెంబ్లీ స్థానాలను, నిర్ణయిస్తూ డీలిమిటేషన్ చేపట్టడం చూస్తున్నాం. బిజెపి పాలిత రాష్ట్రాలలో అధిక జనాభా గల రాష్ట్రాలుగా ఉన్నాయి. జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ చేస్తే 850 లోక్‌సభ సీట్లు పెరుగుతాయని ఒక అంచనా. అందులో దక్షిణాది రాష్ట్రాలకు 66 సీట్లు మాత్రమే పెరిగే ఉత్తరాది రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్ బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ (బీమారి రాష్ట్రాలు)గుజరాత్ ఈ ఐదు రాష్ట్రాలకు గాను 101 లోక్‌సభ సీట్లు పెరుగుతాయి. ఈ ఉత్తరాది రాష్ట్రాలకు లోక్‌సభ సీట్లు 77 పెరగగా దక్షిణాది రాష్ట్రాలకు తెలంగాణ ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక 33శాతం మాత్రమే పెరుగుతాయి అయితే దక్షిణాది రాష్ట్రాల గత లోక్సభ 543 సీట్లలో 25 శాతం ఉండగా నేడు అది 20 శాతానికి పడిపోతున్నది. అదే ఉత్తరాది రాష్ట్రాల సభ్యుల శాతం గతంలో 38 శాతం కాగా నేడు అది 43 శాతానికి పెరుగనున్నది. ఇలా డీలిమిటేషన్ వలన ఉత్తరాది రాష్ట్రాలు లోక్‌సభ సభ్యుల సంఖ్య పెరిగిపోయి దక్షిణాది రాష్ట్రాలపై వారి ఆధిపత్యం ఉంటుందని ఇది దేశ సమైక్యతకు సమగ్రతను దెబ్బతీస్తుందని నిపుణుల అభిప్రాయం. ఉత్తరాది రాష్ట్రాలు దేశ పరిపాలన విధానాలలో ఆధిపత్యం వహిస్తాయి. పెరుగుతున్న జనాభాకి కావలసిన వసతులు కల్పించలేమని 1970లో జనాభా పెరుగుదలను గణనీయంగా దక్షిణాది రాష్ట్రాలు తగ్గించుకుంటే అదే నేడు దక్షిణాది రాష్ట్రాలకు శాపంగా మారింది.



దేశ ఆర్థిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న దక్షిణాది రాష్ట్రాలు పాలనాపరమైన విషయాలలో పార్లమెంట్లో వారి పాత్ర ఉత్తరాది రాష్ట్ర జనాభా ఆధిక్యం వలన తగ్గిపోతు న్నది. ఐదు దక్షిణాది రాష్ట్రాల పన్నుల రాబడి వాటా 36 శాతం కాగా, 24ఉత్తరాది రాష్ట్రాల పన్నుల వాటా 64శాతమే. దక్షిణాది రాష్ట్రాల వాటా 36 అయినా కేంద్ర ప్రభుత్వం నుంచి దక్షిణాది రాష్ట్రాలు పొందుతున్నది కేవలం 18.6 శాతం మాత్రమే. ఆదాయం కొద్దీ జీఎస్టీ జనాభా కొద్దీ ఆదాయ పంపిణీ అంటూ దక్షిణాది రాష్ట్రాలు రూపాయి ఇస్తే వారికి తిరిగి 30పైసలు మాత్రమే ఇస్తూ, అదే ఉత్తరాది రాష్ట్రాల రూపాయి ఇస్తే నాలుగు రూపాయల వరకు వారి జనాభా పేదరికంలో కూరుకుపోయిందని ఇతర కారణాలు చెప్పి దేశ ఆదాయ వనరులను నేడు అప్పగిస్తుం డడం సమాఖ్య వ్యవస్థకు పూర్తిగా వ్యతిరేకమైనది. ఒక శాస్త్రవేత్త 1980లో బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలను భీమారు రాష్ట్రాలుగా పిలిచారు. అంటే బీహార్,మధ్యప్రదేశ్, రాజస్థాన్,ఉత్తరప్రదేశ్, హిందీలో బీమారు అంటే వ్యాది గ్రస్థమైన అనే అర్థంవచ్చే పదాన్ని చేర్చారు. జనాభా పరంగా ఆయుష్ ప్రమాణం రీత్యా పేద రికం నిరుద్యోగం తలసరి ఆదాయం అత్యల్ప స్థాయిలో ఉండి కనీస జీవన ప్రమాణాన్ని కూడా పొందని జనాభాఎక్కువగా ఉండడంతో భీమారు రాష్ట్రాలుగా పేర్కొన్నారు.ప్రజల జీవన ప్రమాణాల రీత్యా ఈ భీమారు రాష్ట్రాలు ఇతర రాష్ట్రాలతో పోలిస్తే చాలా వెనుకబడి ఉన్నాయి. గ్లోబల్ మల్టీ డైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్ 2024 లో మన దేశం 112 దేశాలలో 105వది.దీనికి కారణం పైనపేర్కొన్న భీమారు రాష్ట్రాలలో అనేక జిల్లాల్లో కడు పేదరికంతో అల్ప వృద్ధిలో వెనుకబడిన ప్రాంతాలుగా ఉండడం ప్రధాన కారణం. ఇక్కడ ప్రజలు పేదరికంలో ఉపాధి అవకాశాలు లేక కొనుగోలు శక్తి అతి తక్కువగాపోషక ఆహారలోపంతో ఆయుష్ ప్రమాణంఅత్యల్ప స్థాయిలో ఉన్నది. దీనికి ప్రధా నమైన కారణం ఈ రాష్ట్రాలలో జనాభా నియంత్రణ అమ లు ఆశించిన మేరకు ఆనాడు జరగలేదు. 1970లో అప్పటి ప్రభుత్వాలు జనాభా నియంత్రణ చేస్తే తప్ప మానవవనరుల ను విద్య, వైద్య ఆదాయపరంగా అభివృద్ధి చేయలేమని కుటుంబ నియంత్రణతోనే మానవాభివృద్ధి జరుగుతుందని కుటుంబ నియంత్రణ దేశవ్యాప్తంగా చేపట్టగా దక్షిణాది రాష్ట్రాలు ఈ విధానాన్ని కచ్చితంగా అమలు చేయడంవలన నేడు ఈ దక్షిణాది రాష్ట్రాల జనాభా తగ్గుతూ వచ్చింది. అయితే ఈ భీమారు స్టేట్స్ కుటుంబ నియంత్రణనుతూతూ మంత్రంగా అమలు చేయడం వలన జనాభా పెరిగింది. ఇప్పుడు జనాభా రంగంలో డీలిమిటేషన్ చేసి పార్లమెంట్ సీట్లు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోంది. ●

ఈవిఎంలు నిల్వచేసిన గోడౌన్ తనిఖీ చేసిన పల్నాడు జిల్లా కలెక్టరు

నరసరావుపేట, ఏప్రిల్ 22 ప్రభాతవార్త: పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట మార్కెట్ యార్డ్ లో నిల్వ చేసిన ఎలక్ట్రానిక్ ఓటింగు మిషన్ల గోడౌన్ ను జిల్లా కలెక్టరు కృతిక శుక్లా తనిఖీ చేశారు. ఈవియం గోడౌన్ వద్ద సిసి

కెమేరాలతో చేసిన భద్రతా ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ కృత్తిక శుక్లా, ఆర్డీవో బాలమురళీ కృష్ణ,తహసిల్దార్ వేణుగోపాల్ తో పరిశీలించారు. ఈవియం యంత్రాలు,ఎఫ్.బి. యులు, సియులు, వివిప్యాట్ లను, అక్కడి భద్రతా ఏర్పాట్లను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. అనంతరం రిజిస్టరులో జిల్లా కలెక్టరు సంతకం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు మేరకు ఈవీఎం గోడౌన్ తనిఖీలో భాగంగా ఈవియం గోడౌన్ కు వేసిన భద్రతా సీళ్ల, సిసి కెమెరాలు పనితీరు, అగ్నిమాపక దళ పరికరాలు, మొదలైనవి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ భారతీయ ఎన్నికల సంఘం ఆదేశాలు మేరకు ఈవియం గోడౌన్ కు పటిష్ట భద్రత కల్పించామని అన్నారు. ఎప్పటి కప్పుడు గౌడౌన్ ను క్షుణంగా తనిఖీ చేసి ఎన్నికల సంఘానికి నివేదిక పంపిస్తున్నామన్నారు. ఈవియం గోడౌన్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టరు కృత్తిక శుక్లా ఆదేశించారు.

కిడ్నాపర్ల చెర నుండి బాలుడిని రక్షించిన పోలీసులు

పెనమలూరు/మచిలీపట్నం ఏప్రిల్22,ప్రభాతవార్త : కిడ్నాపర్ల చెరలో నుండి మరో బాలుడికి పోలీసులు ప్రాణభిక్ష పెట్టారు.కృష్ణాజిల్లాలో సంచలనంగా మారిన కిడ్నాప్ కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు.పెనమలూరు నియోజకవర్గం పెనమలూరు పోలీసుస్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనలో మరో ముగ్గురు నిందితులను బుధవారం అదుపులోకి తీసుకున్నారు.కిడ్నాపర్ల చెరలో ఉన్న మరో బాలుడిని సురక్షితంగా రక్షించి రూ.80,500 నగదును పోలీసులు సీజ్ చేసారు.కృష్ణాజిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు.సులభంగా డబ్బు సంపాదిం చాలని ఆశపడి అభం శుభం తెలియని చిన్నారులను

ఎరగా చేసుకొని కన్నతల్లుల నుండి వేరుచేసి విక్రయిస్తున్న ముఠాను పోలీసులు బట్టబయలు చేసారు.ఈ నెల 17వ తేదీన నమోదైన కేసులో ఇప్పటికే 10నెలల బాలుడిని రక్షించి,కొనుగోలు చేసిన ఇద్దరితో పాటు ఒక ఆటోడ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ చేయగా ప్రధాన నిందితులైన విజయవాడ రాజరాజేశ్వరీపేటకు చెందిన గంటా మేరీ(26),క్రొత్త రాజరాజేశ్వరీపేటకు చెందిన పిడమర్తి కనకమ్మ(23),అయ్యప్పనగర్‌కు చెందిన గండికోట గురమ్మ(30) ఈ ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు.వీరు ప్రధానంగా భాక్షాటన చేసే మహిళలను లక్ష్యంగా చేసుకొని వారివద్ద ఉన్న పిల్లలను మాయమాటలతో అపహరించి ఇతరులకు విక్రయిస్తూ డబ్బు సంపాదిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.ఈ కేసులో మరింత దర్యాప్తు కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

అమరావతి వార్త

మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు మృతి

తెనాలి మున్సి పాలిటీ, ఏప్రిల్22, (ప్రభాతవార్త): నిలువెత్తు తెలుగుదనానికి నిజమైన రూపం,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో ప్రత్యేక పాత్ర పోషించిన,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు(90)బుధవారం ఉదయం పరమపదించారు. వయోసంబంధిత సమస్యలతో హైదరాబాద్‌లోని కాంటినెంటల్ హాస్పిటల్స్ లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఈ సందర్భంగా తెనాలి పట్టణానికి

చెందిన పలువురు నాదెండ్ల భాస్కరరావు అభిమానులు, సన్నిహితులు ఆయనతో గల సాంగత్యాన్ని ఆయన పరిపాలనాదక్షతను, పేద వర్గాల అభ్యున్నతికి నిరంతరం ఆలోచించే ఆయన ఆలోచన విధానాన్ని, తలుచుకొని తీవ్రవిచారం వ్యక్తం చేశారు. సొంత గడ్డ అయిన తెనాలి దగ్గరలోని కొల్లూరు మండలం దోనేపూడి గ్రామం అయినా తెనాలి పట్టణమన్న తెనాలి వాసులన్న ఎంతో అభిమానించే వారిని,తెనాలి పట్టణ అభివృద్ధిలో శాసనసభ్యునిగా ఆయన చేసిన పనులు నేటికీ చిరస్థాయిగా నిలిచిపోయాయని,నేటితరం రాజకీయ నాయకులకు ఆయన ఆదర్శప్రాయులని ఆయన ఏ పదవిలో ఉన్న ఎంతఎత్తుకు ఎదిగిన తెనాలి వాసులు, అభిమానులను ఎంతో ఆప్యాయంగా పలకరించే వారిని,ఎప్పుడు ఏ సమస్య గురించి ఆయనతో ప్రస్తావించిన,వెంటనే అందుకు సంబంధించి చర్యలు తీసుకునే వారిని గుర్తు చేసుకున్నారు. వ్యవసాయ కుటుంబంలో జన్మించిన ఆయన,చిన్నతనం నుండే దేశభక్తి భావాలను కలిగి ఉండటంచేత ఆయనపై రాజకీయ ప్రభావం చాలా ఎక్కువగా ఉండేదని ఆశయంతోనే న్యాయవాద వృత్తి నుండి రాజకీయాల్లోకి ప్రవేశించి తన జీవితాన్ని ప్రజాసేవకు పూర్తిస్థాయి రాజకీయాలకు కేటాయించి ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్నారని, నాదెండ్ల భాస్కరరావు సన్నిహితులు అభిమానులు తెలిపారు.ఈసందర్భంగా, నాదెండ్ల భాస్కరరావు మృతికి తీవ్ర సంతాపం తెలిపారు. ఆయన పవిత్రఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నామన్నారు.ఈ సందర్భంగా,పట్టణానికి చెందిన ముస్లిం మైనారిటీ నాయకులు రాష్ట్ర బోర్డు డైరెక్టర్ ఇస్మాయిల్ బేగ్, షేక్ జాకీర్ హుస్సేన్ అలాగే జనసేన పార్టీకి చెందిన సీనియర్ నాయకులు నన్నపనేని

తెనాలి పై నదెండ్లకు అమితమైన అభిమానం

రాంబాబు, కోట అక్కేశ్వరరావు సీనియర్ న్యాయవాదులు హరిదాసు గౌరీశంకర్,జంపని ఆదినారాయణ పలువురు పార్టీ నాయకులు, జనసైనికులు,వీరమహిళలు, స్థానిక శాసనసభ్యులు రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కి, ఆ భగవంతుడు మనోధైర్యం కల్పించాలని,తన తండ్రి స్వర్గీయ నాదెండ్ల భాస్కరరావు ఆశయాలను ఆలోచనలను ముందుకు తీసుకెళ్లాలని కోరుకుంటున్నామన్నారు.

తల్లి సొమ్మును బెట్టింగులో పోగొట్టిన కొడుకు

గుంటూరు ఏప్రిల్ 22, ప్రభాతవార్త ప్రతినిధి : తల్లి కష్టపడి సంపాదించిన సొమ్మును ఓ కొడుకు క్రికెట్ బెట్టింగుల్లో పెట్టి పోగొట్టాడు. తల్లి బ్యాంకులో దాచుకున్న రూ. 3 లక్షలు పోగొట్టిన ఓ మైనర్ కొడుకు అదృశ్యమైన ఘటన మాచర్ల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. మాచర్ల పట్టణానికి చెందిన ఓ కుటుంబం కొన్నేళ్లుగా గుంటూరులో నివాసం ఉంటుంది. తండ్రి చనిపోవడంతో కుటుంబ బాధ్యత తల్లిపై పడింది. వీరికి ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తి చేశాడు. కొన్నేళ్లుగా ఆన్లైన్‌లో క్రికెట్ బెట్టింగులకు పాల్పడుతున్నాడు. ఈక్రమంలో తల్లి ఖాతాలోని రూ.3 లక్షలు బెట్టింగ్లో పెట్టి నష్టపోయాడు. నెలరోజుల కిందట పెద్దకుమారుడితో కలిసి తల్లి బ్యాంకుకు వెళ్లి ఖాతా పరిశీలించగా డబ్బులు లేవని తెలిసింది. మంగళవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన చిన్నకుమారుడు కనిపించకుండా పోయాడు. ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో కుటుంబ సభ్యులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అన్న క్యాంటీన్లకు విరాళాలతో చేయూతను ఇవ్వండి : ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్

తిరువూరు, ఏప్రిల్ 22, ప్రభాతవార్త : ఎన్టీఆర్ జిల్లా తిరువూరు టౌన్ అన్నా క్యాంటీన్లకు విరాళాలతో చేయూతనివ్వండి, ముఖ్యమంత్రి దంపతుల స్ఫూర్తితో ముందుకురండిఅంటూ జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశపిలుపునిచ్చారు.అన్నార్తులకు పట్టెడన్నం పెట్టి ఆకలి తీర్చే మార్గదర్శులుగా అన్నదాతలుగా మారే అవకాశముందని, ప్రతిఒక్కరూ వారి ఇళ్లలో జరిగే శుభకార్యాలు సందర్భంగా అన్నా క్యాంటీన్‌కు విరాళం అందించి మంచి మనసు చాటుకోవాలని జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. జిల్లా పర్యటనలో

భాగంగా బుధవారం కలెక్టర్ లక్ష్మీశ తిరువూరు పట్టణంలోని అన్నా క్యాంటీన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి, ఆ క్రమంలోనే పేదలతో కలిసి భోజనం చేశారు. ఆహారాన్ని రుచిచూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అక్కడికి వచ్చిన వారితో మాట్లాడి అన్నా క్యాంటీన్‌పై అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఆహార పట్టిక టోకెన్ కౌంటర్ ఆహార పదార్థాలను వడ్డిస్తున్న స్థలం డైనింగ్ ఏరియాతో పాటు పరిశుభ్రమైన స్వచ్ఛమైన తాగునీరు అందించే ఏర్పాట్లు చేతులు శుభ్రం చేసుకునేందుకు చేసిన ఏర్పాట్లు మరుగుదొడ్లు తదితరాలను పరిశీలించారు.

జలధార జలహారతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

గుంటూరు, ఏప్రిల్ 22,ప్రభాతవార్త ప్రతినిధి : జలధార జల హారతి కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినా పిలుపునిచ్చారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం చైర్ పర్సన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి గుంటూరు జిల్లా కలెక్టర్ సాయి కాంత్ వర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టే విధంగా రాష్ట్ర ప్రభుత్వం జల ధార జల హారతి వంద రోజుల కార్యక్రమానికి శ్రీకారం

చుట్టిందన్నారు. ప్రతి చెరువును నిండు కుండలా చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రతి చెరువులో పూడికలు తీసి నీటి నిలువ సామర్థ్యాన్ని పెంచాలని అన్నారు. చెరువుల్లోకి నీటి పారుదల ఉన్న కాలువల్లో ఎటువంటి పూడికలు లేకుండా నీటిపారుదల నిరాటంకంగా జరుగుటకు దోహదం చేయాలని సూచించారు.

ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. వైద్య సేవలు మెరుగుపరచాలని, స్థానికంగానే మంచి వైద్య సౌకర్యాలు అందించాలని చెప్పారు. పల్నాడు జిల్లాలో అనుమతులు లేకుండా చేపల చెరువులను నిర్వహిస్తున్నారని, వ్యర్థాలను కృష్ణ జలాల్లో విడిచిపెడుతున్నారని వాటిపై పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. సి.ఆర్.డి.ఏ ప్రాంతంలో ఉన్న భూముల క్రయవిక్రయాలకు ఎటువంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. నల్లమడవాగు, ఇతర జల వనరుల కాలువలను గండ్లను పూడ్చుటకు చర్యలు చేపట్టాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకం కొరకు నిర్మించిన కిచెన్ షెడ్ల పిల్లల పేమెంటులో అందాల్సి ఉందని వాటిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ వెంకట రత్నం మాట్లాడుతూ జిల్లాలో 12 వందల చెరువులు ఉన్నాయని, ప్రతీ చెరువును గరిష్ట సామర్థం మేరకు నీటితో నింపుటకు చర్యలు చేపడుతున్నా మని అన్నారు. భూగర్భ జలాల 3 నుండి 6 మీటర్ల మధ్య నీటి మట్టం పెరుగుదల లక్ష్యంగా చేపట్టడం జరుగుతుందని అన్నారు. 15 మీటర్ల కంటే లోతైన ప్రాంతాలు ప్రాధాన్యతగా గుర్తించాలని, కనీసం ఒక మీటరు మెరుగుదల సాధించాలని తెలిపారు. శాటిలైట్ చిత్రాల ద్వారా శాస్త్రీయంగా చెరువుల మ్యాపింగ్ చేయడం, హైడ్రోలాజికల్ విశ్లేషణ ద్వారా నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలను గుర్తించడం, ఉపాధి హామీ పథకం నిధులతో పనుల అమలు, నిరంతర పర్యవేక్షణ, భూగర్భ జల మట్టాల విశ్లేషణ చేయడం జరుగుతుందన్నారు. గుంటూరు వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎం.పద్మావతి వ్యవసాయ శాఖ చేపడుతున్న వివరాలను తెలిపారు ఖరీఫ్, రబీ సీజన్లలో లక్ష్యానికి మించి పంటలు వేయడం జరిగిందని చెప్పారు. ఎరువుల కొరత లేదని తెలిపారు. పల్నాడు, బాపట్ల జిల్లా వ్యవసాయ అధికారులు ఆయా జిల్లాల్లో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు.ఉమ్మడి గుంటూరు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆయా జిల్లాల్లో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు.

ఈ సమావేశంలో శాసన మండలి సభ్యులు ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, మర్రి రాజశేఖర్, మురుగుడు హనుమంత్ రావు, ఏసురత్నమ్., శాసన సభ్యులు కన్నా లక్ష్మన్నారాయణ, అరవింద్ బాబు, వేగశన నరేంద్ర వర్మ, నక్క ఆనంద్ బాబు, బాష్యం ప్రవీణ్, జూలకంటి బ్రాహ్మారెడ్డి, ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ వందనాదేవి భీమనేని, పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ సంజన సింహా, ఉమ్మడి గుంటూరు జిల్లా అధికారులు, జడ్పీటీసీలు, ఎం.పి.పిలు తదితరులు పాల్గొన్నారు.

కాకాని శివయ్య సేవ ఇప్పుడు మరింత చేరువలో

యు.పి.ఐ. చెల్లింపుల ద్వారా సెల్ఫ్ కియోస్క్ మిషన్ ఏర్పాటు

గుంటూరు, ఏప్రిల్ 22,ప్రభాతవార్త : పెదకాకాని శివాలయములో భక్తుల సౌకర్యార్ధము డిజిటల్ చెల్లింపులు ప్రోత్సహించుటలో భాగముగా కరూర్

వైశ్యాబ్యాంకు వారి సౌజన్యముతో ఆలయ ప్రాంగణములో సెల్ఫ్ కియోస్క్ టిక్కెట్ మిషన్ ప్రారంభించినట్లు ఆలయ ఉపకమీషనరు గోగినేని లీలాకూమార్, ధర్మకర్తలమండలి చైర్మన్ కోసూరి పూర్ణచంద్రరావు తెలిపారు.బుధవారము ఉదయం ఆలయ ప్రాంగణములో అర్చకస్వాములు, వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరము బ్యాంకు అధికారులతో కలిసి సెల్ఫ్ కియోస్క్ టిక్కెట్ మిషన్ ప్రారంభించినట్లు తెలిపారు. భక్తులు నేరుగా సెల్ఫ్ కియోస్క్ టిక్కెట్ మిషన్ ద్వారా వారికి కావలసిన సేవ టిక్కెట్లను తర్వితగిన యు.పి.ఐ. నగదును చెల్లించి తద్వారా శ్రీ స్వామి వారి సేవలు, నవగ్రహపూజలు, వాహనపూజ తదితర సేవా టిక్కెట్లను భక్తులు స్వయముగా దేవస్థాన కౌంటరు క్యూలైనులలో వేచియుండకుండ పొందవచ్చునని తెలిపారు.దేవస్థానమునకు విచ్చేయు ప్రతి భక్తుడు యాత్రికులు సదరు అవకాశము వినియోగించుకొని సెల్ఫ్ కియోస్క్ టిక్కెట్ మిషన్ ద్వారా కావలసిన సేవ టిక్కెట్లను తర్వితగిన యు.పి.ఐ. చెల్లింపు ద్వారా తీసుకొనవలసినదిగా ఆలయ ఉపకమీషనరు గోగినేని లీలాకుమార్, ధర్మకర్తలమండలి చైర్మన్ కోసూరి పూర్ణచంద్రరావు తెలిపారు. కార్యక్రమములో ఆలయ చైర్మన్ కోసూరు పూర్ణచంద్రరావు, పాలకమండలి సభ్యులు శ్రీమతి బండారు మల్లేశ్వరి, శ్రీమతి పాముదుర్తి నాగలక్ష్మి, చేబ్రోలు వెంకటభాస్కరపున్నారావు, ధూపాటి శివశంకరరావు కరూర్ వైశ్యాబ్యాంకు డిప్యూటీ జనరల్ మేనేజరు నెరెళ్ళ రమేష్, ఏరియా సేల్స్ మేనేజరు సి.హెచ్. అరవింద్ గణేష్, ఛీఫ్ మేనేజర్ సి. వెంకటసత్యనారాయణ, మేనేజరు షేక్ సుభాని, కార్యాలయ సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నట్లు ఆలయ ఉపకమీషనరు గోగినేని లీలాకుమార్ తెలిపారు.

రూ. 64 కోట్లతో త్రీ స్టార్ రిసార్ట్స్ నిర్మాణం

స్వదేశీ దర్శన్ పనులపై బాపట్ల జిల్లా కలెక్టర్ సమీక్ష

బాపట్ల, ఏప్రిల్ 22. ప్రభాతవార్త ప్రతినిధి: బాపట్ల జిల్లాను పర్యాటక రంగంలో అగ్రగామిగా నిలపడమే లక్ష్యంగా స్వదేశీ దర్శన్‌అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ నుండి వివిధ శాఖల అధికారులు, పారిశ్రామికవేత్తలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సూర్యలంక బీచ్‌ను అద్భుతమైన పర్యాటక హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. పర్యాటకులకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించడంలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు. స్టార్ రిసార్ట్స్ నిర్మాణం: సూర్య నమస్కార్ త్రీ స్టార్ రిసార్ట్స్ నిర్మాణానికి ప్రభుత్వం రూ. 64 కోట్లతో అనుమతులు మంజూరు చేసిందని, దీనికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక ను వెంటనే సమర్పించాలని ఆదేశించారు. అలాగే ఫైవ్ స్టార్ రిసార్ట్స్, భ్రమరాంభ, రాజేష్ ఇన్‌ఫ్రా ప్రతినిధులతో మాట్లాడి పురోగతిని సమీక్షించారు. సౌర విద్యుత్ ప్రాజెక్ట్: బాపట్ల మండలం జమ్ములపాలెంలో సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు 20 ఎకరాల భూమి అవసరమని ప్రతినిధులు కోరగా, పరిశీలన అనంతరం లీజు ప్రాతిపదికన కేటాయిస్తామని కలెక్టర్ హామీ

ఇచ్చారు. బౌద్ధ స్తూపానికి పూర్వవైభవం: భట్టిప్రోలులోని చారిత్రాత్మక బౌద్ధ స్తూపం అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. జిల్లా అభివృద్ధికి ఇదొక సువర్ణావకాశమని, అధికారులు చిత్తశుద్ధితో, శక్తివంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా పర్యాటక అధికారి అలీఅస్గర్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ నరసింహారావు, పరిశ్రమల శాఖ అధికారులు, పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

జనగణన నమోదు పై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలి : ఎన్టిఆర్ జిల్లా కలెక్టర్

ఎ కొండూరు, ఏప్రిల్ 22, ప్రభాతవార్త : ఎన్టిఆర్ జిల్లా ఎ కొండూరు మండలంలో నిర్వహిస్తున్న డిజిటల్ జనగణన నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని చైతన్యనగర్ తండా గ్రామంలో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎన్టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అధికారులకు దిశ నిర్దేశం చేశారు. చైతన్యనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ పాల్గొని మాట్లాడుతూ డిజిటల్ విధానం ద్వారా జనగణన కార్యక్రమం నిర్వహించడం వల్ల సమాచార సేకరణ సులభతరంతో పాటు ట్రాన్స్‌పరెన్సీ (పారదర్శకత) పెరుగుతుందని సమగ్రంగా నమోదు చేయడం వల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై కచ్చితమైన డేటా అందుబాటులోకి వస్తుందని కలెక్టర్ లక్ష్మీశ

తెలిపారు. కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ప్రత్యక్షంగా తన మొబైల్ నుండి జనగణన నమోదు విధానాన్ని చూపించారు. అప్లికేషన్స్ వినియోగం విఓఏలు సిబ్బందికి వివరించారు. ప్రజలు స్వయంగా తమ వివరాలను నమోదు చేసుకునే అవకాశం ఉందని దీనిపై గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ కోరారు. రోజువారీ పురోగతిపై అధికారులు సమీక్షించి లక్ష్యాలు సాధించాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు. అనంతరం మండలంలో కొనసాగుతున్న నరేగా పనులపై సమీక్షించారు. చైతన్యనగర్ బిసి కాలనీలో తాగునీటి సమస్యపై ప్రస్తావిస్తూ కృష్ణాజలాల సరఫరాను త్వరగా ప్రారంభించి కాలనీ ప్రజలకు ఈ ఎండాకాలంలో తాగునీటి కొరతను నివారించాలని సంబంధిత ఆర్‌డబ్లుఎస్ పంచాయతీ నీటి ట్యాంకులు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పిడి నాంచారరావు, తిరువూరు ఆర్డీవో ఎ.కుమార్. ఆర్‌డబ్లుఎస్ ఇరిగేషన్, నరేగా డ్వామా శాఖల అధికారులు, ఎంపిడివో బి.శ్రీనివాసరావు, తహశీల్దార్ ఉదయ్‌భాస్కర్ ఆర్ఐ దివ్యప్రసాద్, గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చైర్మన్ అప్పారావు ఆకస్మిక తనిఖీలు

- భోజనశాలలో ఆహార నాణ్యతను పరిశీలించిన చైర్మన్ - రైతులతో స్వయంగా మాట్లాడి అందుతున్న సౌకర్యాల పై ఆరా

గుంటూరు ఏప్రిల్ 22 ప్రభాత వార్త ప్రతినిధి : గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ గా కుర్రా అప్పారావు పదవీ బాధ్యతలు స్వీకరించిన కొద్ది కాలంలోనే యార్డు పై తనదైన ముద్ర వేశారు. ఓ వైపు మిర్చి రైతుల సమస్యల పై దృష్టి సారిస్తూనే మరోవైపు యార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారు.ఈ క్రమంలో బుధవారం మిర్చి యార్డులో చైర్మన్ అప్పారావు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. యార్డ్‌లో ఉన్న భోజనశాలలో స్వయంగా భోజనం చేసి ఆహార నాణ్యతను పరిశీలించారు. రైతులు భోజనం చేసే పరిసరాలను , పరిశుభ్రతను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భోజన నాణ్యత, పరిశుభ్రతపై ప్రతి రైతును స్వయంగా అడిగి అభిప్రాయాలను తెలుసుకున్నారు. రైతుల భోజనం విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో తెలుసుకుని, వెంటనే సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు. యార్డ్‌కు వచ్చే ప్రతి రైతుకు శుభ్రమైన, నాణ్యమైన ఆహారం అందాలని స్పష్టం చేశారు.దూర ప్రాంతాల నుంచి వచ్చే రైతులు ఇబ్బంది పడకుండా భోజనశాలలో సరైన సదుపాయాలు ఉండేలా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతుల

సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా, భోజనశాల నిర్వహణలో మరింత మెరుగులు తీసుకురావాలని సూచించారు.ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటామ యార్డు చైర్మన్ అప్పారావు పేర్కొన్నారు.

కళారత్న అవార్డు గ్రహీతకు సన్మానం

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, ఏప్రిల్22, ప్రభాతవార్త: ఏఎన్‌యులోని మ్యూజిక్ విభాగం పూర్వ విద్యార్థి పి.వి.రమణకు రాష్ట్ర ప్రభుత్వం కళారత్న అవార్డు అందుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని విభాగం ఆధ్వర్యంలో బుధవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. విభాగాధిపతి డాక్టర్ పి.మంజుల, అధ్యాపకులు పసుమర్తి పావనిల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంకు ముఖ్యఅతిథిలుగా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.సురేష్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య ఎల్.ఉదయకుమార్‌లు పాల్గొని రమణకు సన్మానించారు. ఏఎన్‌యు విద్యార్థిగా తనకు దక్కిన గౌరవం మరువలేనిదని రమణ పేర్కొన్నారు. ఇటువంటి అవార్డులు విభాగానికి రావడం పట్ల వర్సిటీకి గర్వకారణంగా మంజుల పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యావిభాగం అధ్యాపకులు డాక్టర్ ఎం.వసంతరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

-ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

పొన్నూరు, ఏప్రిల్ 22,ప్రభాతవార్త: మహిళలు తమకు వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. మండల పరిధిలోని పచ్చలతాడిపర్రు గ్రామంలో నియోజకవర్గంలోని పెదకాకాని, చేబ్రోలు, పొన్నూరు

మండలంలోని డ్వాక్రా సంఘాల సభ్యులసమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధూళిపాళ్ళ మాట్లాడుతూ దొప్పలపూడి గ్రామానికి చెందిన సత్యసాయి స్వయం సహాయక సంఘ సభ్యురాలు కొండపల్లి అరుణకుమారికి, ఉప్పరపాలెంకు చెందిన చెన్నంశెట్టి లిల్లీ పుష్పంకు నేషనల్ ఎగ్ కార్పోరేషన్ సహకారంతో రూ.70వేలు విలువ గల రెండు ఎగ్ కార్ట్ ను అందజేశారు.పొన్నూరు మండలంలోని 15మంది లబ్దిదారులకు పిఎంఇజిపై పథకం నుండి ఒక యూనిట్ విలువ రూ.లక్ష కాగా లబ్దిదారుని వాటా రూ.10వేలు సబ్సిడి రూ.50వేలు, రూ.40వేలు బ్యాంకు నుండి వడ్డీలేని రుణంతో రూ.లక్ష విలువ గల యూనిట్ మంజూరు పత్రాన్ని అందజేశారు. పొన్నూరు మండలంలోని 46గ్రామసంఘాలకు విఓఏలకు స్మార్ట్ ఫోన్‌లను, పెదకాకాని మండలంలోని 43సంఘాలకు, చేబ్రోలు మండలంలోని 40గ్రామ సంఘాలకు స్మార్ట్ ఫోన్‌లను పంపిణీ చేశారు. ప్రతి గ్రామంలోని ప్రతి డ్వాక్రా మహిళ ఒక వ్యాపారవేత్త కావాలి అనేది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడ ఆశయమన్నారు. నియోజకవర్గంలో 45వేల మందికి పైగా డ్వాక్రా మహిళలు ఉన్నారని, వారి అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పిడి విజయలక్ష్మి, డిపిఎం కేశవ్‌కుమార్, కోటేశ్వరరావు, రాష్ట్ర ఎస్సీ కార్పోరేషన్ డైరెక్టర్ బండ్లమూడి బాబూరావు, వ్యవసాయ మార్కెట్‌యార్డు మాజీఛైర్మన్ మాదల వెంకటేశ్వరరావు, మైలా వెంకట రామరాజు, బొర్రు రామారావు,గణిపిశెట్టి రామకృష్ణ, చలమశెట్టి సీతారామయ్య, ఎంపిఎం జోజిబాబు, ఎంపిఎ శ్రీలక్ష్మీ,బచ్చుల రాజు, తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల రహిత జిల్లాగా పల్నాడును తీర్చిదిద్దుతాం

సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్,ఎస్పీ

నరసరావుపేట టౌన్,ఏప్రిల్ 22, ప్రభాతవార్త : ప్రభుత్వ శాఖలన్నీ సమన్వయంతో కలిసిమెలిసి పని చేసి నిషేధిత మాదక ద్రవ్యాలు మరియు గంజాయి సరఫరా సమస్య అరికట్టేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కృత్తిక శుక్లా కోరారు. మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా పల్నాడు జిల్లాను మార్చాలని కలెక్టర్ కృతిక శుక్లా ఆదేశించారు. జిల్లా కేంద్రమైన నరసరావుపేట కలెక్టరేట్ లో బుధవారం మాదక ద్రవ్యాలు మరియు గంజాయి నియంత్రణ

చర్యలపై అవగాహన కార్యక్రమాలకు సంబంధించి ఎన్ని ఓఆర్డీ (నార్కో కోఆర్డినేషన్ సెంటర్) జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని ఎస్పీ కృష్ణారావుతో కలిసి కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కృత్తిక శుక్లా మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా గుర్తించిన గంజాయి హాట్‌స్పాట్‌లను పోలీసులు పూర్తిగా తనిఖీ చేసి, పర్యవేక్షించాలని అన్నారు. మాదక ద్రవ్యాల సరఫరా మరియు తదితర కార్యకలాపాల్లో ఉన్న అనుమానిత వ్యక్తుల నివాస ప్రాంతాలను అధికారులు తనిఖీ చేయాలి. టిడ్కో హౌసెస్ లో కార్డాన్ అండ్ సెర్చ్ ఆపరేషన్స్ చేయాలని అన్నారు. గంజాయి ఎక్కువ మొత్తంలో సరఫరా చేస్తూ లేదా అమ్ముతూ దొరికిన వారిపై చట్ట పరంగా వారి ఆస్తులు జప్తుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్‌డీపీఎస్ చట్టం కింద నమోదైన లేదా కొనసాగుతున్న కొత్త కేసులపై సమీక్ష నిర్వహించాలన్నారు. మాదక ద్రవ్యాలను వినియోగిస్తున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. గంజాయి మరియు ఇతర మాదక ద్రవ్యాలను వినియోగించే వ్యక్తులను గుర్తించి, ట్రాక్ చేయడానికి ప్రయత్నించాలన్నారు. ఏరియా హాస్పిటల్ లో ఉన్న డీఅడిక్షన్ సెంటర్ ద్వారా చికిత్స అందించాలన్నారు.కొత్తగా ఏర్పాటైన డీఅడిక్షన్ సెంటర్లో స్టాఫ్ కొరత అధిగమించేందుకు నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. సంబంధిత అధికార సిబ్బంది తరచు డీఅడిక్షన్ సెంటర్ తనిఖీ చేయాలన్నారు. విద్యా సంస్థలకు 500 మీటర్ల దూరంలో పొగాకు మరియు డ్రగ్స్ అమ్మకాలు నిషేధించాలని కోరారు. ఆపరేషన్ గరుడను పునఃప్రారంభం చేయాలన్నారు. ఖినషా ముక్త్ భారత్ అభియాన్ నిధులను ప్రణాళికబద్ధంగా గంజాయి నిర్మూలించుటకు ఉపయోగించాలని కోరారు.జిల్లా విద్యాశాఖాధికారి మరియు ఎస్పీ కలిసి ఎన్.జి.ఓల సహాయంతో స్కూల్స్ మరియు కాలేజీలలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం అన్ని శాఖలు మరియు స్టేక్ హోల్డర్లు సమన్వయంతో కలిసిమెలిసి పని చేయాలన్నారు. ప్రతి హాస్టల్ లో డ్రగ్స్ మరియు గంజాయి నిషేధంపై అవగహన కల్పించాలని, పోస్టర్ లను ఏర్పాటు చేయాలన్నారు. కళాశాలల్లో నోడల్ అధికారిని నియమించాలని, ప్రతి పాఠశాల, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఏదైనా డ్రగ్స్ సంబంధిత సమాచారం ప్రజల వద్ద ఉన్న పక్షంలో పోలీస్ శాఖకు లేదా ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు సమాచారం అందజేయాలని కోరారు. సదరు వ్యక్తుల వివరాలు వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొనే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆన్‌లైన్ ద్వారా అక్రమంగా నార్కోటిక్స్ ఆర్డర్ చేసి విక్రయించే మెడికల్ షాపులపై ప్రత్యేక దృష్టి పెట్టి, తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కృష్ణారావు మాట్లాడుతూ, అన్ని శాఖలు సమన్వయంతో జిల్లాను డ్రగ్ ఫ్రీ జిల్లాగా మార్చాలన్నారు. గ్రామాల్లో గంజాయి సాగుపై కింది స్థాయి అధికారులకు, ఫారెస్ట్ బీట్ అధికారులకు, ఈగల్ అధికారులకు అవగాహన కల్పించాలన్నారు. ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ 1972పై అవగాహన మరింత పెంచాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ట్రాన్స్పోర్ట్ అధికారి సంజీవ్ కుమార్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శివ నాగేశ్వరరావు, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు ఆర్కే దుర్గ పద్మజ, అధికారులు పాల్గొన్నారు. రోడ్డు ప్రమాద బాధితులకు 1.50 లక్షల వరకూ ఉచిత వైద్యం రోడ్డు ప్రమాదాలకు గురైన బాధితులకు తక్షణమే మెరుగైన వైద్య సహాయం అందించేందుకు ఉద్దేశించిన ఖిప్రధానమంత్రి రోడ్డు యాక్సిడెంట్ విక్టిమ్స్ హాస్పిటలైజేషన్ అష్యూర్డ్ అండ్ ట్రీట్మెంట్ఖి పథకాన్ని జిల్లాలోని అధికారులు సమర్థవంతంగా అమలు చేయాలని పల్నాడు జిల్లా కలెక్టర్ కృత్తిక శుక్లా ఆదేశించారు. కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఈ ఆర్థిక సంవత్సరం నుంచి అమలులోకి వచ్చిన ఈ నూతన పథకం ద్వారా ప్రమాద బాధితులకు గోల్డెన్ అవర్‌లో అత్యవసర చికిత్స అందించడం సాధ్యమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యంగా ఎన్టీఆర్ వైద్య సేవలు అందించే గుర్తింపు పొందిన ఆసుపత్రులలో ఒక్కో బాధితునికి రూ.1.50 లక్షల వరకు ఉచితంగా వైద్యం అందించవచ్చని స్పష్టం చేశారు. పల్నాడు జిల్లాలో ప్రస్తుతం 4 ప్రభుత్వ ఆసుపత్రులు మరియు 34 ప్రైవేట్ ఆసుపత్రులు కలిపి మొత్తం 38 ఆసుపత్రులలో ఈ ఉచిత చికిత్స అందుబాటులో ఉంటుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రవి వివరించారు. జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలలో అత్యధికంగా ద్విచక్ర వాహనదారుల వల్లే జరుగుతున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రమాదాల నివారణకు రవాణా మరియు పోలీసు శాఖలు కఠిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. జిల్లా ఎస్పీ బి. కృష్ణారావు ప్రమాదాల నివారణకు తమ శాఖ చేపడుతున్న వివిధ భద్రతా చర్యలను వివరించారు. అదే సమయంలో జిల్లా కేంద్రంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకొని, రోడ్లపై ఉన్న ఆక్రమణలను గుర్తించి వెంటనే తొలగించాలని రోడ్డు సేఫ్టీ ఎన్జీవో ప్రతినిధులను కోరారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రోడ్డు భవనాల శాఖ, పంచాయతీరాజ్, మున్సిపల్ అధికారులు మరియు రెవిన్యూ డివిజనల్ అధికారులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం కలెక్టర్ మరియు ఇతర అధికారులు ఖిప్రధానమంత్రి రోడ్డు యాక్సిడెంట్ విక్టిమ్స్ హాస్పిటలైజేషన్ అష్యూర్డ్ అండ్ ట్రీట్మెంట్ఖి పథకానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు.

బాక్సింగ్ క్రీడను ప్రోత్సహించాలి

తులసి ధర్మచరణ్

గుంటూరు,ఏప్రిల్ 22,ప్రభాతవార్త:అంతర్జాతీయ క్రీడైన బాక్సింగ్ ను ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందని వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మరియు గుంటూరు జిల్లా బాక్సింగ్ ప్రెసిడెంట్ తులసి ధర్మ చరణ్ పేర్కొన్నారు. బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొనసా వేణుగోపాల రావు మెమోరియల్ బాక్సింగ్ ఛాంపియన్షిప్ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. అంతేకాకుండా డీఈవీ అఫ్రోజ్ ఖాన్ గారు ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేయడమే కాకుండా క్రీడాకారుల్ని అభినందించారు. ఈ కార్యక్రమానికి గుంటూరు జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ సెక్రటరీ మరియు కార్యదర్శి డాక్టర్ చిరంజీవి అధ్యక్షత వహించారు. తులసి ధర్మచరణ్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ కటోర సాధన తోనే బాక్సింగ్ క్రీడలో విజయాలు సాధ్యమవుతాయి అన్నారు. గ్రామీణ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించడం ద్వారా రాష్ట్రానికి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభవంతులైన క్రీడాకారులు తయారవుతారు అన్నారు. ఈ సందర్భంగా బాక్సింగ్ విజేతలకు తులసి ధర్మ చరణ్ గారు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాక్సింగ్ కోచ్ ఆర్.విశ్వనాథం, గంధం వెంకటేశ్వరరావు, వాకా శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయండి : ధర్మకర్తల మండలి సభ్యులు పిలుపు

పొన్నూరు, ఏప్రిల్ 22,ప్రభాతవార్త: స్వర్ణపురి పట్టణంలో వేంచేసియున్న శ్రీ సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత సాక్షి శ్రీ భావనారాయణస్వామివారి వార్షిక నవాహ్నిక బ్రహ్మోత్సవాలలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ధర్మకర్తల మండలి సభ్యుడు శిఖాకొల్లి గుర్నాధరావు

పిలుపునిచ్చారు. అందుకు సంబంధించిన కరపత్రాలను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా శిఖాకొల్లి గుర్నాధరావు మాట్లాడుతూ బ్రహోత్సవాల సందర్భంగా ప్రతి రోజు రాత్రి 8గంటలకు శ్రీ సా ్వమి, అమ్మవార్లు ప్రత్యేక అలంకరణలో, ప్రత్యేక వాహన సేవలో భక్తులకు దర్శనమిస్తారన్నారు. ఉత్సవాల సందర్భంగా ప్రతి నిత్యం ఉదయం 10గంటలకు స్వామివార్లకు స్నపన తిరుమంజనోత్సవం జరుగుతుందన్నారు. 23వ తేదీ రాత్రి 10గంటలకు ధ్వజారోహణ కార్యక్రమం జరుగుతుందన్నారు. 24వ తేదీన శేషవాహనంపై స్వామివారి భక్తులకు దర్శనమిస్తారన్నారు. 25వ తేదీన హంసవాహనసేవ, 26న హనుమద్వాహనసేవ, 27న సింహ వాహనసేవ, 28న రాజాధిరాజవాహన సేవ, 29న పొన్నవృక్ష వాహన సేవ, 30వ తేదీన గజవాహనముపై శ్రీస్వామివారి గ్రామోత్సవం,ఎదురు కోలోత్సవ, రాత్రి 12గంటలకు శ్రీస్వామివారి దివ్య తిరుకళ్యాణోత్సవం జరుగుతాయన్నారు.మే 1వ తేదీన ఉదయం గరుడవాహన సేవ, సాయంత్రం రథోత్సవం జరుగుతాయన్నారు.2వ తేదీన ఉదయం వసంతోత్సవం, చక్రస్నానం, రాత్రికి ధ్వజావరోహణము కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 3వ తేదీ స్వామివారి తెప్పోత్సవము జరుగుతాయన్నారు. ఈ ఉత్సవాలలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు కాట్రగడ్డ రామచంద్రరావు, గుడివాడ పవన్, ధరణికోట సాయికిరణ్, ఆకురాతి అనూరాధ, ఊటుకూరి బాజి శిరీష, సింహాద్రి రాము తదితరులున్నారు.

రైతులు అమితంగా ఇష్టపడేది ఎడ్ల పందేలే : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, ఏప్రిల్ 22, ప్రభాతవార్త: ఎడ్ల బలప్రదర్శనలకు లభిస్తున్న ప్రజాదరణ మరే పోటీలకు ఉండదని, రైతులు అమితంగా ఇష్టపడే వ్యాపకాల్లో ఒంగోలు గిత్తల బలప్రదర్శన ఒకటని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. నందమూరి తారక రామారావు, నూతలపాటి పరమేశ్వరరావు మెమోరియల్ విభాగం ఆధ్వర్యంలో ప్రత్తిపాడులో జరుగుతున్న జాతీయస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలకు ప్రత్తిపాటి ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ఏపీఐఐసీ ఛైర్మన్, టీడీపీ నాయకులు మంతెన రామరాజుతో కలిసి పందేల్లో గెలుపొందిన ఎడ్ల యజమానులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ప్రత్తిపాటి మాట్లాడారు. తాను వ్యవసాయమంత్రిగా ఉన్నప్పుడే ఎండ్లపందేలపై ఉన్న నిషేధాన్ని నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో తొలగించడం జరిగిందని ప్రత్తిపాటి తెలిపారు. ఎడ్లపందేలకు ప్రభుత్వ సహకారంపై ముఖ్యమంత్రితో మాట్లాడతామన్నారు. ఎడ్లపందేలకు ప్రభుత్వ సహాయ సహకారాలు లభిస్తే, ఒంగోలు జాతి గిత్తల పోషణకు మరింత ఆదరణ లభిస్తుందని, ఎంతోమంది ఎడ్ల పెంపకంపై మక్కువ చూపుతారని ప్రత్తిపాటి చెప్పారు. ఈ అంశాన్ని తప్పకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని ప్రత్తిపాటి సభాముఖంగా తెలియచేశారు. ఎడ్లపందేలతో పాటు. తెలుగుప్రజలు ఇష్టపడే నాటికలు, నాటకాల ప్రదర్శనకు కూడా ప్రభుత్వం చేయూత అందించేలా చూస్తామన్నారు. ఎప్పుడు, ఎక్కడ ఎడ్ల పందేలు నిర్వహించినా, రైతాంగం

భారీసంఖ్యలో హాజరవుతారని, చివరివరకు పోటీలను కళ్లార్పకుండా చూస్తారని ప్రత్తిపాటి చెప్పారు. ఎన్టీఆర్ స్మృత్యర్థం దివంగత పరమేశ్వరరావు కుమారులు అమర్, త్రిలోక్ ప్రజాహిత కార్యక్రమాల్లో ఎప్పుడూ ముందుంటారని, వారి నేతృత్వంలో జరుగుతున్న ఎడ్ల పందేలకు రావడం ఎంతో ఆనందాన్నిచ్చిందని ప్రత్తిపాటి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ కందుల రమణ, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ భావదేవునికి వెండి కళ్ళు,నొసలు బహూకరణ

పొన్నూరు, ఏప్రిల్ 22,ప్రభాతవార్త: పట్టణంలో వేంచేసియున్న శ్రీ సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత సాక్షి శ్రీ భావనారాయణస్వామివారికి భక్తులు దోడర్ల వెంకటేష్ వెండితో తయారు చేసిన నేత్రాలు, నొసలు బహూకరించారు. సుమారు 20గ్రాములతో తయారు చేసిన ఆభరణాలను

అర్చకస్వామి గోవర్ధనం రామకృష్ణకు అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ స్వామివారిపై ఉన్న విశ్వాసంతో తనకు తోచిన విధంగా స్వామివారి సేవలో తనవంతు తరించాలనే ఉద్దేశంతో ఈ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు శిఖాకొల్లి గుర్నాధరావు, కాట్రగడ్డ రామచంద్రరావు తదితరులున్నారు. ధర్మకర్తల మండలి డైరెక్టర్ శిఖాకొల్లి గుర్నాధరావు మాట్లాడుతూ దేవాలయం అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని కోరారు. దేవాలయంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలకు భక్తులు, దాతలు చేయూతనివ్వాలని కోరారు.

మునిసిపల్ కమిషనర్‌గా రమ్య కీర్తన బాధ్యతలు స్వీకరణ

నరసరావుపేట, ఏప్రిల్ 22 ప్రభాతవార్త : నరసరావుపేట మునిసిపల్ కమిషనర్‌గా రమ్య కీర్తన బుధవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా రమ్య కీర్తన మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, ప్రజలకు మెరుగైన సేవలు అందించడం తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. నూతన బాధ్యతలు చేపట్టిన రమ్య కీర్తనకు మునిసిపల్ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

సుభాని మేస్త్రిని పరామర్శించిన మాజీ మంత్రి కాసు కృష్ణారెడ్డి

చిలకలూరిపేట, ఏప్రిల్ 22, ప్రభాతవార్త: చిలకలూరిపేట పట్టణానికి చెందిన ప్రముఖ నాయకులు, ఎంబిటి సుభాని మేస్త్రిని మాజీ మంత్రి కాసు వెంకట కృష్ణారెడ్డి పరామర్శించారు. గత కొద్దిరోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న సుభాని మేస్త్రి, ప్రస్తుతం తన స్వగృహంలోనే ఉండి విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న కాసు కృష్ణారెడ్డి చిలకలూరిపేటలోని సుభాని నివాసానికి చేరుకుని, తన చిరకాల మిత్రుడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా వారిద్దరూ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. మాజీ మంత్రితో పాటు సుభాని మేస్త్రిని పలకరించిన వారిలో డాక్టర్ ముప్పాళ్ళ హనుమంతరావు, షేక్ ఫరీద్, కపిలవాయి శివ ప్రసాద్, పొట్టి ఆంజనేయులు, యన్నం రవీందర్ రెడ్డి, మిలిటరీ వెంకటేశ్వర్ రెడ్డి, బాలాజీ సింగ్, సయ్యద్ కరీముల్లా, జిలానీ, నాసర్ వలి,ఖాదర్ వలి, పలువురు నాయకులు ఉన్నారు.

సిఎం సహాయనిధి అందజేత

చిలకలూరిపేట, ఏప్రిల్ 22, ప్రభాతవార్త: చిలకలూరిపేట నియోజకవర్గం, పసుమర్రు గ్రామానికి చెందిన మట్టకోయ మాధవరావు ముందస్తు చికిత్స కోసం సీఎం సహాయనిధి నుండి 89,766 రూపాయల ఎల్ఒసి ను మాధవరావు



కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అందజేశారు. అనంతరం ప్రత్తిపాటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేద ప్రజల గురించి నిరంతరం ఆలోచించే ప్రభుత్వం అని, ఎంతోమందికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆదుకున్నామని తెలిపారు.

దూరదర్శన్ సప్తగిరి లైవ్‌లో కేరిడ్జ్ విద్యార్థుల బహుభాషా ప్రతిభ

నరసరావుపేట టౌన్,ఏప్రిల్ 22 ప్రభాతవార్త : :నరసరావుపేటలోని కేరిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు దూరదర్శన్ సప్తగిరి ఛానల్‌లో ఈనెల 21న ప్రసారమైన లైవ్ కార్యక్రమంలో తమ విశిష్ట ప్రతిభను ప్రదర్శించి, ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నారని పాఠశాల ఛైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు జర్మన్, ఫ్రెంచ్, ఇటాలియన్, స్పానిష్, జపనీస్ మరియు ఇంగ్లీష్ వంటి 6 అంతర్జాతీయ భాషల్లో మాట్లాడి తమ బహుభాషా నైపుణ్యాన్ని చాటుకున్నారని తెలిపారు.

ముఖ్యంగా పాఠశాల ప్రతిజ్ఞను వివిధ భాషల్లో చెప్పడం, ప్రాథమిక పదజాలాన్ని (వొకాబ్యులరీ) వివరించడం, సంభాషణలు జరపటం, పాటలు పాడటం ద్వారా తమ భాషా ప్రావీణ్యాన్ని అద్భుతంగా ప్రదర్శించారని పేర్కొన్నారు. ఈ లైవ్ కార్యక్రమంలో ప్రేక్షకుల నుంచి వచ్చిన ఫోన్ కాల్స్ ద్వారా ప్రశ్నలు రాగా విద్యార్థులు సమర్థవంతంగా, ధైర్యంగా సమాధానాలు చెప్పారని అన్నారు. అంతర్జాతీయ భాషలపై పట్టు సాధించడం ద్వారా విద్యార్థులు గ్లోబల్ స్థాయిలో మంచి అవకాశాలను పొందగలరని ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి పాలిగ్లాట్ ఉపాధ్యాయుడు పూలబాల వెంకటేశ్వర్లు మార్గదర్శకత్వం వహించారనని చెప్పారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన అభినందన సభలో స్కూల్ డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. బర్నబాస్, క్యాంపస్ ఇన్‌చార్జ్ కోట బాపూజీ, విద్యార్థిని విద్యార్థులు, పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొని విద్యార్థులను అభినందించారు.

పోలీసుల అదుపులో పేకాటరాయుళ్లు

చిలకలూరిపేట, ఏప్రిల్ 22, ప్రభాతవార్త: బొప్పూడి గ్రామ చెంచు కాలనీలో కోతముక్క పేకాటాడుతున్న ఏడుగురిని చిలకలూరిపేట రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీస్ స్టేషన్ ఎస్ఐ జి. అనిల్ కుమార్ సిబ్బంది సహాయంతో పట్టుకొని నిందితుల నుండి రూ.31,500,52 పేక ముక్కలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

ఉపాధ్యాయురాలు చదలవాడ శ్రీదేవి విద్యా సేవలు ఎనలేనివి

గుంటూరు విద్య ఏప్రిల్ 22 ప్రభాతవార్త : కాసు సాయమ్మ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్లో సైన్స్ టీచర్ గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన చదలవాడ శ్రీదేవి విద్యా సేవలు ఎనలేనివని పొన్నూరు శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, నరసరావుపేట శాసనసభ్యులు అరవింద రావు, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ తదితరులు ప్రశంసల జల్లు కురిపించారు. హైస్కూల్ ప్రాంగణంలో బుధవారం చదలవాడ శ్రీదేవి ఉద్యోగ విరమణ కార్యక్రమం కన్నుల పండుగ జరిగింది. శ్రీ వికాస్ విద్యాసంస్థల అధినేత, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర

కార్యదర్శి, మాజీ గుంటూరు గ్రంథాలయ సంస్థ చైర్మన్ దాసరి రాజా మాస్టారు సతీమణి అయిన చదలవాడ శ్రీదేవి ఉద్యోగ విరమణ కార్యక్రమం కు రాజకీయ రంగం నుంచి నాయకులు ఉపాధ్యాయ రంగం నుంచి ఉపాధ్యాయులు అధికారులు తదితరులు పెద్ద ఎత్తున హాజరై పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపి శాలువాలతో సత్కరించి బహుమతులతో ఆత్మీయ అభినందనలు అందజేశారు. న్ని వృత్తుల్లో కెల్లా ఉపాధ్యాయ వృత్తి అత్యంత బాధ్యతాయుతమైనదని పవిత్రమైనదని 30 సంవత్సరాలకు పైగా శ్రీదేవి ఒక ఉపాధ్యాయురాలుగా ఎంతోమంది విద్యార్థుల విద్యా జీవితాలను తీర్చిదిద్ది వారి భవిష్యత్తుకు పునాదులు వేయటం అభినందనీయమని ఈ సందర్భంగా పలువురు వక్తలు శ్రీదేవి విద్యా సేవలను కొనియాడారు. దాసరి రాజా మాస్టారును చదలవాడ శ్రీదేవి లను ఉమ్మడిగా అందరూ సన్మాన సత్కారంతో ఆత్మీయ అభినందనలు అందజేశారు. కార్యక్రమం ఆశాంతం ఆనందోత్సవాల అభినందనల మధ్య జరిగింది.

వైసీపీ మహిళా విభాగం రాష్ట్రస్థాయి ఆత్మీయ సమావేశం

పాల్గొన్న పల్నాడు జిల్లా వైసీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ సంధిరెడ్డి గీతా హాసంతి

సత్తెనపల్లి, ఏప్రిల్ 22, ప్రభాతవార్త: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్. జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కృష్ణా జిల్లా పెడన నియోజకవర్గంలో



వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా విభాగం ఆత్మీయ సమావేశం ఉప్పాల హారిక ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. ఈ సమావేశంలో పల్నాడు జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ సంధి రెడ్డి గీతా హాసంతిని రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు ఎమ్మెల్సీ వరదు కళ్యాణి, ఉప్పాల హారికను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర స్థాయి మహిళా విభాగం అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

జడ్పీ సమావేశంలో పాల్గొన్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ వందనాదేవి

సత్తెనపల్లి, ఏప్రిల్ 22, ప్రభాతవార్త: గుంటూరు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం గుంటూరులోని జడ్పీ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి జిల్లా పరిషత్ చైర్మన్.



ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులతో కలిసి ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైరపర్సన్ భీమనేని వందనాదేవి హాజరయ్యారు.

కాలుష్యరహిత సమాజాన్ని స్థాపించడం ప్రతిఒక్కరి బాధ్యత

హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్

విజయవాడ కార్పొరేషన్,ఏప్రిల్ 22,(ప్రభాతవార్త) : కాలుష్య రహిత సమాజాన్ని నిర్మించే బాధ్యత ప్రతి ఒక్కరిదని మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం ఉదయం కలరా

హాస్పటల్,చిట్టినగర్,గాంధీహిల్,ఒన్‌టౌన్‌లలో వరల్డ్ ఎర్త్ డే సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం,వారి భాధ్యతగా నిర్వహించాలని, ఆరోగ్యకరమైన శ్వాస పీల్చేందుకు ఆక్సిజన్ ఎంతో అవసరం అయినందున,అది మొక్కల ద్వారా వస్తాయి కాబట్టి ప్రతి ఒక్కరూ మొక్కల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. తాజాగా కార్పొరేషన్ ప్రజలకు ఉచితంగా పూల,పండ్ల మొక్కలను పంపిణీ చేసి,పర్యావరణం కోసం ప్రజల్లో మొక్కల పట్ల భాధ్యత కల్పించేందుకు కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. మరోవైపు నగరంలో డివైడర్ల పైన,రోడ్లకు ఇరువైపులా,పార్కుల్లో,జనసాంద్రత ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో వర్టికల్‌గార్డెన్స్ వంటి కార్యక్రమాలు చేపట్టి కాలుష్యాన్ని తగ్గించే విధంగా చర్యలు తీసుకుంటుందన్నారు. నగరపాలక సంస్థతో కలిసి వన్ ఎర్త్ వన్ లైఫ్ వారు చేపట్టిన ఈ కార్యక్రమం అభినందనీయమన్నారు. మొక్కలు మన జీవానికి ప్రాణాధారం అని,ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్క నాటి దాన్ని సంరక్షిస్తే,పచ్చదనం పెరిగి ఆరోగ్యకరమైన నగరం,సుస్థిరమైన భవిష్యత్తు సాధ్యమవుతుందన్నారు.వన్ ఎర్త్-వన్ లైఫ్ ఫౌండర్,అడ్మిన్ ఏలూరి లీలాకుమారి మాట్లాడుతూ,తల్లి తన శిశువును తొమ్మిది నెలలు మోస్తే,ఈ భూమి సమస్త జీవజాతిని జీవితాంతం మోస్తోందని,అందుకే ఈ పవిత్ర భూమిని కాపాడుకుందాం,పరిరక్షిద్దాం,భావితరాలకు అందంగా అందించుదామని పిలుపునిచ్చారు. చిట్టినగర్ లోని రాకేష్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీని నిర్వహించారు. ర్యాలీ ద్వారా పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం కల్పించారు. ర్యాలీ అనంతరం నిర్వాహకులు ప్లాస్టిక్ బ్యాన్‌పై అవగాహన కల్పించి, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే దిశగా క్లాత్ బ్యాగ్స్ పంపిణీ చేశారు. ఉచితంగా మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎకో ఫ్రెండ్లీ కాటన్ సంస్థకు చెందిన కృష్ణప్రసాద్,మద్దిరాల కమలాకరరావు,హారతి,వసంత,జగదీష్,తూనుగుంట్ల శేఖర్,వెంకటేష్,గాంధీ హిల్ ఫౌండేషన్ మేనేజర్ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకం పేరుతో గంగ పుత్రుల పొట్ట కొడతారా?

-35 మత్స్యకార కుటుంబాలకు నోటీసులివ్వడం దుర్మార్గం -బడా బాబుల విలాసాల కోసం పేదల ఇళ్లు కూల్చడమేనా అభివృద్ధి?

బాపట్ల, ఏప్రిల్ 22, ప్రభాతవార్త ప్రతినిధి: పర్యాటక రంగం అభివృద్ధి ముసుగులో ఏళ్ల తరబడి నివాసముంటున్న మత్స్యకారుల పొట్టకొట్టాలని చూడటం ప్రభుత్వ దౌష్ట్యానికి పరాకాష్ట అని సీపీఎం జిల్లా కార్యదర్శి



సి.హెచ్. గంగయ్య మండిపడ్డారు. బాపట్ల మండలం అడవి పంచాయతీ పరిధిలోని సూర్యలంక తీరంలో నివసిస్తున్న 35 మత్స్యకార కుటుంబాలకు రెవెన్యూ అధికారులు ఖాళీ చేయాలని నోటీసులు ఇవ్వడంపై బుధవారం బాధితులు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా గంగయ్య మాట్లాడుతూ సముద్రపు వేటనే నమ్ముకుని, చిన్నపాటి వ్యాపారాలు చేసుకుంటూ బతుకుతున్న పేదల ఇళ్లను తొలగించి, ఆ భూములను కార్పొరేట్ శక్తులకు, బడా రాజకీయ నాయకులకు ధారాదత్తం చేయాలని అధికారులు చూస్తున్నారన్నారు. పర్యాటకానికి కావాల్సిన 27 ఎకరాల భూమిని ప్రభుత్వం ఇప్పటికే సేకరించింది. మరి వక్కనే ఉన్న ఈ రెండు సెంట్ల పేదల ఇళ్లను ఎందుకు ఖాళీ చేయిస్తున్నారు.ధనవంతుల విలాసాలకు పేదల ఇళ్లు అడ్డని భావిస్తున్నారా అని అన్నారు.గతంలో ఓ రాజకీయ నాయకుడి కోసం సముద్ర తీరాన రెండెకరాల భూమిని కేటాయించిన అధికారులు, నిరుపేద మత్స్యకారులకు మాత్రం పట్టాలు ఇవ్వకుండా వేధిస్తున్నారని విమర్శించారు. అధికారుల ఒత్తిడితో గంగపుత్రులు రోడ్డున పడాల్సి వస్తోందన్నారు.అనంతరం డిప్యూటీ తహసీల్దార్ పి. భవానికి బాధితులు తమ వినతి పత్రాలను అందజేశారు. తాము ఎక్కడికి వెళ్లలేమని, తమకు ఉన్న చోటే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు శరత్, కిరణ్ మరియు బాధితులు అమీన్ బాబు, గోపి, ప్రేమ్, లక్ష్మి, స్వాతి, మొగధారమ్మ, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల సౌకర్యార్థం రెండు సర్వీసులు ప్రారంభం

ఒంగోలు-తెనాలి రూట్‌లో రాకపోకలు

బాపట్ల.ఏప్రిల్ 22: ప్రభాతవార్త ప్రతినిధి; బాపట్ల జిల్లా ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ ఆదేశాల మేరకు, ఈడీ జోన్3 (నెల్లూరు) పరిధిలో ఒంగోలు నుంచి తెనాలి వరకు రెండు కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులను బుధవారం ప్రారంభించారు. ఈ మేరకు జిల్లా ప్రజా రవాణా అధికారిణి (డీపీటీఓ) సి.హెచ్. విమల ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూఈ కొత్త సర్వీసులు ఒంగోలు, చీరాల, బాపట్ల, చెరుకుపల్లి మీదుగా తెనాలి వరకు నడుస్తాయని ఆమె పేర్కొన్నారు. ఒంగోలు మరియు తెనాలి డిపోల నుంచి చెరో బస్సును కేటాయించినట్లు తెలిపారు.తెనాలి నుంచి: ప్రతిరోజూ ఉదయం 6:00 గంటలకు, మధ్యాహ్నం 2:00 గంటలకు ఒంగోలు వైపు బయలుదేరుతాయన్నారు.ఒంగోలు నుంచి ప్రతిరోజూ ఉదయం 10:00 గంటలకు, సాయంత్రం 6:00 గంటలకు తెనాలి వైపు బయలుదేరుతాయన్నారు.జిల్లాలోని బాపట్ల, చీరాల ప్రాంత ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ ఎక్స్‌ప్రెస్ సర్వీసులను అందుబాటులోకి తెచ్చాం. ప్రయాణికులందరూ ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

వికాస్ డిగ్రీ కాలేజీలో పాలిటెక్నిక్ మోడల్ ఎంట్రన్స్ పరీక్ష

మాచర్ల, ఏప్రిల్ 22 ప్రభాతవార్త: స్థానిక వికాస్ డిగ్రీ కాలేజీలో నియోజకవర్గ స్థాయి పాలిటెక్నిక్ మోడల్ ఎంట్రన్స్ పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షకు 170 మంది విద్యార్థులు హాజరయ్యారు. సీహెచ్ వరుణ్ 93 మార్కులతో ప్రథమస్థానాన్ని సాధించాడు. విద్యార్థికి స్థానిక న్యూటన్స్ ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ జున్నా శ్రీనివాసరెడ్డి ప్రకటించిన రూ.8116 నగదు బహుమతిని కళాశాల వైస్ ప్రిన్సిపల్ నరసింహారావు, లక్ష్మయ్య చేతుల మీదుగా అందజేశారు. జె.చరణ్‌తేజ 87 మార్కులతో ద్వితీయస్థానాన్ని సాధించాడు. బహుమతిగా రూ.5116 నగదు బహుమతిని వికాష్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ తరపున వై.కొండయ్య అందజేశారు. 85 మార్కులతో తృతయస్థానాన్ని సాధించిన పి.మహేంద్రకు శ్రీవిష్ణు జూనియర్ కళాశాల తరఫున రూ.3116 నగదు బహుమతిని కళాశాల డైరెక్టర్ మనోజ్ చేతుల మీదుగా బహూకరించారు. ఈ సందర్భంగా పలనాడు, ప్రతిభ జూనియర్ కళాశాలల సెక్రటరీ, కరస్పాండెంట్ పఠాన్ నాగూర్‌వలి మాట్లాడుతూ మొదటిసారిగా పరీక్షకు హాజరైన విద్యార్థులు, మంచి లక్ష్యాన్ని ఏర్పరచుకొని, తల్లిదండ్రుల, గురువుల ఆశలకు అనుగుణంగా ఎదగాలని

పిలుపునిచ్చారు. మంచి క్రమశిక్షణతో సమాజంలో అందరూ గౌరవించే విధంగా ఎదగాలని గణిత అధ్యాపకులు, మోటివేటివ్ ఎంబీఎస్ కోటేశ్వరరావు అన్నారు. కార్యక్రమంలో కోచింగ్ సెంటర్ నిర్వాహకులు మల్లికార్జునరావు, కిషోర్, శ్రీనివాసరావు, మర్రి వెంకట నారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో రూ.1.80 లక్షల ఆస్తినష్టం

రేపల్లె, ఏప్రిల్ 22, ప్రభాతవార్త: మండలంలోని గుడ్డికాయలంక గ్రామంలో బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో పేరం ఆదిశేషారావుకు చెందిన పూరిల్లు దగ్ధమై రూ.లక్షా 80 వేల ఆస్తి నష్టం సంభవించిందని రేపల్లె అగ్నిమాపక

శాఖ అధికారి యార్లగడ్డ వెంకటేశ్వరరావు తెలిపారు.విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగిందని చెప్పారు.ప్రమాదంలో పూరింటితో పాటు గృహోపకరణాలు దగ్ధమయ్యాయని గ్రామంలో ప్రమాదం విస్తరించకుండా మంటలను అదుపు చేసినట్లు వెంకటేశ్వరరావు వివరించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం..

అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన ఆదిశేషారావు కుటుంబానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త పీటా నాగమోహన్‌కృష్ణ

సూచన ప్రకారం ఆయన తండ్రి పీటా భాస్కరరావు ఆర్థిక సహాయం అందజేశారు.ప్రమాదం పూర్వాపరాలను అడిగి తెలుసుకున్నారు.బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని ఆయన హామీనిచ్చారు.ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెదేపా సాయం..

అగ్నిప్రమాదంలో పేరం ఆదిశేషారావు కుటుంబానికి నష్టం జరిగిన కారణంగా ఆ కుటుంబాన్ని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ రేపల్లె నియోజకవర్గ సీనియర్ నాయకుడు అనగాని శివప్రసాద్ పరామర్శించారు.బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో చెరుకుపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు తాతా ఏడుకొండలు,డిసి యరగళ్ళ శ్రీనివాసరావు,మాజీ ఎంపిటిసి యరగళ్ళ వీరయ్య,కేసన రామకృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అయిల్ ఫామ్ సాగు సాధ్యతపై అవగాహన

యడ్లపాడు, ఏప్రిల్ 22, ప్రభాతవార్త : యడ్లపాడు, చిలకలూరిపేట మండలాల్లో ఆయిల్ పామ్ సాగు సాధ్యత పై అధ్యయనం చేయుట కొరకు యడ్లపాడు రైతు సేవా కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లాలోని కొవ్వూరు ఆయిల్ ఫామ్ ప్రాంతీయ ఉద్యాన పరిశోధన కేంద్రం ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ పి మాధవి లత మాట్లాడుతూ... స్థానిక నీటి వనరులు, నేల రకాల గురించి రైతులను అడిగి నమోదు చేసుకున్నారు. సదరు నివేదికను

ప్రభుత్వానికి పంపించడం జరుగుతుందని తెలియజేశారు. ఆయిల్ పామ్ సాగు కొరకు అవసరమైన నేల రకాలు, నీటి అవసరం, వాతావరణ పరిస్థితులు, యాజమాన్య పద్ధతులు, మార్కెటింగ్ సదుపాయాలపై రైతులకు వివరించడం జరిగింది. చిలకలూరిపేట ఉద్యాన అధికారి శ్రీలక్ష్మి మాట్లాడుతూ.. ప్రభుత్వం ద్వారా ఆయిల్ పామ్ సాగు కొరకు అందిస్తున్న రాయితీల గురించి రైతులకు క్లుప్తంగా వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతులు, వీఏఏలు అనుపమ, బిలాల్, పాల్గొన్నారు.

హెల్మెట్‌కు క్లిప్ పెట్టండి ట్రాఫిక్ పోలీసులు సూచన

విజయవాడ కార్పొరేషన్,ఏప్రిల్ 22,ప్రభాతవార్త : వాహనదారులకు క్లిప్ యువర్ హెల్మెట్ ఫర్ సేఫ్ జర్నీ అనే నినాదంతో హెల్మెట్‌పై ప్రజలకు ట్రాఫిక్ పోలీసులు అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల బారిన పడిన వారిని సత్వరమే స్పందించి

ఆస్పత్రిలో చేర్పించి వారికి పిఎం రాహత్ క్రింద 25వేల బహుమతిని అందిస్తున్నట్లు తెలిపారు.నగరంలో రోడ్డు భద్రతను పెంపొందించ డానికి,రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు సిపి రాజశేఖరబాబు ఆదేశాల మేరకు ట్రాఫిక్ డిసిపి షిరీన్ బేగం,డిసిపి నక్కా సూర్యచంద్రరావు సూచనల మేరకు ట్రాఫిక్ ఎసిపిలు,ట్రాఫిక్ సిఐలు వారి సిబ్బందితో కలిసి నగరంలోని వివిధ ప్రదేశాల్లో భద్రత మైన జర్నీ కోసం హెల్మెట్‌కు క్లిప్ పెట్టండి అనే నినాదంతో వాహనదారులకు మోటారు వాహన చట్టాలపై,హెల్మెట్ ధరించడమే ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ట్రాఫిక్ ఎసిపి రామచంద్రరావు పర్యవేక్షణలో ఒకటవ ట్రాఫిక్ సిఐ ఉమామహేశ్వరరావు వారి సిబ్బందితో కలిసి ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి లోని పిఎస్ఆర్ స్టాట్యూ సమీపంలో వాహనదార లను తనిఖీ చేసి హెల్మెట్,దానికి ఉండే క్లిప్ ఆవశ్యకతను తెలుపుతూ అవగాహన కల్పించారు. అదే విధంగా రోడ్డు ప్రమాదాల బారిన పడిన వారిని సత్వరమే స్పందించి ఆస్పత్రిలో చేర్పించిని వారికి పిఎం రాహత్ క్రింద రూ.25వేలు బహుమతిని అందించడం జరుగుతుందని, గాయపడిన భాధితులకు రూ.లక్షా50 వేల వరకు ఉచితంగా చికిత్స లేదా వారం రోజుల పాటు ఏ ఆస్పత్రిలో నైనా డబ్బులు లేకుండా చికిత్స పొందవచ్చని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెల్మెట్ పెట్టుకుని దానికి సంబంధించిన క్లిప్ పెట్టుకోకపోతే ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు హెల్మెట్ కిందకు జారి పడిపోతుందని, దాని వలన హెల్మెట్ పెట్టుకున్న గాని ప్రమాదాల బారిన పడుతున్నారని ద్విచక్ర వాహనదారులకు కౌన్సిలింగ్‌ను నిర్వహించారు. హెల్మెట్ పెట్టుకుని వామనాలు నడుపుతున్నపుడు మనం హెల్మెట్ క్లిప్‌ను తప్పనిసరిగా బిగించి పూర్తిగా పెట్టుకోవాలని తద్వారా ప్రమాదాల బారిన పడకుండా ఉంటామని, దీని ద్వారా మన కుటుంబాలకు ఎటువంటి శోకం కల్గించకుండా గమ్యస్థానాలకు చేరుతామని తెలిపారు. హెల్మెట్ ధరించకుండా వాహనం నడిపే వారిపై మోటారు వాహనాల చట్టం ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజల భద్రతే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ప్రతి రెండు చక్రాల వాహనదారుడు తన భద్రతతో పాటు తన కుటుంబ సభ్యుల కోసం కూడా హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజల అవసరాలను తీర్చడమే మా ముందున్న కర్తవ్యం

-ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

పొన్నూరు, ఏప్రిల్ 22,ప్రభాతవార్త: పొన్నూరు ప్రాంత ప్రజల అవసరాలను తీర్చడమే మా ముందున్న కర్తవ్యమని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. స్థానిక ఆర్టీసి డిపోలో బుధవారం పొన్నూరు నుండి హైదరాబాదుకు అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ఇంద్ర ఏసి బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర మాట్లాడుతూ ప్రజల అవసరాలను దృష్టిలో

ఉంచుకొని ఈ సర్వీసులను ప్రారంభించామన్నారు. ఈ బస్సుల ద్వారా పొన్నూరు ప్రాంతం నుండి ప్రయాణించేవారికి సౌలభ్యంగా ఉంటుందన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారవేత్తలకు ఈ సేవలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో డిపో అధికారులు, సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

రేపల్లె, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:ప్రతి ఒక్కరూ పౌష్టిక విలువలు కలిగిన ఆహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని రేపల్లె ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం సిడిపివో ఎం.సుచిత్ర తెలిపారు.బుధవారం మండలంలోని మోర్లవారిపాలెం పంచాయతీ శివారు వేజండ్లవారిలంక అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాలలో లభ్యమయ్యే ఆహార పదార్థాలు తీసుకుంటే ఆరోగ్య ప్రమాణాలు దెబ్బతింటాయని చెప్పారు.పోషణ పక్వాడ

కార్యక్రమాల ద్వారా అవగాహన కలిగిస్తున్నామని తెలిపారు.గర్భిణీలు, పాలిచ్చే తల్లులు,చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించాలన్నారు. చిరుధాన్యాలు,బరువు,ఎత్తు పర్యవేక్షణ, అక్షరాభ్యాసం,ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై దృష్టి కేంద్రీకరించాలని వెల్లడించారు.మహిళా శిశు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీల ద్వారా పోషణ పక్వాడ కార్యక్రమాన్ని ప్రజలలోకి తీసుకువెళ్తున్నామన్నారు.6 సంవత్సరాల పిల్లల్లో పోషకాహార లోపాన్ని తగ్గించాలన్నారు.ఆహారంలో చిరుధాన్యాలు చేర్చుకుంటే ఆరోగ్యం లభిస్తుందన్నారు.వయస్సుకు తగిన విధంగా ఎత్తు,బరువు లేని పిల్లలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాల్సి ఉంటుందని సుచిత్ర వివరించారు.ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది,తల్లులు పాల్గొన్నారు.

యడ్లపాడు స్వర్ణ గ్రామం 2కు ఐఎస్ఓ ధృపత్రం మంజూరు

జిల్లాలోనే ప్రథమ ఐఎస్ఓ ధృవపత్రం అందుకున్న యడ్లపాడు స్వర్ణ గ్రామం 2

యడ్లపాడు, ఏప్రిల్ 20, ప్రభాతవార్త : యడ్లపాడు 2 స్వర్ణ గ్రామం కార్యాలయాన్ని ఐఎస్ఓ9001 సర్టిఫికేట్ కొరకు ఆడిట్ నిర్వహించుటకు కేరళకు చెందిన టిక్యూఎస్ సర్ట్ సర్వీస్ సెంటర్ ప్రైవేట్ లిమిటెడ్ నుండి ఎబిన్

జార్జ్ బృంధం గత సోమవారం పరిశీలించటం జరిగింది. యడ్లపాడు 2 స్వర్ణ గ్రామం కార్యాలయానికి విచ్చేసి కార్యాలయ పని తీరును రికార్డ్స్ ను పరిసీలించారు. అనంతరం బుధవారం మండల ఎంపీడివో మరియు గ్రామ ప్రత్యేకాధికారి వి హేమలతా దేవి, మండల డిప్యూటీ ఎంపీడివో నాగిరెడ్డి, గ్రామ పంచాయతి అభివృద్ధి అధికారి బాపిరాజుకు ఐఎస్ఒ9001 ధృవ పత్రాన్ని కేరళ టిక్యూఎస్ సర్ట్ సర్వీస్ సెంటర్ ప్రైవేట్ లిమిటెడ్ ఎబిన్ జార్జ్ అందజేసారు. పల్నాడు జిల్లా వ్యాప్తంగా తొలి ఐఎస్ఒ9001 ధృవ పత్రాన్ని పొందిన గ్రామంగా యడ్లపాడు స్వర్ణగ్రామం 2 నిలుస్తుంది. ఈ కార్యక్రమంలో స్వర్ణ గ్రామం కార్యాలయ సిబ్బంది మరియు గ్రామ పెద్దలు పోపూరి రాఘవయ్య, పోపూరి నాగేశ్వరరావు, గోనుగుంట్ల హరిబాబు తదితరులు హాజరైనారు.

ప్రకృతి వ్యవసాయం పేరుతో రైతులను మోసం

విజయవాడ, ఏప్రిల్ 22, ప్రభాతవార్త : జీరో బడ్జెట్ నాచురల్ ఫార్మింగ్, గోఆధారిత ప్రకృతి వ్యవసాయం, ఎస్‌పికె విధానం పేరుతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వ్యవసాయ నిపుణులు రూపినేని కాంతి ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం విజయవాడ ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ అరకొర వ్యవసాయ అనుభవంతో గత 12 సంవత్సరాలుగా వ్యవసాయంలో ఆధునిక వ్యవసాయంలో వస్తున్న ప్రమాదకరమైన తెగుళ్లను పరిష్కరించడంలో ఎస్‌పికె శిష్యులు విఫలమయ్యారని 20బస్తాల దిగుబడి కూడా దాటడం లేదన్నారు.వ్యవసాయ నిపుణులు

గా చలామణి అవుతున్న విజయరామ్ రైతులను ఆర్థిక లాభాల వైపు నడిపించలేని విధానాలను సూచిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి "తెలుగుదనం" అనే కార్యక్రమం తీసుకురావడం వెనుక పెద్ద రాజకీయ కుట్ర ఉందని ఆరోపించారు. రూపినేని కాంతి రూపొందించిన ఆర్గానిక్ కార్బన్ ఫార్మింగ్ - స్పిన్ కార్యక్రమం ద్వారా రసాయనిక సాగులో పండిన పంటలకు దీటుగా ప్రకృతి సిద్ధంగా దిగుబడులు పొందుతున్న రైతులని చూపిస్తానని, చేతనైతే ఒకే చోట ఎవరో ఒక సాధారణ రసాయనిక సాగు చేసే రైతుని కలుపుకుని ఎస్‌పికెవిధానంలో దిగుబడి ఎంత వస్తుంది, రూపినేని కాంతి రూపొందించిన ప్రకృతి సాగులో దిగుబడి ఎంత వస్తుంది అనేది పోల్చి చూసుకుందాం అని సవాల్ చేశారు.

సంగీత సద్గురు శ్రీ త్యాగబ్రహ్మ 259వ జయంతి మహోత్సవం

గుంటూరు కల్చరల్,ఏప్రిల్ 22,ప్రభాతవార్త : స్థానిక లక్ష్మీపురంలోని గాయత్రీ మహిళా సంగీత సమ్మండలి ప్రధాన కార్యదర్శి ఎం.వై.శేషురాణి ఆధ్వర్యంలో త్యాగరాజస్వామి కళావేదిక,త్యాగరాజమందిరంలో సంగీత సద్గురు శ్రీత్యాగబ్రహ్మ 259వ జయంతి మహోత్సవాలు బుధవారం సాయంత్రం నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శనగల రామ్మోహన్ పాల్గొని ప్రసంగించారు.టి.ఆదిత్యవాణి అతిధులు సంస్థ వారు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాలను ప్రారంభించారు.తొలుత 5.30గంటలకు స్థానిక,స్థానికేతర కళాకారులచే శ్రీత్యాగరాజ విరచిత పంచరత్న కృతుల గోష్టిగానం శ్రావ్యంగా సాగింది.అనంతరం సంగీత సరస్వతి డాక్టర్ తాతా గిరిజా శేషమాంబ శ్రీత్యాగరాజు వాల్మీకి రామాయణం సోదాహరణ ప్రసంగ పూర్వక కచేరీ వీనుల విందుగా జరిగింది.వాల్మీకి రామాయణం లోని అనేక విశేషాలను వివరిస్తూ వినసొంపుగా గానం చేశారు.వీరికి వయోలిన్‌పై దావులూరి శ్రీవిద్య,బెంగళూరు, మృదంగంపై విద్వాన్ ఎ.ఎస్.ఆర్.కౌండిన్య,విశాఖపట్నం వారు చక్కటి వాయిద్యా సహకారాన్ని అందించారు.సంస్థ ఉపాధ్యక్షులు డాక్టర్ రాజరాజేశ్వరీ,పాటిబండ లలిత,మాధవపెద్ది మీనాక్షి,కార్యదర్శి ఏ.వి.మంగాదేవి,కోశాధికారి మాధవపెద్ది విజయలక్ష్మీ,తదితరులు అతిధులను,కళాకారులను ఘనంగా సత్కరించారు.

దేశ ప్రగతికి గ్రామాలే పట్టుకొమ్మలు

మైలవరం, ఏప్రిల్ 22, ప్రభాతవార్త : దేశప్రగతికి గ్రామాలే పట్టుకొమ్మలని గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు అభివృద్ధికి కొలమానంగా నిలిచే చిహ్నాలని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. మైలవరంలోని భవానీ నగర్‌లో రూ.33లక్షల పంచాయతీరాజ్ నిధులతో నిర్మించిన సిమెంట్ రహదారులను ఆయన ప్రారంభించారు. ఆ క్రమంలో ఆయన మాట్లాడుతూ మైలవరం నియోజకవర్గం వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని శాఖల పరిధిలోని రహదారులను అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. మైలవరంలో జనసాంద్రత ఎక్కువగా నివసించే ప్రాంతాల్లో సిసి రోడ్లు నిర్మాణానికి తొలి ప్రాధాన్యత ఇస్తున్నట్లు వెల్లడించారు. ఇబ్బందులు పడ్డారని వారికి ఇచ్చిన హామీ ప్రకారం ఆరు నెలల్లో సిమెంట్ రహదారులను వెంటనే నిర్మిస్తున్న గుత్తేదారు అప్పిరెడ్డిని ఘనంగా సత్కరించి అభినందించారు. పల్లె పండుగ 1,2.0 ఆర్ అండ్ బి శాఖ, పంచాయతీరాజ్, జాతీయ రహదారుల విభాగంతో పాటు అన్ని రోడ్లు నూతన శోభను సంతరించుకుంటున్నాయన్నారు. ఒకపక్క ప్రజా సంక్షేమానికి పెద్ద పీటవేస్తూ చంద్రబాబు నాయుడు అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తున్నారన్నారు. కూటమి పాలనలో దేశంలోనే ఏపి నెంబర్ వన్‌గా నేడు 76ఏళ్ల వయస్సులోను డేటా సెంటర్లు గ్రీన్ ఎనర్జీ క్వాంటం వ్యాలీ అంటూ రేపటి తరం భవిష్యత్తు కోసం నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ అక్కల రామ్మోహనరావు (గాంధీ) తదితరులు పాల్గొన్నారు.

25న పాలిసెట్ పరీక్ష

రేపల్లె,ఏప్రిల్ 22, ప్రభాతవార్త: బాపట్ల జిల్లా పరిధిలోని రేపల్లె, చీరాల,బాపట్ల పట్టణాలలో ఈ నెల 25వ తేదీ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పాలిసెట్ పరీక్ష జరుగుతుందని పాలిసెట్ జిల్లా కో ఆర్డినేటర్,రేపల్లె ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.చంద్రశేఖర్ తెలిపారు.బుధవారం ఆయన మాట్లాడుతూ రేపల్లె ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల,చీరాల మహిళా డిగ్రీ కళాశాల,బాపట్ల పాలిటెక్నిక్ పరీక్షా కేంద్రాలలో జరిగే పాలిసెట్ పరీక్షకు ఉదయం 9 గంటలకే విద్యార్థులు హాజరు కావాలని చెప్పారు.ఎటువంటి సమస్యలు ఉన్నా ఆయా పరీక్షా కేంద్రాల అధికారులను సంప్రదించి పరిష్కరించుకోవాలని చంద్రశేఖర్ సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రేపల్లె, ఏప్రిల్ 22, ప్రభాతవార్త: పట్టణంలోని 33కెవి విద్యుత్ స్టేషన్ పరిధిలో నూతన విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసే పనుల నిమిత్తం గురువారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు రేపల్లె విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.శ్యామ్ సుధాకర్‌బాబు బుధవారం తెలిపారు.మండలంలోని ఉయ్యూరివారిపాలెం,ఉప్పూడి, బేతపూడి,రేపల్లె పట్టణంలోని ఇసుకపల్లి, నిజాంపట్నం రోడ్,మసీద్ సెంటర్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయమేర్పడుతుందని చెప్పారు.విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ప్రారంభమైన శ్రీ బ్రహ్మం గారి ఆరాధన బ్రహ్మోత్సవములు

యడ్లపాడు, ఏప్రిల్ 22, ప్రభాతవార్త : మండల పరిధిలోని బోయపాలెం గ్రామంలో వేంచేసి యున్న శ్రీ గోవిందమాంబ సమేత శ్రీ వీర బ్రహ్మేంద్ర స్వాముల వారి అరాధన బ్రహ్మోత్సవములు బుధవారం ఘనంగా ప్రారంభమైనాయి. అలయ ధర్మకర్త కూనిశెట్టి నాగేశ్వరరావు, అలయ అర్చకులు కనగాల వసంతాచార్యుల పర్యవేక్షణలో తొలిరోజు విఘ్నేశ్వర పూజతో కార్యక్రమాలను ప్రారంభించారు. గురువారం ఉదయం పోలేరమ్మ అమ్మవారి పొంగలి నైవేద్యం తదుపరి సాయంత్రం ప్రణవ పతాక జెండా

ఉత్సవము గ్రామంలో నిర్వహించటం జరుగుతుందని తెలిపారు.

నరసరావుపేటలో దొంగతనం విఫలయత్నం

నరసరావుపేట క్రైమ్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త : పట్టణంలోని ప్రకాష్ నగర్‌కు చెందిన ఎలమర్తి రాంప్రసాద్ కుటుంబం శిరిడి యాత్రకు వెళ్లిన సమయంలో, గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. విలువైన వస్తువుల కోసం వెతికినప్పటికీ ఏమీ దొరకకపోవడంతో దొంగలు వెనుదిరిగారు. విషయం తెలుసుకున్న సిఐ ఫిరోజ్ తన సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించి, క్లూస్ టీమ్‌తో దర్యాప్తు చేస్తున్నారు.

సూర్యలంక తీరంలో సాహస క్రీడల జోరు!

-వారంలోనే అడ్వెంచర్ టూరిజం ప్రారంభం -జిల్లా చరిత్రలోనే తొలిసారి.. కలెక్టర్ వినోద్ కుమార్

బాపట్ల, ఏప్రిల్ 21. ప్రభాతవార్త ప్రతినిధి: బాపట్ల జిల్లా పర్యాటక రంగంలో సరికొత్త అధ్యాయం మొదలుకానుంది. పర్యావరణ నిబంధనలకు లోబడి, జిల్లా చరిత్రలో తొలిసారిగా సముద్ర తీర ప్రాంతాల్లో అడ్వెంచర్ టూరిజం (సాహస క్రీడల) నిర్వహణకు అనుమతులు లభించాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి వెల్లడించారు. బుధవారం కలెక్టరేట్‌లో

ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పర్యాటక రంగ అభివృద్ధి ప్రణాళికలను వివరించారు.

వారంలోనే శ్రీకారం..

సూర్యలంక బీచ్‌లో సాహస క్రీడలను వారం రోజుల్లోనే ప్రారంభిస్తామని కలెక్టర్ ప్రకటించారు. జీవో నంబర్ 50 ప్రకారం పర్యాటక శాఖ నిర్దేశించిన 126 పేజీల విధివిధానాలను పక్కాగా అమలు చేస్తామన్నారు. రాష్ట్ర స్థాయి కమిటీ నుంచి ఇప్పటికే ఎన్ఓసీ లభించిందని, సేఫ్టీ ఆడిట్ అనంతరం పర్యాటక శాఖ డివిజనల్ మేనేజర్ లిఖితపూర్వక అనుమతులు ఇచ్చారని తెలిపారు. పర్యాటకుల రక్షణ కోసం 13 మంది అధికారులతో కూడిన ఖిజిల్లా టూరిజం కౌన్సిల్‌ఖి నిరంతరం పర్యవేక్షిస్తుందని స్పష్టం చేశారు. ఇప్పటికే చీరాల, రామాపురంలో ఇద్దరు ఆపరేటర్లు క్రీడలను ప్రారంభించగా, మిగిలిన వారు సూర్యలంకలో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

మత్స్యకారులకు ఇబ్బంది లేదు..

అడ్వెంచర్ స్పోర్ట్స్ వల్ల మత్స్యకారుల వేటకు ఎలాంటి ఆటంకం కలగదని కలెక్టర్ భరోసా ఇచ్చారు. కేవలం 200 మీటర్ల పరిధిలోనే ఈ క్రీడలు ఉంటాయి. ఇసుక దిబ్బలు, చెట్లు, మత్స్యకారుల బోట్లను తొలగించబోం. నిబంధనల ప్రకారం సీఆర్జెడ్ పరిధిలో అక్రమణలు అరికడతాం" అని పేర్కొన్నారు. భద్రత విషయంలో రాజీ పడేది లేదని, లైఫ్ జాకెట్లు లేకుండా ఎవరినీ అనుమతించబోమని, ప్రాథమిక వైద్య శిబిరాలు, రిస్క్యూ టీంలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. తీరంలో గంజాయి వంటి మాదకద్రవ్యాల వినియోగంపై ఉక్కుపాదం మోపుతామన్నారు.

ప్లాస్టిక్ రహిత తీరం..

సూర్యలంక, వాడరేవు బీచ్‌లను పర్యావరణహితంగా మార్చేందుకు జూన్ 1 నుంచి ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధిస్తున్నట్లు కలెక్టర్ ప్రకటించారు. చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేపడతామన్నారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా పొదుపు సంఘాల మహిళలతో జనపనార సంచులను తయారు చేయించి, వాటిని బీచ్ వద్ద అందుబాటులో ఉంచుతామని, దీనివల్ల మహిళలకు ఉపాధి లభిస్తుందన్నారు. పర్యాటకుల సౌకర్యార్థం సచివాలయ సిబ్బందిని ఖిబీచ్ సూపర్ వైజర్లుఖిగా నియమించినట్లు తెలిపారు. ప్యారలి కెనాల్‌లో హౌస్ బోట్లకు అనుమతులు రాగానే బోటింగ్ ప్రారంభిస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి అలీ ఆస్గర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

65లక్షల నిధులతో నిర్మించిన వేల్పూరు రోడ్డు ప్రారంభం

కంకిపాడు ఏప్రిల్22,ప్రభాతవార్త : స్వాతంత్ర్యం వచ్చిన ఇంత వరకు నిర్మించిన రోడ్లను నిర్మించడం గర్వంగా ఉందని పెనమలూరు ఎమ్మెల్యే బోడేప్రసాద్ అన్నారు. కృష్ణాజిల్లా పెనమలూరు నియోజక లో హాస్పిటల్‌కి తీసుకువెళ్ళాలన్నా సౌకర్యాలు లేవని చిన్న వంతెనద్వారా వెళ్ళాల్సిన పరిస్థితి ఉందని ఈ రోడ్డు నిర్మాణం చేపట్టడం వలన 10నిమిషాల్లో పోరంకిలో ఉన్న ఆసుపత్రికి చేరుకోవచ్చని తెలిపారు.

వర్గం కంకిపాడు మండలంలోని గంగూరు సరిహద్దు నుంచి వేల్పూరు లక్షీపురం వరకు ఎన్ఆర్జీఎస్ నిధులు 65లక్షలుతో నూతనంగా నిర్మించిన రోడ్డుని బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంవత్సరాలు గడచిన ప్రభుత్వాలు మారిన గ్రామాలకు కనెక్టివిటీ రోడ్లను నిర్మించలేదని కూటమి ప్రభుత్వానికే సాధ్యపడిందని తెలిపారు. వేల్పూరు గ్రామంలో ఎమర్జెన్సీలో అంబులెన్స్ అక్షల రూపాయలతో నిర్మించిన రోడ్డుపై రైతులు దమ్ముచక్రాలకు బద్దీలను నిర్మించి రోడ్లపై వెళ్ళేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోయా ఆనంద ప్రసాద్, నెరుసు రాజ్యలక్ష్మి, టి.హరి కృష్ణ, ధనయ్య, చీలి అజయ్, సంగెపు రంగారావు, అబ్దుల్ ప్యారీలతీఫ్, చలసాని వెంకటేశ్వరరావు, యెలుకుల విజేంద్ర, జడ వెంకటేశ్వరరావు, పందుల రజని కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జేసిఐ కృష్ణవేణి ఆధ్వర్యంలో వాటర్ బాటిల్స్ పంపిణీ

పెనమలూరు,ఏప్రిల్22,ప్రభాతవార్త : జేసిఐ విజయవాడ కృష్ణవేణి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నేషనల్ ప్రెసిడెంట్ విజిట్ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి నేషనల్ ప్రెసిడెంట్ ఆర్‌పిపి భరత్‌ఎన్ ఆచార్య ముఖ్యఅతిథిగా విచ్చేసి సేవా కార్యక్రమాన్ని ప్రారంభించారు. జేసిఐ

విజయవాడ కృష్ణవేణి సభ్యులు ఒక ప్రత్యేక సామామజిక సేవా కార్యక్రమం వీధి వ్యాపారులకు స్టీల్ వాటర్‌బాటిల్స్ పంపిణీ చేసి ప్లాస్టిక్ బాటిల్స్ వినియోగం వల్ల కలిగే అనారోగ్య సమస్యలు, క్యాన్సర్ ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్‌బాటిల్స్ స్థానంలో స్టీల్ బాటిల్స్ అందించడం ద్దారా ఆరోగ్యకరమైన పర్యావరణానికి అనుకూలమైన జీవన విధానాన్ని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో జోన్ ప్రెసిడెంట్ జేసిఐ సెనేటర్ ప్రమోద్ కుమార్ కామిశెట్టి, జోన్ వైస్ ప్రెసిడెంట్ జేఎఫ్‌డి రాజేష్ చెక్కా, టూర్ కో ఆర్డినేటర్ జేఎఫ్‌డి జిఎస్ఆర్ అరవింద్ పాల్గొన్నారు. జేసిఐ విజయవాడ కృష్ణవేణి ఛాప్టర్ ప్రెడిడెంట్ జేఎఫ్‌ఎమ్ ధాత్రికదం, ట్రెజరర్ ఎస్.కె.మన్సూర్, ఎల్ఓ అడ్వైజర్ జేసి కదం కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రాజమ్మ వారి 71వ ఉర్సు మహోత్సవానికి డాక్టర్ ఖలీల్‌బాబుకు ఆహ్వానం

ఎ కొండూరు, ఏప్రిల్ 22, ప్రభాతవార్త : హజరత్ ఖాదర్ వలీబాబా (విజయనగరం) వారి ప్రియశిష్యులు హజరత్ బాబా ఫరీద్ మస్తాన్ ఔలియా (కరిగ్రహారం మచిలీపట్నం) మహాత్ముల వారి మాతృమూర్తి రాజమ్మ వారి 71వ ఉర్సు మహోత్సవానికి అలుపెరుగని అన్నదాత నకీబుల్ ఔలియా హజరత్ అతావుల్లా షరీఫ్ షాతాజ్ ఖాదరీ బాబా వారి తనయుడు విజయనగరం హజరత్ ఖాదర్ వలీబాబా దర్గా ముతవల్లి (ధర్మకర్త) డాక్టర్ ఎండి ఖలీల్ బాబుకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని దర్గా కమిటీ అధ్యక్షులు ఎడ్ల దుర్గాప్రసాద్, కమిటీ సభ్యులు బుధవారం డాక్టర్ ఖలీల్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు, ప్రజలకు విలువైన సేవలందించిన నాదెండ్ల భాస్కరరావు : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, ఏప్రిల్ 22, ప్రభాతవార్త: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ సీఎం నాదెండ్ల భాస్కరరావు అనారోగ్యంతో మరణించడం మిక్కిలి బాధాకరమని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సంతాపం తెలియజేశారు. నాదెండ్ల భాస్కరరావు మృతిపట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాని, ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి అని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వంలో భాస్కరరావు అనేక కీలక పదవులు చేపట్టారని, ఎమ్మెల్యేగా, ఎంపీగా, మంత్రిగా , ముఖ్యమంత్రిగా ఆయన ప్రజలకు, రాష్ట్రానికి విలువైన సేవలు అందించారన్నారు. భాస్కరరావు రాజకీయ వారసుడిగా సోదరుడు నాదెండ్ల మనోహర్ రాజకీయ ప్రస్థానం ప్రారంభించారని, ప్రస్తుతం ఏపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న మనోహర్ ఉమ్మడి ఏపీ రాజకీయాల్లోనూ తనదైన ముద్ర వేశారన్నారు. తండ్రికి తగ్గ వారసుడిగా మనోహర్ ఆయన తండ్రి పేరుప్రతిష్ఠల్ని నిలబెట్టాలని ప్రత్తిపాటి పేర్కొన్నారు.

ఇల్లు దగ్ధం

- రూ.4.50లక్షల నగదు బంగారం వెండి నగలు దగ్ధం

ఎ కొండూరు, ఏప్రిల్ 22, ప్రభాతవార్త : ఎన్‌టిఆర్ జిల్లా ఎ కొండూరు మండలం ఎ కొండూరు తండా గ్రామంలో భూక్యా గోపి అనే గిరిజన వ్యక్తి ఇంట్లో వంట గ్యాస్ సిలెండర్ లీకయ్యి ఇల్లు పూర్తిగా దగ్ధమవ్వగా, బాధితుడు గోపి తన ఇంట్లో పెళ్లి శుభకార్యం కోసం బీరువాలో పెట్టిన రూ.4.50 నగదుతో పాటు బంగారం నగలు కాలిబూడిదైనట్లు బాధిత గిరిజనుడు భూక్యా గోపి, ఆయన కుటుంబం కన్నీరు మున్నీరుగా విలపిస్తూ

ఆవేదన వ్యక్తం చేశారు. విసన్నపేట ఫైర్ ఆఫీసర్ సిబ్బంది హుటాహుటిన ప్రమాధ స్థలానికి వెళ్లి మంటలను అదుపులోకి తెచ్చారు.

గోపాలపురం అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా పోషణ్ పక్వాడ

ఎ కొండూరు, ఏప్రిల్ 22, ప్రభాతవార్త : ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని ఎ కొండూరు మండలం గోపాలపురం

అంగన్‌వాడీ కేంద్రం 136లో విజయవాడ వాహిని చారిటబుల్ ట్రస్ట్ రమేష్ ఆధ్వర్యంలో సిడిపివో కృష్ణకుమారి, సూపర్‌వైజర్ భవానీల ఆదేశాల మేరకు కార్యకర్తలు వి.సుష్మ ఎం.రాజేశ్వరి'లు బుధవారం పోషన్ పక్వాడ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీస్త్రీలు, బాలింతలకు పోషకాహారం తల్లుల రక్షణ తీసుకోవాల్సిన తదితర జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 23మంది అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని సహకరించిన విజయవాహిని చారిటబుల్ ట్రస్ట్ రమేష్‌ను మండల ప్రాంత ప్రజలు ప్రశంసించారు. అంగన్‌వాడీ కేంద్రాల ఆయాలు వైద్య ఆరోగ్యశాఖ ఎఎన్ఎంలు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వేసవి తీవ్రతపై అప్రమత్తంగా ఉండాలి

రేపల్లె, ఏప్రిల్ 22, ప్రభాతవార్త: వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి ప్రియాంక చెప్పారు. బుధవారం మండలంలోని దావులూరులో వైద్యాధికారులు సంచార చికిత్స కార్యక్రమాన్ని నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఆరోగ్యం పట్ల తగిన సలహాలు, సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ప్రియాంక మాట్లాడుతూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్న దృష్ట్యా ప్రతి వ్యక్తి నీటిని



ఎక్కువగా తీసుకోవాలని చెప్పారు. ఎట్టి పరిస్థితుల లో నిల్వ ఉన్న ఆహార పదార్థాలను తీసుకోవద్దని సూచించారు. తల తిరటం, వాంతులు వంటి సమస్యలు ఏర్పడితే సత్వరమే వైద్యాధి కారులను సంప్రదించి తగినటువంటి చికిత్స పొందాలని తెలిపారు. ఆరోగ్య సూత్రాలను గర్భిణీలు పాటించాలన్నారు. వీరు ప్రతి నెలా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. వేసవిలో జాగ్రత్తగా ఉండాలని ప్రియాంక చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి సుజీకుమారి, డిఇవో బొమ్ము కోటిరెడ్డి, ఎఎన్ఎం దీప్తి, ఆశా కార్యకర్తలు స్వరూపరాణి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌ప్రూఫింగ్‌లో సూపర్ స్టార్ ఏషియన్ పెయింట్స్ డ్యాంప్ ప్రూఫ్

విజయవాడ, ఏప్రిల్ 22, ప్రభాతవార్త : ఇళ్లను లీకేజీ, వేసవి వేడి నుంచి కాపాడటమే లక్ష్యంగా తమ వాటర్‌ప్రూఫింగ్ ఉత్పత్తి డ్యాంప్ ప్రూఫ్‌ను తమ అగ్రశ్రేణి వాటర్‌ప్రూఫింగ్ రంగంలో సూపర్‌స్టార్‌గా ఈ ప్రచారంలో అభివర్ణిస్తు రౌడీ బేబీ ట్యూన్‌తో సరికొత్త ప్రచారం ప్రారంభించామని ఏషియన్ పెయింట్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సీఈఓ అమిత్ సింగ్లే తెలిపారు. సినిమా సంగీతాన్ని మేళవించి, ఇంటి రక్షణను సరళంగా, అందరికీ అర్థమయ్యే రీతిలో ఈ క్యాంపెయిన్ ప్రదర్శిస్తోందన్నారు.

గుంటూరు నగర అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు

కమిషనర్ మయూర్ అశోక్

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 22, (ప్రభాతవార్త) : గుంటూరు నగరాన్ని సుస్థిర, ఆధునికంగా అభివృద్ధి చేసేందుకు, ప్రజలకు అనుకూలమైన నగరంగా రూపుదిద్దే దిశగా ఒక కీలక ముందడుగు వేస్తున్నామని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. బుధవారం నగర



పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్ లో శ్రీవత్స కన్సల్టెంట్స్ సిఈఓ, ఉదార్ ఫౌండేషన్ ఛైర్మన్ కిరణ్ భమిడిపాటి కలిసి గుంటూరు నగరం అర్బన్ రిజువనేషన్ మాస్టర్ ప్లాన్ పై విపులంగా మ్యాప్ ద్వారా వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో రోజురోజుకి పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలు, పబ్లిక్ స్పేస్‌ల కొరత, పర్యావరణ సవాళ్లను అధిగమించడానికి అర్బన్ రిజువనేషన్ మాస్టర్ ప్లాన్ వంటివి దోహదపడతాయన్నారు. ఈ ప్లాన్ కేవలం భూ వినియోగానికే పరిమితం కాకుండా ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, నీటి వనరుల సంరక్షణ, ఆర్థిక కార్యకలాపాల పెంపు, నగర గుర్తింపుని మెరుగుపరిచేలా ఉంటుందన్నారు. నగరాన్ని సోషియల్, ఫిజికల్, ఎకానమీ, కల్చరల్ అంశాల సమన్వయంతో అభివృద్ధి చేయడం ద్వారా వచ్చే 5 నుండి 10 సంవత్సరాలలో స్పష్టమైన మార్పు తీసుకురావచ్చని తెలిపారు. శ్రీవత్స కన్సల్టెంట్స్ ఈ ప్రణాళిక ద్వారా గుంటూరు నగరానికి అవసరమైన సమగ్ర డయాగ్నస్టిక్ స్టడీ, ప్రాజెక్టుల గుర్తింపు, ఆర్థిక వ్యూహం, అమలు రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారని, త్వరలో రిక్వస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్ఎఫ్పీ) చేస్తామని తెలిపారు.

మహిళలను ఆర్థిక శక్తిగా మారుస్తాం

శిక్షణ పూర్తి చేసున్న వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేసిన ఎమ్మెల్యే నసీర్

గుంటూరు,ఏప్రిల్ 22,ప్రభాతవార్త : సమాజంలో మహిళలు ఇంటి బాధ్యత, పిల్లల సంరక్షణ, కుటుంబ సంక్షేమాన్ని సరిదిద్దుకుంటూనే స్వయం ఉపాధి వైపు అడుగులు వేయడం అభినందనీయమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ ఛైర్మన్ నసీర్ అన్నారు. స్థానిక అంజుమన్ ఇస్లామియా పాఠశాలలో అంజుమన్ ఇస్లామియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లో 90 రోజులపాటు కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న 37 మంది మహిళలకు బుధవారం సర్టిఫికెట్ల ప్రదానోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ కుట్టు శిక్షణ మహిళల పట్టుదల, సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం పెంపొదిస్తుందని చెప్పారు. స్కిల్ డెవలప్ మెంట్ ఇచ్చిన ఈ అవకాశం, మహిళల జీవితాన్ని మార్చే శక్తిగా మారుతుందని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్ మెంట్ ద్వారా ఎందరో మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటుగా నిలుస్తున్నారని చెప్పారు. మహిళ ఒక అడుగు ముందుకు వేస్తే, కుటుంబం ముందుకు సాగుతుందని తెలిపారు. కుటుంబం ముందుకు వెళితే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ రోజు మహిళలు పొందిన సర్టిఫికెట్ కేవలం ఒక కాగితం కాదని, వారికి కృషికి గుర్తింపు అని చెప్పారు. గుంటూరు తూర్పు

నియోజకవర్గంలో ప్రతి మహిళా ఆర్థిక శక్తిగా ఎదిగేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అంజుమన్ ఇస్లామియా ఆధ్వర్యంలో మరికొంత మహిళలు ఉచిత కుట్టుశిక్షణ పొందుతున్నారని చెప్పారు. ఇప్పటికే జాబ్ మేళా ద్వారా ఎందరో నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపామని, ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేయడమే లక్ష్యంగా పని ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాల్సిందే : ఎస్ఐ ప్రసాద్

కొల్లిపర, ఏప్రిల్ 22, ప్రభాతవార్త: కొల్లిపర మండలంలో ద్విచక్ర వాహనాలు నడిపేవారు విధిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ ఎన్‌సి ప్రసాద్ ఆదేశించారు. బుధవారం మండలంలోని కొల్లిపర, తూములూరు, మున్నంగి గ్రామాలలో వాహనాల తనిఖీ కార్యక్రమం చేపట్టారు. వాహనాల ఆర్సీ బుక్, ఇన్సూరెన్స్, లైసెన్సులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఎన్‌సి ప్రసాద్ మాట్లాడుతూ రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకోవాలని స్పష్టం చేశారు. మద్యం సేవించి వాహనాలను నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ద్విచక్ర వాహనాలు, ఇతర రకాల వాహనాలను మైనర్లు నడిపితే వాహనాల యజమానులతో పాటు తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని వెల్లడించారు. ఎటువంటి వాహనం నడపాలన్నా విధిగా లైసెన్స్ కలిగి ఉండాలని చెప్పారు. వాహనాల విషయంలో నిబంధనల ప్రకారమే వ్యవహరిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బలహీనవర్గాల ఐక్యతే సమాజానికి శక్తి మన్నవ ప్రభాకర్

తెనాలి ఏప్రిల్22(ప్రభాతవార్త): బడుగు బలహీనవర్గాలు సంతోషంగా ఐక్యతగా ఉంటే సమాజం పురోగతికి తోడ్పడుతుందని అంబేద్కర్ సేవా ట్రస్ట్ వర్కింగ్ ప్రెసిడెంట్ ..మన్నవ ప్రభాకర్.. అన్నారు. స్థానిక అంబేద్కర్ సేవ ట్రస్ట్ విస్తరణలో భాగంగా మన్నవ ప్రభాకర్ వర్కింగ్ ప్రెసిడెంట్ గానూ రెండోవైస్ ప్రెసిడెంట్ దేవరపల్లి భూషణం ఎంపిక జరిగింది, నూతనంగా నియమించబడిన సందర్భంగాసంస్థ అధ్యక్షులు డాక్టర్ కనపర్తి అబ్రహం లింకన్ వారిని అభినందించడం జరిగింది, ప్రధాన కార్యదర్శి ..దుబా సందీప్.. అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ ముఖ్య సలహాదారులు ..ప్రొఫెసర్ గుజ్జర్లమూడి కృపాచారి.. పర్యవేక్షణలో ఈ ఎన్నిక జరిగింది, ఈ కార్యక్రమానికి పెద్దలు బేతలు భూషణం , కాకి దేవసహాయం , ఇంకా ఎగ్జిక్యూటివ్స్ అందరూ పాల్గొనడం జరిగింది, ఈ కార్యక్రమంలో కోశాధికారి పాముల దాసు, వైస్ ప్రెసిడెంట్ జమ్మల రమేష్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు ,బండికల్ల సతీష్ వందన సమర్పణ తో కార్యక్రమం ముగిసింది.

మలేరియా దినోత్సవ అవగాహన ర్యాలీ బ్యానర్ ఆవిష్కరణ

తెనాలి మున్సిపాలిటీ,ఏప్రిల్22,(ప్రభాతవార్త): ఏప్రిల్ 25 వ తేదీన జరుగనున్న ప్రపంచ మలేరియా దినోత్సవ అవగాహన ర్యాలీ బ్యానర్ ను స్థానిక

మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమీషనర్ జాగారపు రామఅప్పలనాయుడు ఆవిష్కరించగా, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ జాస్తి రామారావు , మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మొవ్వ ఏసుబాబు గోడప్రతులు , కరపత్రములను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఈనెల 25వ తేదీ జరగనున్న ప్రపంచ మలేరియా దినోత్సవ అవగాహన ర్యాలీనీ తెనాలి పట్టణంలోని పాత ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణం నుండి ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రపంచ మలేరియా దినోత్సవం 2008 నుంచి ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా జరుగుతుందని దీని యొక్క ముఖ్య ఉద్దేశ్యం మలేరియా పట్ల ప్రజలలో అవగాహన మరియు మలేరియా నిర్మూలన అని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీకంఠ ఉమాకాంత్ , పట్టణ ఆరోగ్యవిస్తరణాధికారి అందె బాలచంద్రమోళి , మలేరియా సూపర్వైజర్ దీపాల శ్రీనివాసరావు, మైలా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలను గౌరవించాలి

రేపల్లె, ఏప్రిల్ 22, ప్రభాతవార్త: రేపల్లె మండల న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం పురపాలక సంఘంలోని 2వ వార్డు గూనివారిపాలెంలో చట్టాల వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. మోటారు చట్టాలు ,సంబంధిత వాహనాల పై ప్రజలకు అవగాహన కల్పించారు. చట్టాలను గౌరవించాలని, వాటికి అనుగుణంగా

ముందుకు సాగాలని పారా వాలంటీర్లు చెన్ను నాగమల్లేశ్వం రావు, ఆర్.శ్రీనివాసరావులు వివరించారు. ఈ కార్యక్రమంలో కె.గోవిందు, బి.ప్రవీణ్, వి.గణేష్, కె. అజయ్, ఎల్. సాంబయ్య, వి.సాంబశివరావు, ఎం.పాములు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అనారోగ్యబాధితునికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

తెనాలి ఏప్రిల్22,(ప్రభాతవార్త): మానవత్వమే ధ్యేయంగా, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక చేయూత అందించిన తెలుగుదేశం పార్టీ నాయకులు. బుధవారం తెనాలి పట్టణానికి చెందిన

పసుపులేటి హర్ష శ్రీ మంజునాథ్ వైద్య చికిత్స కోసం, తెనాలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ , మాజీ మంత్రి ,ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ చొరవ మరియు ప్రత్యేక సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి లెటర్ అఫ్ క్రెడిట్ నుంచి రూ. 3,55,355/ మంజూరైంది. ఈ ఆర్థిక సహాయానికి సంబంధించి బుధవారం వారికి 3,55,355/ ల చెక్కును అందజేసిన తెలుగుదేశం పార్టీ నాయకులు, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఎండి. ఖుద్దుస్, మల్లవరపు విజయ్, కనికరం యోగేష్, వులసి పూర్ణ. అనంతరం బాధితులు మాట్లాడుతూ, ఆపద సమయంలో ఆదుకున్నందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, అలాగే ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ కి, బాధిత కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

తహశీల్దార్‌కు గ్రామస్తుల ప్రశంసలు

తెనాలి ఏప్రిల్22,(ప్రభాతవార్త): తెనాలి మండలం బుర్రిపాలెం గ్రామంలో, గత 30 సంవత్సరాలుగా ఆక్రమణలచెరలో ఉన్న ప్రభుత్వభూమిని, గ్రామకంఠం నుండి తొలగించుటకు కృషి చేసిన తెనాలి మండల తహసీల్దార్ కేవీ. గోపాలకృష్ణ ను, బుధవారం బుర్రిపాలెం

గ్రామస్తులు అభినందించారు. బుర్రిపాలెం గ్రామంలో గ్రామ కంఠం నందు గల ప్రభుత్వ భూమి నందు గత 30 సంవత్సరాలుగా ఉన్న ఆక్రమణను గౌరవ తహసీల్దార్ వారి ఆధ్వర్యంలో ఏప్రిల్ 21వ తేదీన తొలగించిన సందర్భంగా, బుర్రిపాలెం గ్రామస్థులు మరియు ఆలయ కమిటీ సభ్యులు తహసీల్దార్ కేవీ. గోపాలకృష్ణ ని కలిసి కృతజ్ఞతలు తెలియజేసుకున్నారు.

ప్రజల సమస్యలను పరిష్కరించాలి

కొల్లిపర, ఏప్రిల్ 22, ప్రభాతవార్త: సచివాలయాల సిబ్బంది ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరిస్తుంటే ప్రజల నుండి ఎటువంటి సమస్యలకు అవకాశం ఉండదని డిప్యూటీ ఎంపిడివో దానయ్య చెప్పారు. బుధవారం మండల పరిధిలోని

కొల్లిపర, పిడపర్రు సచివాలయాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సచివాలయ సిబ్బందికి తగిన సలహాలు, సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో సచివాలయం సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. సచివాలయానికి ప్రజలు అందించే ప్రతి అర్జీని పరిశీలించి పరిష్కరించాలని చెప్పారు. సచివాలయాల పరిధిలో ఎటువంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. మంచినీటి పంపిణీపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని దానయ్య చెప్పారు.

ఉగ్రవాదానికి భారత్ తలవంచదు

వారి హేయమైన కుట్రలు సఫలం కావు: ప్రధాని మోడీ స్పష్టీకరణ

పహల్గామ్ దాడి మృతులకు నివాళి

ఆ బాధను మరచిపోలేదు: అమిత్ షా

ఆ గాయాలు ఇంకా మానలేదు: రాజ్‌నాథ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22: భారతదేశం ఏ విధమైన ఉగ్రవాదానికి తలవంచదని ప్రధానమంత్రి నరేంద్రమోడీ స్పష్టం చేశారు. ఉగ్రవాదుల హేయమైన కుట్రలు ఎప్పటికీ సఫలం కావని పేర్కొన్నారు. గత ఏడాది ఏప్రిల్ 22న జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న లష్కర్‌ఎతైబా ఉగ్రవాద సంస్థ దాడి చేసింది. ఈ దాడిలో భారతదేశం నలుమూలల నుండి వచ్చిన పర్యాటకులతో సహా 26 మంది అమాయక ప్రజలు మరణించారు. పహల్గామ్ ఉగ్రదాడికి సరిగ్గా ఏడాది పూర్తైన సందర్భంగా బుధవారం ఆ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే, ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన అమాయకులను ఎన్నటికీ మర్చిపోలేమన్నారు. ఈ మేరకు ప్రధాని మోడీ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

'పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన అమాయక ప్రజలను స్మరించుకుంటున్నా. మన ప్రజలను కోల్పోయిన దుఃఖం, బాధ ఇప్పటికీ ప్రతి భారతీయుడి హృదయంలో నిలిచి ఉన్నాయి. ఉగ్రవాదం మానవాళికి అతిపెద్ద శత్రువు, దానిపై పోరాడి ఓడించడానికి మనం ఐక్యంగా నిలబడాలి. ఉగ్రవాదం పట్ల, దానికి ఆశ్రయం ఇచ్చేవారి పట్ల భారత్ ఏమాత్రం ఉపేక్షించదు' అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన అమాయక ప్రజలకు కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నివాళి అర్పించారు. '2025 ఏప్రిల్ 22న జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యటకులపై పిరికిపంద ఉగ్రదాడి జరిగింది. ఆ దాడిలో ప్రాణాలు కోల్పోయిన అమాయక ప్రజలను స్మరించుకుంటూ, వారికి నా హృదయపూర్వక నివాళి అర్పిస్తున్నా. అలాగే, మృతుల కుటుంబాలకు సంతాపం తెలుపుతున్నా. మన దేశంపై పడిన ఆ గాయాలను మేం ఎప్పటికీ మరచిపోలేం. దశాబ్ద కాలంగా భారత్ సరిహద్దు ఉగ్రవాదాన్ని ఎదుర్కొంది. కానీ మన ప్రజలకు హాని కలిగించడానికి కానీ, లేదా మన ఐక్యతను దెబ్బతీయడానికి కానీ చేసే ఏ ప్రయత్నాన్నైనా మనం అత్యంత బలంతో, స్పష్టతతో ఎదుర్కొంటామని దృఢమైన చర్యల ద్వారా మేం నిరూపించాం' అని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొంటూ ఎక్స్‌లో ట్వీట్ చేశారు. **దేశ వ్యతిరేక చర్యలకు గట్టి బదులిస్తాం: ఇండియన్ ఆర్మీ :** దేశానికి వ్యతిరేకంగా జరిగే ఎలాంటి చర్య లకైనా గట్టి బదులిస్తామని భారత సైన్యం హెచ్చరించింది. ఉగ్రవాదులు సరిహద్దులు దాటవద్దని, ఆపరేషన్ సిందూర్ కొనసాగుతుందని స్పష్టం చేసింది. పహల్గాం ఉగ్రదాడి అనంతరం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను గుర్తుచేసుకుంటూ ఆర్మీ ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేసింది.

రూ.3వేలు తీసుకుని ఉగ్రవాదులకు ఆశ్రయం ఇచ్చిన స్థానికులు

కాల్పులు జరుపుతున్న సమాచారం తెలిసినా పోలీసులకు చేరవేయని వైనం

చివరకు ఎన్ఐఎ దర్యాప్తులో వెల్లడి... ఆపై అరెస్టు

శ్రీనగర్; ఏప్రిల్ 22: పహల్గాంలో ఉగ్ర దాడి ఘటనలో ఎన్ఐఎ దర్యాప్తుకు సంబంధించి కొత్తకోణం వెలుగులోకి వచ్చింది. ఆనాడు దాడికి పాల్పడిన ముగ్గురు పాకిస్థానీ ఉగ్రవాదులకు స్థానికులు ఇద్దరు ఆశ్రయం కల్పించారు. ఉగ్రవాదుల గురించి వారు పోలీసులకు చెప్పే అవకాశం ఉన్నా చెప్పకుండా రహస్యంగా ఉంచారని వెల్లడైంది. చెప్పకుండా ఉండటం కోసం వారు ఉగ్రవాదుల నుంచి రూ.3 వేల లంచం తీసుకున్నట్లు ఎన్ఐఎ విచారణలో తేలింది. గత ఏడాది ఏప్రిల్ 22న ఉగ్రవాదుల దాడి జరిగింది. అంతకుముందు రోజు అంటే ఏప్రిల్ 21న రాత్రి 10.30 గంటల సమయంలో స్థానికులు పర్వేజ్ అహ్మద్, బషీర్ అహ్మద్ వద్ద ముగ్గురు ఉగ్రవాదులు ఆశ్రయం పొందారు. ఆ సమయంలో వారి వద్ద ఆయుధాలు కనిపించాయి. ఉర్దూ, పంజాబీ కలగలిసిన భాష మాట్లాడారు. లష్కరే తయిబా అగ్ర కమాండర్, ప్రధాన నిందితుడు సాజిత్ జాట్ అలియాస్ అలీభాయ్ గురించి వారు మాట్లాడుకున్నారు. తమ ప్రాంతంలో దాడి జరగడం ఖాయమని వారి మాటల్ని బట్టి అర్థమైనా పోలీసులను అప్రమత్తం చేయకుండా మౌనంగా ఉండిపోయారని దర్యాప్తు వర్గాలు వెల్లడించాయి. ఐదు గంటలపాటు వారి వద్ద ఆశ్రయం పొందిన ఆ ముగ్గురు ఉగ్రవాదులు అక్కడే తినేసి వెళ్లిపోయారు. అందుకోసం రూ.3 వేలు ఇచ్చారు. తర్వాత ఏప్రిల్ 22న దాడి జరగడానికి కొన్ని గంటల ముందు మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ఆ ఉగ్రవాదులు బైసరన్ లోయలోని ఒక కంచె వెనకాల దాక్కొన్నారు. ఆ విషయాన్ని పర్వేజ్ అహ్మద్, బషీర్ అహ్మద్‌లు గుర్తించారు. అప్పుడు కూడా పోలీసులకుగానీ, స్థానిక టూరిస్ట్ ఆపరేటర్లకుగానీ వారు సమాచారం ఇవ్వలేదని వెల్లడైంది. ఆ ఇద్దరూ తమ గుర్రాలు ఎక్కడానికి పర్యాటకులు ఎవరైనా వస్తారా అని మాత్రమే చూసుకున్నారు. మధ్యాహ్నం ఒంటిగంటన్నర సమయంలో కొందరు రాగానే వారిని పహల్గాంలోని బైసరన్‌లోయకు తీసుకెళ్లారు. ఆ తర్వాత కొన్ని గంటలకు అక్కడ కాల్పుల మోత వినిపించడం, ఆవాతావరణ మంతా రక్తసిక్తమవడాన్ని చూశారు. ఆ తర్వాత తమకేం సంబంధం లేదన్నట్టుగా నిశ్శబ్దంగా అక్కడినుంచి జారుకున్నారని తెలిసింది. దర్యాప్తులో భాగంగా ఎన్ఐఎ ఆ ఇద్దరినీ గత ఏడాది జూన్ 22న అరెస్టు చేసింది. డిసెంబర్‌లో ఫైల్ చేసిన ఛార్జ్‌షీట్‌లో సాజిత్ జాట్ పేరుతోపాటు ఆ స్థానికుల పేర్లను చేర్చింది.

మాలేగావ్ పేలుళ్లకేసులో నలుగురు నిందితులపై కేసు కొట్టివేత

ముంబయి, ఏప్రిల్ 22: మాలేగావ్‌లో జరిగిన పేలుళ్ల ఘటనతో లింకున్న కేసులో నలుగురు నిందితులపై నమోదయిన అభియోగాలను కొట్టివేసింది. బాంబే హైకోర్టు బుధవారం ఆ కేసు నుంచి డిశ్చార్జ్ చేసింది. ఆ నలుగురిపై స్పెషల్ కోర్టు నమోదు చేసిన అభియోగాలను హైకోర్టు కొట్టివేసింది. చీఫ్ జస్టిస్ శ్రీ చంద్రశేకర్, జస్టిస్ శ్యామ్ చందక్‌తో కూడిన ధర్మాసనం ఈ తీర్పును ఇచ్చింది. రాజేంద్ర చౌదరీ, ధాన్ సింగ్, మనోహర్ రామ్ సింగ్ నర్వారియా, లోకేశ్ శర్మలు దాఖలు చేసిన అప్పీళ్లను హైకోర్టు స్వీకరించింది. ఈ కేసులో కోర్టు ఆదేశాలకు చెందిన పూర్తి కాపీ ఇంకా అందాల్సి ఉన్నది. మాలేగావ్ పేలుళ్ల ఘటనలో నలుగురిపై ఐపీసీ, యూఏపీఏ సెక్షన్ల కింద కేసు బుక్ చేశారు. 2006 సెప్టెంబర్ 8వ తేదీన నాసిక్ జిల్లాలోని మాలేగావ్ పట్టణంలో నాలుగు చోట్ల బాంబు పేలుళ్లు చోటు చేసుకున్నాయి. శుక్రవారం ప్రార్థనలు ముగిసిన సమయంలో హమిదియా మజీద్, బడా ఖబరస్తాన్ ప్రాంతాల్లో పేలుళ్లు జరిగాయి. ముషావరత్ చౌక్ వద్ద కూడా పేలుడు జరిగింది. ఆ పేలుళ్లలో మొత్తం 31 మంది మృతిచెందగా, మరో 312 మంది గాయపడ్డారు. మహారాష్ట్ర ఏటీఎస్ పోలీసులు ఈ కేసును విచారించారు. ఈ కేసుతో లింకున్న 9 మంది ముస్లింలను అరెస్టు చేశారు. ఆ తర్వాత ఈ కేసును ఎన్ఐఏ తన ఆధీనంలోకి తీసుకున్నది. బ్లాస్ట్ వెనుక అతివాద తీవ్రవాదులు ఉన్నట్లు ఎన్ఐఏ ఆరోపించింది. దానిలో భాగంగా నలుగుర్ని అరెస్టు చేశారు. స్పెషల్ కోర్టు తన ఆదేశాల్లో 9 మంది ముస్లింలను కేసు నుంచి రిలీజ్ చేసింది. ఇక గత ఏడాది సెప్టెంబర్‌లో ఈ నలుగురిపై అభియోగాలు నమోదు చేసింది. ఆ ఆదేశాలను సవాల్ చేస్తూ వాళ్లు హైకోర్టును ఆశ్రయించారు. ఎన్ఐఏ తన దర్యాప్తులో తమపై ఎటువంటి ఆధారాలను చూపలేదని నిందితులు పేర్కొన్నారు.

అంగారక గ్రహంపై జీవకారక సేంద్రియ అణువుల గుర్తింపు

న్యూయార్కు, ఏప్రిల్ 22: అంగారక గ్రహంపై జీవం ఉనికి గురించి దశాబ్దాలుగా సాగుతున్న అన్వేషణలో నాసాకు చెందిన క్యూరియాసిటీ రోవర్ మరో కీలక ముందడుగు వేసింది. అరుణ గ్రహం ఉపరితలంపై జరిపిన సరికొత్త రసాయన ప్రయోగంలో జీవానికి మూలమైన సేంద్రియ అణువులను గుర్తించింది. భూమి మీద జీవానికి ప్రాథమిక నిర్మాణ ఇటుకలుగా పరిగణించే ఈ రసాయనాల గుర్తింపు, మార్స్ అధ్యయనంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. క్యూరియాసిటీ రోవర్ అంగారకుడి భూమధ్యరేఖకు సమీపంలో ఒకప్పుడు సరస్సుగా ఉండి ఎండిపోయిన ప్రాంతంలో ఈ పరిశోధన జరిపింది. ఇక్కడ ఏడు వేర్వేరు సేంద్రియ సమ్మేళనాలను రోవర్ గుర్తించగా, వాటిలో ఐదింటిని మార్స్‌పై కనుగొనడం ఇదే తొలిసారి. ఈ సేంద్రియ పదార్థాలు పురాతన జీవుల నుంచి వచ్చాయా, ఉల్కల ద్వారా గ్రహానికి చేరాయా, లేక భౌగోళిక ప్రక్రియల వల్ల ఏర్పడ్డాయా అన్నదానిపై ఇంకా స్పష్టత రాలేదు. ఒకవేళ అంగారకుడిపై జీవం ఉండి ఉంటే, దానికి సంబంధించిన రసాయన ఆనవాళ్లు ఇప్పటికీ భద్రంగా ఉండే అవకాశం ఉందని ఈ ఆవిష్కరణ సూచిస్తోంది. ఈ ప్రయోగానికి నేతృత్వం వహించిన ఫ్లోరిడా యూనివర్సిటీ ఆస్ట్రోజియాలజిస్ట్ ప్రొఫెసర్ అమీ విలియమ్స్ మాట్లాడుతూ.. మేము 350 కోట్ల సంవత్సరాల క్రితం అంగారకుడిపై భద్రపరచబడిన సేంద్రియ పదార్థాలను చూస్తున్నామని భావిస్తున్నాం. అయితే ఇది జీవానికి సంబంధించినదేనా అన్నది ప్రస్తుత సమాచారంతో చెప్పలేమనిఅన్నారు. కొన్ని వందల కోట్ల ఏళ్ల కిందట మార్స్‌పై జీవం వృద్ధి చెందడానికి అనువైన వాతావరణం ఉండేదని, కానీ నేడు తీవ్రమైన రేడియేషన్, అతి శీతల పరిస్థితులు ఉన్నాయని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. గుర్తించిన సమ్మేళనాల్లో డీఎన్ఏ నిర్మాణంలో పాలుపంచుకునే నైట్రోజన్ సమ్మేళనం వంటి నిర్మాణం ఒకటి ఉన్నప్పటికీ, అవి కేవలం ఇటుకలు మాత్రమే, ఇల్లు కాదని ఆమె స్పష్టం చేశారు. ఈ ఆవిష్కరణలతో 2028లో ప్రయోగించనున్న యూరోపియన్ స్పేస్ ఏజెన్సీకి చెందిన రోసలిండ్ ఫ్రాంక్లిన్ రోవర్‌పై అంచనాలు పెరిగాయి. ఈ రోవర్ ఉపరితలం కింద రెండు మీటర్ల లోతు వరకు డ్రిల్ చేసి, రేడియేషన్ నుంచి మరింత సురక్షితంగా ఉన్న నమూనాలను అధ్యయనంచేసే సామర్థ్యం ఉంటుంది.

భారత్‌నౌకతోపాటు మరో రెండు నౌకలు ఐఆర్‌జిసి స్వాధీనం

మరికొన్నింటిపై గన్‌బోట్స్ కాల్పులు

టెహ్రాన్, ఏప్రిల్ 22: భారత్‌కు వస్తున్న కార్గో షిప్‌తో పాటు మరో నౌకను ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ నౌకాదళం స్వాధీనం చేసుకున్నది. హర్మూజ్ జలసంధి దాటేందుకు ప్రయత్నించిన ఆ రెండు వాణిజ్య నౌకలను ఇరాన్ తీరానికి తరలించింది బుధ వారం ఉదయం హర్మూజ్ జలసంధిలో నిబంధనలను ఉల్లంఘించిన రెండు నౌకలను ఐఆర్‌జీసీ నౌకాదళం గుర్తించి నిలిపివేసింది. ఆ రెండు నౌకలను ఐఆర్‌జీసీ నౌకాదళం స్వాధీనం చేసుకుని ఇరాన్ తీరానికి మళ్లించిందని ఐఆర్‌జీసీ ప్రకటించింది. ఐఆర్‌జీసీ స్వాధీనం చేసుకున్న రెండు నౌకలను ఎంఎస్‌సి ఫ్రాన్సెస్కా, ఎపామి నోండాస్‌గా గుర్తించారు. మెరైన్ ట్రాఫిక్ వెబ్ సైట్ ప్రకారం ఎపామినోండాస్ నౌక దుబాయ్‌లోని జెబెల్ అలీ నుంచి గుజరాత్‌కు వెళ్తోంది. మరోవైపు బుధవారం ఉదయం హోర్ముజ్ జల సంధిలో మూడు కంటైనర్ నౌకలపై ఐఆర్‌జీసీ నౌకాదళం దాడి చేసింది. ఒమన్‌కు ఈశాన్యంగా సుమారు 15 నాటికల్ మైళ్ల దూరంలో ఒక కంటైనర్ నౌకపై ఐఆర్‌జీసీ గన్‌బోట్ కాల్పులు జరిపినట్లు యూకే మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ సెంటర్ (యూకేఎమ్‌టీఓ) తెలిపింది.



(గ్రీక్ కంపెనీకి చెందిన ఎపామినోండాస్ నౌకలోని బ్రిడ్జికి నష్టం వాటిల్లినట్లు పేర్కొంది. ఇరాన్‌కు పశ్చిమాన సుమారు ఎనిమిది నాటికల్ మైళ్ల దూరంలో యూఏఈకి చెందిన సంస్థ యాజ మాన్యంలోని పనామా జెండా కలిగిన యూఫోరియా నౌకపై కూడా ఐఆర్‌జీసీ నౌకా దళం దాడి చేసింది. నౌక సిబ్బంది సురక్షితంగా ఉన్నారని, నౌకకు ఎలాంటి నష్టం జరగలేదని యూకేఎమ్‌టీఓ తెలిపింది. ఇరాన్ తీరానికి సుమారు ఆరు నాటికల్ మైళ్ల దూరంలో ఉన్న పనామా జెండా కలిగిన ఎంఎస్‌సి ఫ్రాన్సెస్కా నౌకను కూడా ఐఆర్‌జీసీ నౌకాదళం లక్ష్యంగా చేసుకున్నది. హర్మూజ్ జలసంధి నుంచి దక్షిణంగా ఒమన్ గల్ఫ్‌లోకి ప్రయాణిస్తుండగా దాడి చేసింది. ఆ నౌక బాడీ, వసతి సౌకర్యాలకు నష్టం వాటిల్లినట్లు సముద్ర నిఘా సంస్థ వాన్‌గార్డ్ వెల్లడించింది.

నడిరోడ్డుపై బిజెపి ఆందోళనపట్ల ముంబయి మహిళ ఫైర్

ముంబయి, ఏప్రిల్ 22: ముంబైలో ఓ రాజకీయ ర్యాలీ కారణంగా తీవ్రమైన ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకున్న ఓ మహిళ, ఏకంగా మంత్రిని, పోలీసులనుకూడా నడిరోడ్డుపై నిలదీశారు. మహారాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి గిరీశ్ మహాజన్ కాన్వాయ్‌ను అడ్డుకుని ఆమె చేసిన వాగ్వివాదం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ముంబైలోని వర్లీ ప్రాంతంలో బీజేపీ ఆధ్వర్యంలోని మహాయుతి కూటమి ఓ నిరసన ప్రదర్శన చేపట్టింది. మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించిన కాంగ్రెస్, ఇతర విపక్షాలపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ ఈ ర్యాలీ నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు జంబోరీ మైదాన్ నుంచి ప్రారంభం కావాల్సిన ఈ ర్యాలీ ఆలస్యం కావడంతో ఆ ప్రాంతమంతా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. అదే సమయంలో స్కూల్ నుంచి తన బిడ్డను తీసుకొచ్చేందుకు వెళ్తున్న ఓ మహిళ, గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుపోయారు. దీంతో సహనం కోల్పోయిన ఆమె కారు దిగి నేరుగా ర్యాలీ మధ్యలోకి వెళ్లి మంత్రి గిరీశ్ మహజన్‌తో వాగ్వివాదానికి దిగారు. వందలాది మంది ఇక్కడ ఇబ్బంది పడుతున్నారు. అక్కడ ఖాళీ గ్రౌండ్ ఉందిగా అక్కడికి వెళ్లి చేసుకోండి. ఇక్కడి నుంచి వెళ్లిపోండి అంటూ నిరసనకారులపై గట్టిగా అరిచారు. పోలీసులు జోక్యం చేసుకోబోగా, వారిపైనా ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. సీనియర్ అధికారులతో మాట్లాడాలని పట్టుబట్టారు. చివరికి పోలీసులు ఆమెను పక్కకు తీసుకెళ్లి సమస్యను తెలుసుకునే ప్రయత్నం చేశారు.

తెరచుకున్న కేదార్‌నాథ్ ఆలయం

డెహ్రాడూన్; ఏప్రిల్ 22: ఆధ్యాత్మిక లోకానికి ప్రస్తుతం ఒక పవిత్ర ఘట్టం ఆవిష్కృతమైంది. ఉత్తరాఖండ్‌లోని అత్యంత పవిత్రమైన కేదార్‌నాథ్ ధామం తలుపులు బుధవారం భక్తుల దర్శనార్థం తెరుచుకున్నాయి. మంచు కొండల నడుమ కొలువైన కేదార్‌నాథ్ ఆలయం ఉదయం 8 గంటలకు వైభవంగా తెరుచుకుంది. వేదమంత్రోచ్చారణలు, మేళతాళాల మధ్య సుమారు 51క్వింటాళ్ల పూలతో అందంగా అలంకరించిన ఈ పుణ్యక్షేత్రం భక్తులకు స్వాగతం పలికింది. స్వామి వారి సందర్శనార్థ ఆలయానికి భక్తులు పోటెత్తుతున్నారు. మరోవైపు, రేపు విష్ణుమూర్తి నివాసమైన బద్రీనాథ్ ఆలయ ద్వారాలు తెరుచుకోనున్నాయి. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీఎక్స్ వేదికగా భక్తులకు శుభాకాంక్షలు తెలుపుతూ ఒక సందేశాన్ని ఇచ్చారు. చార్‌ధామ్ యాత్ర మన దేశ విశ్వాసానికి, ఐక్యతకు మరియు సుసంపన్నమైన సంప్రదాయాలకు దివ్య ఉత్సవం వంటిదని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి యాత్ర సుఖమయంగా సాగాలని, బాబా కేదార్ ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

ప్రియుడికోసం భర్తనే చంపే కుట్రచేసిన భార్య

వదోదర, ఏప్రిల్ 22: ప్రియుడితో కలిసి కట్టుకున్న భర్తనే కడతేర్చాలని ఓ భార్య పన్నిన పన్నాగం గుజరాత్‌లోని వడోదర పోలీసుల దర్యాప్తులో బట్టబయలైంది. వడోదరలోని ఛానీ ప్రాంతానికి చెందిన పాన్ పార్లర్ యజమాని గిరీశ్ పటేల్‌ను ఏప్రిల్ 15న కొందరు దుండగులు కిడ్నాప్ చేశారు. ఛానీసోఖ్డా రోడ్డుపై కారులో బలవంతంగా ఎక్కించుకుని, కత్తితో బెదిరించి, సోజిత్ర సమీపంలోని కాలువలో పడేశారు. గిరీశ్ చనిపోయాడని భావించిన నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. అయితే, కాలువలోని ఓ నిర్మాణాన్ని పట్టుకుని సుమారు మూడు గంటల పాటు గిరీశ్ ప్రాణాలతో పోరాడాడు. మరుసటి రోజు ఉదయం సురక్షితంగా బయటపడ్డాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, తొలుత ఐదుగురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో గిరీశ్ భార్య ఫాల్గుణి పటేల్ పాత్ర ఉన్నట్లు తేలింది. ఖేడా ప్రాంతానికి చెందిన సెలూన్ యజమాని కౌశిక్ శర్మతో ఫాల్గుణికి వివాహేతర సంబంధం ఉందని, తమ బంధానికి అడ్డుగా ఉన్న గిరీశ్‌ను చంపేందుకు ఇద్దరూ కలిసి కుట్ర పన్నారని పోలీసులు వెల్లడించారు. కౌశిక్ శర్మ ఈ హత్య కోసం నరేంద్ర అలియాస్ నికుల్ గోస్వామి అనే కిరాయి హంతకుడికి రూ.35వేల సుపారీ ఇచ్చాడు. ఘటనకు రెండు రోజుల ముందు ఫాల్గుణి, కౌశిక్ మధ్య 100కు పైగా ఫోన్ కాల్స్ జరిగినట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం నిందితులందరినీ జ్యుడీషియల్ కస్టడీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అమెరికా మహిళా టూరిస్టుపై హోంస్టేలో లైంగికదాడి

కొడగు, ఏప్రిల్ 22: కర్ణాటకలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కొడగు జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. అమెరికాలోని వాషింగ్టన్‌కు చెందిన ఓ మహిళా టూరిస్ట్‌పై హోంస్టేలో అత్యాచారం జరిగింది. ఈ ఘటనకు సంబంధించి హోంస్టే యజమాని, అక్కడ పనిచేసే ఓ సిబ్బందిని పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రధాన నిందితుడు ఝార్ఖండ్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఈ విషయం తెలుసుకున్న యజ మాని, ఆమెకు సహాయం చేయకపోగా నేరాన్ని దాచిపెట్టే ప్రయత్నం చేశాడు. మూడు రోజుల పాటు బాధితురాలిని నిర్బంధించి, ఆమె ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నాడు. ఎవరికీ ఫిర్యాదు చేయవద్దని బెదిరించాడు. అక్కడి నుంచి తప్పించుకున్న బాధితురాలు మైసూరు చేరుకుని, అమెరికా అధికారులను సంప్రదించింది. యూఎస్ ఎంబసీ ద్వారా విషయం తెలుసుకున్న కర్ణాటక పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. ఈ ఘటనను కొడగు జిల్లా ఎస్పీ ధ్రువీకరించారు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచామని, వారికి మే 3 వరకు జ్యుడీషియల్ కస్టడీ విధించారని ఆయన తెలిపారు.

ఇడి దర్యాప్తులో మీ జోక్యమేంటి?

ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలో నెట్టేలా చర్యలు

మమతాబెనర్జీపై సుప్రీంకోర్టు ఆగ్రహం

ఐప్యాక్ ఆఫీసుల్లో ఇడి సోదాలపై విచారణ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22: పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీరుపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. రాజకీయ కన్సల్టెన్సీ సంస్థ ఐప్యాక్ కార్యాలయాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) నిర్వహించిన సోదాల సందర్భంగా ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అడ్డుపడ్డారన్న ఆరోపణలపై బుధవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఒక ముఖ్యమంత్రి విచారణలో జోక్యం చేసుకుంటే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందని సుప్రీంకోర్టు పేర్కొంది. 'ఇది కేంద్రానికి, రాష్ట్రానికి మధ్య ఉన్న వివాదం కాదు. ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి అయినా ఒక విచారణ లేదా దర్యాప్తు మధ్యలో హఠాత్తుగా అడుగుపెట్టి, ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెట్టి, ఆ తర్వాత ఇది కేంద్రానికి, రాష్ట్రానికి మధ్య ఉన్న వివాదం అని అంటారు' అని జస్టిస్‌లు ప్రశాంత్ కుమార్ మిశ్రా, ఎన్.వి. అంజరియాలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఇడి జరుపుతున్న విచారణ మధ్యలోకి ముఖ్య మంత్రి చొరబడి ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలో పడేయడం సరికాదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఒక ఉన్నతాధికారి తరఫున కోర్టులో హాజరైన సీనియర్ న్యాయవాది మేనకా గురుస్వామి, ఈ వివాదం ప్రధానంగా కేంద్రానికి, రాష్ట్రానికి మధ్య ఉందని పేర్కొంటూ, ఇడి పిటిషన్ స్వీకార్యతను ప్రశ్నించిన సందర్భంగా ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. "ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి మొత్తం వ్యవస్థను, ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలో పడేస్తూ చేసిన చర్య" అని జస్టిస్ మిశ్రా వ్యాఖ్యానించారు. రాజ్యాంగం 'ప్రాథమిక స్వరూప సిద్ధాంతాన్ని" నిర్దేశించిన 1973 నాటి చారిత్రాత్మక కేశవానంద భారతి తీర్పుతో సహా అనేక తీర్పులను తమ ముందు ఉదహరించారని ధర్మాసనం పేర్కొంది. 'కానీ ఈ దేశంలో ఒకరోజు పదవిలో ఉన్న ముఖ్యమంత్రి కార్యాలయంలోకి అడుగుపెడతారని వారిలో ఎవరూ ఊహించి ఉండరు' అని జస్టిస్ మిశ్రా అన్నారు. సీనియర్ న్యాయవాది గురుస్వామి మాట్లాడుతూ, 'కేసు విచారణకు యోగ్యమైనదేనా అనే దానిపై ఉన్నాను... ఎటువంటి దుష్ప్రవర్తన జరగలేదు, ఏ అధికారిని బెదిరించడం జరగలేదు' అని అన్నారు. ఈ విషయంలో లేవనెత్తిన ప్రశ్నలను విస్తృత ధర్మాసనానికి నివేదించాలన్న వాదనలతో ధర్మాసనం ఏకీభవించలేదు. 'ఆర్టికల్ 32 పిటిషన్ విచారణకు యోగ్యమైనదా కాదా అని తాము నిర్ణయిస్తాము. ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం పరిశీలించాల్సినంత ముఖ్యమైన చట్టపరమైన ప్రశ్న ఏమిటి?' అని అది ప్రశ్నించింది. తాము అప్పీల్‌ను విచారించడం లేదని గమనిస్తూనే, తమ ముందు దాఖలైన అన్ని పిటిషన్లలోనూ కొన్ని చట్టపరమైన ప్రశ్నలు ఉంటాయని, అయితే అంతమాత్రాన ప్రతి ఆర్టికల్ 32 పిటిషన్‌ను ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనానికి నివేదించాలని అర్థం కాదని ధర్మాసనం పేర్కొంది. ప్రతివాదులలో ఒకరి తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా, మమతా బెనర్జీ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించగా, తదుపరి విచారణ గురువారానికి ధర్మాసనం వాయిదా వేసింది.

నేపాల్ హోంమంత్రి రాజీనామా

ఖాట్మండు, ఏప్రిల్ 22: నేపాల్ హోంమంత్రి సూడాన్ గురుంగ్ తన మంత్రిపదవికి రాజీనామా చేసారు. వ్యాపారవేత్త దీపక్‌భట్టాతో తనకు లింకులున్నాయని వచ్చిన ఆరోపణలపై జరుగుతున్న దర్యాప్తునకు నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేసినట్లు వెల్లడించారు. దీపక్ భట్టా ప్రస్తుతం మనీలాండరింగ్ ఆరోపణలపై విచారణ ఎదుర్కొంటున్నారు. దీపక్‌భట్టాకు చెందిన కంపెనీల్లో హోంమంత్రికి షేర్లు ఉన్నాయని ప్రభుత్వ ఆస్తుల ప్రకటనపరంగా ఆర్థిక సమాచారం అందించారన్న ఆరోపణలున్నాయి. గురుంగ్ రాజీనామాపై నేపాలి కాంగ్రెస్ ప్రకటన జారీచేసింది. ప్రజాస్వామ్యానికి పారదర్శకత, అంకితభావం మూల స్తంభాలుగా ఉంటాయని గురుంగ్‌పై వచ్చిన ఆరోపణలపై వాస్తవిక అంశాల ఆధారంగా నిజనిర్ధారణతో నిష్పాక్షిక విచారణ జరిపించాల్సిన అవసరం ఎంతో ఉందని అన్నారు. ఆయన సొంతపార్టీ రాష్ట్రీయ ప్రజాతంత్ర పార్టీనుంచి కూడా గురుంగ్ రాజీనామాచేయాలని ఒత్తిడి తెచ్చారు. రాజకీయ ఒత్తిళ్లతోపాటు నైతికంగా కూడా తనకు కొనసాగడం ఇష్టంలేదని అందుకే బుధవారం తన రాజీనామాను అందచేసినట్లు గురుంగ్ ప్రకటించారు. ఆయన షేర్లతో పాటు ఆయన ఇటీవల కొనసాగించిన పెట్టుబడులపైనా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. తనవరకూ తనకు నైతిక నియమావళి ముఖ్యమని అందుకే రాజీనామ చేసినట్లు తెలిపారు. ప్రజల్లో విశ్వాసం చూరగొనేందుకే తాను రాజీనామా చేసానన్నారు. సుపరిపాలన, పారదర్శకత, చిత్తశుద్ధితో కూడిన పాలన కావాలనే జెన్‌జడ్ ఆందోళన నడిచిందని ఇపుడు తన రాజీనామా కూడా అదే సందేశం ఇస్తుందని అన్నారు. కనీసం నెలరోజులు కూడా నిర్వహించలేకపోయిన హోంమంత్రి పదవినుంచి ఆయన దిగిపోయారు. అంతకుముందు ఇదేనెలలోనే ప్రధాని బాలేన్‌షా కార్మిక మంత్రి దీపక్ కుమార్‌షాను తొలగించారు.

మంటల్లో పశ్చిమాసియా

కంటైనర్ నౌకపై ఐఆర్‌జిసి కాల్పులు



లండన్, ఏప్రిల్ 22: పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్ వేదికగా జరగాల్సిన కాల్పుల విరమణ చర్చలు వాయిదాపడిన క్రమంలో ఇరాన్ హర్మూజ్ జలసంధిలో ఒక కంటైనర్ నౌకపై కాల్పులు జరిపి పరిస్థితిని మరింత తీవ్రం చేసింది. టెహ్రాన్ నుండి ఏకీకృత ప్రతిపాదన కోసం ఎదురు చూస్తూ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కాల్పుల విరమణను పొడిగించారు. ట్రంప్ ప్రకటన వెలువడిన కొన్ని గంటల తర్వాత ఈ పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జీసీ) హర్మూజ్ జలసంధిలో ఒక కంటైనర్ నౌకపై కాల్పులకు పాల్పడిందని యూకే మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ సెంటర్ తెలిపింది. కాల్పులకు ముందు గన్‌బోట్ నౌకకు ఎలాంటి హెచ్చరికలు చేయలేదని తెలిపింది. కాల్పుల్లో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని స్పష్టం చేసింది. ఇరాన్ మీడియా కూడా ఈ దాడిని ధ్రువీకరించింది. కాల్పులకు గల కారణాలు వెల్లడించలేదు. ఇరాన్‌కు చెందిన వాణిజ్య నౌకను అమెరికా దళాలు ఇటీవల స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో దాడి జరగడం ఉద్రిక్తతలను మరోసారి పెంచింది. అమెరికాతో చర్చలపై ఇరాన్ స్పందించింది. ఐక్యరాజ్య సమితిలో ఇరాన్ రాయబారి అమీర్ సయీద్ ఇరావానీ మాట్లాడుతూ, అమెరికాతో రెండో విడత చర్చలకు తాము సిద్ధమని ప్రకటించారు. అదే సమయంలో హర్మ్యూజ్ జలసంధిలో తమ నౌకలపై కొనసాగుతోన్న దిగ్బంధాన్ని ఎత్తివేయాలని షరతు విధించారు. తమ నౌకలను దిగ్బంధించడంతో పాటు, అమెరికా కాల్పుల విరమణ ఉల్లంఘనకు పాల్పడిందని ఆరోపించారు.

కాల్పుల విరమణ పొడిగింపు ఓటమి అంగీకరించడమే

ఇరాన్ స్పీకర్ సలహాదారు మహదీ మహ్మదీ



టెహ్రాన్; ఏప్రిల్ 22: అమెరికా, ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు మరోసారి భగ్గుమన్నాయి. శాంతి చర్చల కోసం ఇరాన్‌తో కాల్పుల విరమణను నిరవధికంగా పొడిగిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించగా, ఈ ప్రతిపాదనను ఇరాన్ తీవ్రంగా తిరస్కరించింది. ట్రంప్ నిర్ణయం అర్థరహితమని, ఓడిపోయిన పక్షం షరతులు విధించలేదని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహ్మద్ బఘేర్ ఘలీబాఫ్ సీనియర్ సలహాదారు మహదీ మొహమ్మదీ ఎద్దేవా చేశారు. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో శాంతి చర్చలకు మరింత సమయం ఇచ్చేందుకే కాల్పుల విరమణను పొడిగిస్తున్నట్లు ట్రంప్ తనట్రూత్ సోషల్ ప్లాట్‌ఫామ్‌లో పేర్కొన్నారు. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ అభ్యర్థన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఇరాన్ నాయకత్వంలో తీవ్రమైన భేదాభిప్రాయాలు ఉన్నాయని, ఒక ఏకీకృత ప్రతిపాదనతో ముందుకు వచ్చేందుకు వారికి సమయం ఇస్తున్నామని అన్నారు. హర్మ్యూజ్ జలసంధిలోని ఇరాన్ ఓడరేవులపై అమెరికా దిగ్బంధనం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ట్రంప్ ప్రకటనపై మహదీ మొహ మ్మదీ తీవ్రంగా స్పందించారు. ట్రంప్ కాల్పుల విరమణ పొడిగింపునకు అర్థం లేదు. ఓడిపోయిన పక్షం షరతులు పెట్టలేదు. దిగ్బంధనాన్ని కొనసాగించడం కూడా బాంబు దాడులతో సమానం. దీనికి సైనిక చర్యతోనే బదులివ్వాలి. ఆకస్మిక దాడికి పాల్పడేందుకు సమయం సంపాదించే కుట్రలో భాగమే ఈ కాల్పుల విరమణ. ఇక ఇరాన్ చొరవ తీసుకునే సమయం ఆసన్నమైందని ఆయన ఎక్స్ వేదికగా హెచ్చరించారు. మరోవైపు ఇరాన్ ఆర్థికంగా కుప్పకూలుతోందని ట్రంప్ వ్యాఖ్యానించారు. వారు వెంటనే హర్మ్యూజ్ జలసంధిని తెరవాలని కోరుకుంటున్నారు. నగదు కోసం ఆకలితో ఉన్నారు. రోజుకు 500 మిలియన్ డాలర్లు నష్టపోతున్నారు. సైన్యం, పోలీసులకు జీతాలు అందడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని ట్రంప్ పేర్కొన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఇస్లామాబాద్‌లో జరగాల్సిన రెండో విడత శాంతి చర్చల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. ఇరాన్ నుంచి ప్రతిపాదన వచ్చే వరకు, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ పాకిస్థాన్‌కు వెళ్లరని వైట్ హౌస్ అధికారి ఒకరు వెల్లడించారు. దీంతో ఇరు దేశాల మధ్య శాంతి ప్రయత్నాలకు గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లయింది.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత : పీసీబి ఈ ఈ నజీనా బేగం

గుంటూరు, ఏప్రిల్ 22 ప్రభాతవార్త ప్రతినిధి : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని కాలుష్య నియంత్రణ మండలి గుంటూరు జిల్లా పర్యావరణ ఇంజనీర్ ఎం.డి. నజీనా బేగం అన్నారు. ప్రపంచ ధరిత్రీ దినోత్సవం సందర్భంగా గుంటూరు ప్రాంతీయ కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయం, రాష్ట్ర యువజన సేవల శాఖ, స్టెప్ స్వశక్తి విభాగం, ప్రభుత్వ ఐ.టి.ఐకళాశాల సంయుక్తంగా బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి జిల్లా పర్యావరణ ఇంజనీర్ మాట్లాడుతూ అవర్ పవర్, అవర్ ప్లానెట్ అనే థీమ్ తో ప్రపంచ ధరిత్రీ దినోత్సవం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ప్రపంచ ధరిత్రీ దినోత్సవం 1970లో అమెరికాలో ప్రారంభమైందని తెలిపారు. 1970 దశకంలో పరిశ్రమల విస్తరణ, వాహనాల పెరుగుదల, రసాయనాల అధిక వినియోగం వల్ల గాలి, నీరు, నేల కాలుష్యం తీవ్రంగా పెరిగిన నేపథ్యంలో ప్రజల్లో అవగాహన కల్పించడానికి ఈ దినోత్సవాన్ని ప్రారంభించారని చెప్పారు. అప్పటి నుండి ఇది ప్రపంచవ్యాప్తంగా ఒక ప్రధాన పర్యావరణ ఉద్యమంగా మారిందని వివరించారు. పర్యావరణ పరిరక్షణ పట్ల మన బాధ్యతను ధరిత్రి దినోత్సవం గుర్తుచేస్తుందని పేర్కొన్నారు. చెట్లు నాటడం, నీటిని సంరక్షించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం వంటి సాధారణ



చర్యల ద్వారా భూమిని రక్షించవచ్చని సూచించారు. భూమి మనకు గాలి, నీరు, ఆహారం, నివాసం వంటి మౌలిక అవసరాలను అందిస్తున్నప్పటికీ, మన నిరక్ష్యం వల్ల ప్రకృతి సమతుల్యత దెబ్బతింటోందని తెలిపారు. అడవుల నరికివేత, ప్లాస్టిక్ కాలుష్యం, నీటి వృథా, గ్లోబల్ వార్మింగ్ వంటి సమస్యలు రోజు రోజుకు పెరుగుతున్న నేపథ్యంలో భూమిని కాపాడడం అత్యవసరమైందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఐ.టి.ఐ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఎస్. ఖాజావలి, రాష్ట్ర యువజన సేవల ఇన్‌చార్జ్ బి. రాధిక, పర్యావరణ కోఆరినేటర్ డి. తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో జిల్లా వ్యవసాయాధికారి ఆకస్మిక తనిఖీలు

సత్తెనపల్లి, ఏప్రిల్ 22, ప్రభాతవార్త: పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు సత్తెనపల్లి పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారి యం.జగ్గారావు ,సత్తెనపల్లి సహాయ వ్యవసాయ సంచాలకులు బి.రవిబాబు, సత్తెనపల్లి మండల వ్యవసాయ అధికారి బి.సుబ్బారెడ్డి పాల్గొన్నారు. ఎరువుల దుకాణాలలో భౌతిక నిల్వలు మరియు అమ్మకాలు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాల (ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం) నేపథ్యంలో ఎరువుల కొరతపై అపోహలతో రైతులు ఆందోళన చెందవద్దని తెలియజేశారు. ప్రస్తుతం ఎరువుల దుకాణాలలో సమృద్ధిగా ఎరువులు నిల్వలు ఉన్నాయని తెలియజేశారు. ప్రస్తుతం ఉన్న ఎరువులు నిల్వలను స్థానిక వ్యవసాయ అధికారి అమ్మకాలు నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేయటం జరిగిందని తెలిపారు. ఎవరికైనా రైతులకు ప్రస్తుతం సాగు చేస్తున్నటువంటి పంటలకు ఎరువులు అవసరమైన మేరకు స్థానిక వ్యవసాయ

అధికారి అనుమతితో డీలర్లు ఎరువులు అమ్మకాలు జరపాలన్నారు. . స్థానిక మండల వ్యవసాయ అధికారి అనుమతి లేకుండా ఎవరైనా రైతులకు ఎరువుల అమ్మకాలు జరిపితే అటువంటి డీలర్ల పై నిత్యావసర వస్తువుల చట్టం ప్రకారం శాఖాపరమైన కఠిన చర్యలు ఉంటాయన్నారు.

పెండింగ్ సమస్యల పరిష్కారంలో జాప్యం చేయవద్దు : ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట, ఏప్రిల్ 22 ప్రభాతవార్త : స్థానిక నియోజకవర్గంలోని పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు అధికారులను కోరారు.బుధవారం గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే.. వ్యవసాయం, నీటిపారుదల, విద్య, వైద్యం, ఉపాధి హామీ, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్), డ్వామా శాఖల్లో నెలకొన్న సమస్యలను ప్రస్తావించారు. ఆయా శాఖలు సక్రమంగా,జవాబుదారితనంతో పనిచేయాలనిఅధికారులకు సూచించారు. జిల్లాలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. జల్ జీవన్ మిషన్ కింద జిల్లాలోని 4.34 లక్షల గ్రామీణ గృహాలకు గాను కేవలం 1,53,564 ఇళ్లకు మాత్రమే ట్యాప్ కనెక్షన్లు ఉన్నాయని తెలిపారు. ఇది మొత్తం లక్ష్యంలో 35.55 మాత్రమేనని, మిగిలిన 2.81 లక్షల ఇళ్లకు వెంటనే నీటి సరఫరా కల్పించాలని డిమాండ్ చేశారు. దీనికోసం రూ.1,200 కోట్లతో చేపట్టిన పల్నాడు వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని సూచించారు.పిడుగురాళ్ల మెడికల్ కళాశాలలో 202627 విద్యా సంవత్సరం నుంచి 100 ఎంబీబీఎస్ సీట్లతో తరగతులు ప్రారంభం కానుండటం జిల్లా వైద్య రంగానికి మైలురాయి అని వ్యాఖ్యానించారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్, జడ్పీ సీఈవో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సేవ బాధ్యతగా స్వీకరించాలన్న ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి

ఎనిమిది మంది సభ్యులు ధర్మకర్తలుగా ప్రమాణ స్వీకారం

గుంటూరు, ఏప్రిల్ 22, ప్రభాతవార్త : గుంటూరు ఆర్. అగ్రహారంలోని శ్రీ గంగా భ్రమరాంబా సమేత మల్లేశ్వర స్వామి వారి ప్రాచీన దేవస్థానం ధర్మకర్తల ప్రమాణ స్వీకార మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పొలిట్ బ్యూరో సభ్యులు గళ్ళా మాధవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత దేవాలయ బ్రహ్మోత్సవాలకు హాజరై, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పదవుల కంటే ఇది ఒక పవిత్రమైన బాధ్యతగా భావించి, భగవంతుని సేవలో నిమగ్నమవ్వాలని ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి సూచించారు.ఈ కార్యక్రమంలో మొత్తం ఎనిమిది మంది సభ్యులు ధర్మకర్తలుగా ప్రమాణ స్వీకారం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ దేవస్థానం వైభవం, ప్రతిష్టను మరింతగా పెంచేందుకు సమిష్టిగా కృషి చేయాలని, మరిన్ని ధార్మిక కార్యక్రమాలు చేపట్టి భక్తులను ఆధ్యాత్మికత వైపు తీసుకురావాలని సూచించారు. తమ హయాంలో ఈ దేవాలయం మరింత అభివృద్ధి చెందేలా కృషి చేయాలని, దేవస్థానం అభివృద్ధి ద్వారా ప్రజలకు మరింత ఉపయోగపడేలా పనిచేయాలని తెలిపారు. స్వామివారి ఆశీస్సులు అందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరి కుటుంబాలకు శ్రేయస్సు కలగాలని ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి ఆకాంక్షించారు.

డ్రగ్స్ పై దండయాత్ర 2.0

తిరువూరు, ఏప్రిల్ 22, ప్రభాతవార్త : డ్రగ్స్ మరియు గంజాయి వంటి మత్తు పదార్థాల రహిత సమాజం నిర్మాణం కోసం ఎన్టీఆర్ పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు ఐ.పి.ఎస్ ఆదేశాల మేరకు డీసీపీ (రూరల్) కె.లక్ష్మీనారాయణ ఐ.పి.ఎస్ పర్యవేక్షణలో మైలవరం ఏసిపి వై.వి. ప్రసాదరావు సూచనలతో తిరువూరు ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో డ్రగ్స్ పై దండయాత్ర 2.0" కార్యక్రమాన్ని తిరువూరు సి.ఐ కె.గిరిబాబు నిర్వహించారు.ఈ సందర్భంగా తిరువూరు సర్కిల్ పరిధిలో 135 మంది అనుమానిత యువకులను పరీక్షలు నిర్వహించగా 32 మందికి గంజాయి పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది.ఈ కార్యక్రమంలో సి.ఐ కె.గిరిబాబు మాట్లాడుతూ యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి సేవించడం రవాణా చేయడం ఎన్‌డిపిఎస్ చట్టం ప్రకారం నేరమని, అలవాటుగా ఇలాంటి నేరాలకు పాల్పడితే పిఐటి ఎన్‌డిపిఎస్ చట్టం కింద ఏడాది వరకు జైలుశిక్షకు గురవుతారని హెచ్చరించారు. గంజాయి సేవించిన తర్వాత కెమికల్ టెస్ట్‌లో ఒక నెల వరకు గుర్తించగలమని తెలిపారు.అలాగే, రాత్రి సమయాల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారు, తరచూ గొడవలకు పాల్పడేవారు, అతివేగంగా వాహనాలు నడిపేవారు మరియు అనుమానితులపై గంజాయి పరీక్షలు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో తిరువూరు ఎస్.ఐ శాతకర్ణి, గంపలగూడెం ఎస్.ఐ జి.అనిల్, ఎ.కొండూరు ఎస్.ఐ జి.మహాలక్ష్ముడు, విస్సన్నపేట ఎస్.ఐ అర్జునరాజు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సహాయ సహకారములు అందించిన తిరువూరు చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కొత్తూరు గంగబాబు, డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ రామకోటేశ్వరరావు, డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ జయకృష్ణ'లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

మహాత్మా ఫూలే దంపతుల "సత్యశోధన"నాటకాన్ని విజయవంతం చేయండి

మంగళగిరి, ఏప్రిల్ 22, ప్రభాతవార్త : ఈనెల 26 ఆదివారం సాయంత్రం 6 గంటలకు,మంగళగిరితాడేపల్లి నగరంలోని వీటిజేఎం ఐవిటిఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో ప్రదర్శించే మహాత్మ జ్యోతిబా ఫూలే

సావిత్రిబాయి ఫూలేల జీవిత చరిత్రను తెలియజేసే"సత్యశోధన" నాటకాన్ని అన్ని వర్గాల ప్రజలు వీక్షించి విజయవంతం చేయాలని, ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు, మంగళగిరి నియోజకవర్గ ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ కంచర్ల కాశయ్య పిలుపునిచ్చారు. స్థానిక మంగళగిరి రాష్ట్ర కార్యాలయంలో బుధవారం సంబంధిత ఆహ్వాన పత్రికలను మీడియా సమావేశంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా కేసన మాట్లాడుతూ సామాజిక తత్వవేత్త, అణగారిన వర్గాల చైతన్య దీపిక,సంఘ సేవకులైన జ్యోతిబాపూలే దంపతులు పేదలు బడుగుల ముఖ్యంగా స్త్రీల విద్యా వ్యాప్తి ద్వారానే వారి సమగ్రా భివృద్ధి జరుగుతుందని భావించారన్నారు. పూణే లో ప్లేగు వ్యాధి ప్రబలినప్పుడు తమ భుజాలపై రోగుల్ని ఆసుపత్రులకు తీసుకెళ్లి వైద్య సేవలు అందింప చేశారన్నారు. అట్టి మహనీయ దంపతుల ఆశయాలు లక్ష్యాలను మనందరం పుణికి పుచ్చుకొని సమాజసేవకు పునరంకితమయ్యేందుకు ఫూలే దంపతుల జీవిత చరిత్రకు అద్దం పట్టే ఈ నాటకాన్ని ప్రతి ఒక్కరూ చూడాలన్నారు. అన్ని ఆధునిక హంగులతో ఈ నాటకాన్ని ప్రదర్శించబోతున్న హైదరాబాద్ అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ కళాకారుల్ని అభినందించారు.నగర ప్రజలందరూ ఈ నాటకాన్ని వీక్షించి విజయవంతం చేయాలని శంకరా రావు విజ్ఞప్తి చేశారు. మంగళగిరి నియోజకవర్గ ప్రజా సంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్ కంచర్ల కాశయ్య మాట్లాడుతూ ఫూలే ఆదర్శ దంపతుల జీవిత చరిత్రను కన్నుల పండుగగా దేశవ్యాప్తంగా కళాబృందం నాటకాన్ని ప్రదర్శిస్తుందని, తమ విజ్ఞప్తి మేరకు మన నగరంలో ప్రదర్శిస్తున్నారని, ఈ సదవకాశాన్ని నగర ప్రజలందరూ సద్వినియోగం చేసుకొని పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఇంకా ఈ మీడియా సమావేశంలో మంగళగిరి నియోజకవర్గ అధ్యక్షులు దోకిపర్తి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి మంగళగిరి ప్రసాద్, మంగళగిరి పట్టణ అధ్యక్షులు జొన్నాదుల వెంకటకృష్ణ, మహిళా అధ్యక్షురాలు జి జయలక్ష్మి, దానా గౌడ్, యువజన నాయకులు కంచర్ల క్రాంతి, ధనుంజయ రావు పలువురు బీసీ నాయకులు పాల్గొని ప్రసంగించారు.

చందు ఆంజనేయులుకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ పురస్కారం

విజయపురిసౌత్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త: ఏపీఆర్‌జేసీ విశ్రాంత ప్రిన్సిపల్ చందు ఆంజనేయులుకు ఆర్‌కే రంజిత్ ఫౌండేషన్, విశ్వ ఆర్ట్స్ వారి బుక్ ఆఫ్ రికార్డ్స్ పురస్కారాలు అందుకున్నారు. రచయితగా, ప్రేరణాత్మక, ఉపన్యాసకులు, నటుడు, కవి, సామాజిక సేవలకుగాను బుక్ ఆఫ్ రికార్డ్సు నిర్మాతలు రంజిత్‌కుమార్, బిక్కు నాయక్, గుర్రపు విజయకుమార్ చేతుల మీదుగా త్యాగరాయ గాన సభ చిక్కపల్లి హైదరాబాద్‌లో అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ జర్నలిస్టు గుర్రం విజయకుమార్, నిర్మాతలు, రంజిత్, బిక్కునాయక్, వసంతరాయలు, సినీనటి రేవతి, జయసుధ, రమ్యశ్రీ, శివాని, మధు, ప్రసన్నలు పాల్గొన్నారు.

వచ్చే విద్యా సంవత్సరం నుంచి కేంద్రీయ విద్యాలయ తరగతులు

మాచర్ల, ఏప్రిల్ 22 ప్రభాతవార్త: వచ్చే విద్యా సంవత్సరం నుంచి కేంద్రీయ విద్యాలయ తరగతులు ప్రారంభించనున్నట్లు తహశీల్దారు కిరణ్‌కుమార్ తెలిపారు. జిల్లా కలెక్టరు, గురజాల ఆర్డీవో ఆదేశాల మేరకు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను పరిశీలించారు. పాఠశాలలో కేంద్రీయ విద్యాలయ తరగతులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. టాయ్‌లెట్స్, తాగునీరు, విద్యుత్తు వంటి మౌలిక వసతులను పరిశీలించారు. తహశీల్దారు వెంట మాచర్ల మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, ఎంఈఓ, మున్సిపల్ డీఈఈ తదితరులు ఉన్నారు.

నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి పర్యటన

రొంపిచర్ల,ఏప్రిల్ 22 ప్రభాతవార్త : నియోజకవర్గంలో బుధవారం మాజీ ఎమ్మెల్యే, వైయస్సార్సీపి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పర్యటించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయనను వైయస్సార్సీపి రాష్ట్ర సోషల్ మీడియా ఆర్గనైజింగ్ అధ్యక్షులు దొడ్డ అంజిరెడ్డి, నాయకులు

మర్యాదపూర్వకంగా కలిశారు. డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డిని వారు ఘనంగా సత్కరించారు. అదేవిధంగా రొంపిచర్ల మండలంలోని మాచవరం గ్రామంలో చర్చి ప్రతిష్ట కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అందరికీ దేవుడైన యేసుక్రీస్తు పంచిన ప్రేమ, స్నేహం, కరుణ అనుసరించాలని కోరారు. కార్యక్రమంలో రొంపిచర్ల మండల పార్టీ అధ్యక్షులు కె.శ్రీనివాసరెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. మండలంలోని పార్టీ కార్యకర్త కుటుంబానికి చెందిన దుగ్గి అన్నమ్మ కనుమూయడంతో సమాచారం తెలుసుకొని ఆమె మృదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి తెలియజేశారు.

జనగణనపై అవగాహన ర్యాలీ

నూజెండ్ల,ఏప్రిల్22,ప్రభాతవార్త: మండలకేంద్రం నూజెండ్ల జెడ్పి పాఠశాలలో సెన్సస్ 2027 లో భాగంగా ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్ల మూడో బ్యాచ్‌కు శిక్షణా తరగతులు బుధవారం నిర్వహించారు. మొదటి సెషన్‌లోనే మాస్టర్ ట్రైనర్స్ బాలకృష్ణ,నాగేశ్వరరావులు స్వీయ గణనపై అవగాహన కల్పించారు. గ్రామంలో జనగణనపై అవగాహనా ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో జనగణన ప్రాధాన్యతను తెలుపుతూ నినాదాలు చేశారు. ముఖ్య అతిథులుగా మండల తహశీల్దార్ రమేష్,ఏఎస్ఓ నాగ శ్రీనివాసరావు పాల్గొన్నారు. జనగణనలో అందురూ పాల్గొనాలని జనగణన మనందరి బాధ్యత అని అన్నారు. అనంతరం ఇండ్ల గణనలో అడగాల్సిన ముప్పై మూడు ప్రశ్నలపై ఫీల్డ్ ట్రైనర్ ఘంటా నాగేశ్వరరావు వివరణ ఇస్తూ అవగాహన కల్పించారు. శిక్షణలోని ఎన్యూమరేటర్లుగా పాల్గొన్న వారిచే రివిజన్ నిర్వహించారు.

సాంఘిక సంక్షేమ వసతి గృహాలను సందర్శించిన సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్

నరసరావుపేట టౌన్ ఏప్రిల్ 22 ప్రభాతవార్త : రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ బి లావణ్య సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం, బాలుర వసతి గృహం 1 లను

బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె వసతి గృహాలను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. వసతిగృహాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. వసతి గృహాలలో కిచెన్ గార్డెన్ నిర్వహించాలన్నారు. మరమ్మత్తులలో నాణ్యత పాటించాలన్నారు. అదనపు గదులకు కావలసిన ప్రతిపాదనలను పంపించాలని సూచించారు. ప్రభుత్వం నిర్వహించే ఐ వి ఆర్ ఎస్ కాల్స్ లో వంద శాతం వచ్చేలా వసతి గృహ సంక్షేమ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సంక్షేమ మరియు సాధికారిక అధికారి ఈ. రాజేశ్వరమ్మ, ఏ ఎస్ డబ్ల్యూ ఓ సంతోష్ కుమార్, వసతి గృహ సంక్షేమ అధికారులు జయలక్ష్మి, శ్యామల, రామాంజనేయులు, వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ఫీజులతో ప్రైవేట్ కళాశాలలు ఆర్థిక సంక్షోభం

డిగ్రీ కళాశాలల మేనేజ్మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజి

మంగళగిరి ఏప్రిల్ 21, ప్రభాతవార్త : రాష్ట్రంలో ఫీజు రీయింబర్సుమెంట్ నిధుల విడుదలలో ఆలస్యం కారణంగా ప్రైవేట్ కళాశాలలు ఆర్థికంగా కుదేలవుతున్నాయని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల మేనేజ్మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు జె

రామాంజి తెలిపారు. మంగళగిరిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రధాన కార్యదర్శి జి రాజ్ కుమార్ చౌదరి, కోశాధికారి పి రాజశేఖర్, గౌరవ అధ్యక్షుడు సి విజయభాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా దాదాపు 90 శాతం ఫీజులు పెండింగ్‌లో ఉన్నాయని, దీనివల్ల అధ్యాపకులకు జీతాలు చెల్లించడం, యూనివర్సిటీ ఫీజులు చెల్లించడం కష్టంగా మారిందన్నారు. ప్రస్తుత ఫీజు నిర్మాణం అనుకూలంగా లేకపోవడం, సింగిల్ మేజర్ విధానం కారణంగా పీజీ సీట్లు ఖాళీగా మిగులుతున్నాయని ఆందోళన వ్యక్తం

చేశారు.ఫీజు రీయింబర్సుమెంట్ పథకాన్ని పునఃపరిశీలించి, కళాశాలలకు ఫీజులు వసూలు చేసుకునే స్వేచ్ఛ కల్పించాలని, పెండింగ్ ఫీజులను తక్షణమే విడుదల చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. భవిష్యత్తులో ఫీజు సబ్సిడీని నేరుగా విద్యార్థులకు అందించే విధానం అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

పెదవడ్లపూడిలో రూ. 6.11 లక్షల ఎల్ఓసి చెక్కులు పంపిణీ

మంగళగిరి, ఏప్రిల్ 22, ప్రభాతవార్త : మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామంలో ఎల్ఓసి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయాన్ని టిడిపి నాయకులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మంత్రి నారా లోకేష్ చొరవతో ఈ సహాయం అందించబడినట్లు నాయకులు తెలిపారు.బుధవారం గ్రామంలో మొత్తం రూ. 6,11,558 విలువైన చెక్కులను పంపిణీ

చేశారు. గ్రామానికి చెందిన అమ్ముల రంగారావుకు రూ. 5 లక్షలు, షేక్ జాన్ అహ్మద్‌కు రూ. 1,11,558 విలువైన చెక్కులను అందజేశారు..ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ, ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలబడటమే మా లక్ష్యం. మంత్రి నారా లోకేష్ ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలను గుర్తించి, తక్షణ సహాయం అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ఎల్ఓసి ద్వారా ఇలాంటి సహాయం అందించడం ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది," అని పేర్కొన్నారు.అదే విధంగా, "పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భారం తగ్గించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. అవసరమైన వారికి ఇలాంటి సహాయం నిరంతరం కొనసాగుతుంది," అని వారు తెలిపారు.చెక్కులు అందుకున్న లబ్ధిదారులు తమకు అవసరమైన సమయంలో సహాయం అందించినందుకు మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబదయ్య, మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్, నాయకులు కళ్లం రాజశేఖరరెడ్డి, మాదల రమేష్ బాబు, యేళ్ళ శివరామయ్య, జాలాది సందీప్, మహమ్మద్ కరిముల్లా, జవ్వాది సాంబశివరావు, గుంటుపల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయానికి మక్కెన రూ.10లక్షలు విరాళం అందజేత

వినుకొండ,ఏప్రిల్22,ప్రభాతవార్త: వినుకొండ కొండపై వేంచేసి ఉన్న శ్రీ గంగా పార్వతి సమేత రామలింగేశ్వర స్వామి వారి ఆలయ పునర్నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ మహత్కార్యానికి మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత

గుంటూరు డీసీసీబీ బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు విరాళం అందజేశారు. తన తండ్రి మక్కెన చిన్నరామయ్య జ్ఞాపకార్థం రూ. 10,11,116/ (పది లక్షల పదకొండు వేల నూట పదహారు రూపాయలు) చెక్కును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. భారీ విరాళం ఇచ్చిన మక్కెన మల్లికార్జునరావుకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. భక్తిభావంతో సాగుతున్న ఈ ఆలయ నిర్మాణానికి మక్కెన మల్లికార్జునరావు చేసిన ఆర్థిక సాయం పట్ల పుర ప్రజలు,భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు అచ్యుత కోటేశ్వరరావు,కార్యదర్శి భవనాసి శివ,రమేష్ బాబు, గాలి రమణారావు ,జవ్వాజి పూర్ణ,జెట్టి శ్రీనివాసరావు,కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జొన్నలగడ్డ ఎంపీపీ స్కూల్ వార్షికోత్సవం

నరసరావుపేట, ఏప్రిల్ 22 ప్రభాతవార్త :: మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (లీశిశిలీ) వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా న్యాయవాది చెన్నుపాటి నాగేశ్వరరావు పాఠశాలకు ఫర్నిచర్ బహుకరించారు. ఎమ్మెల్యే డాక్టర్ అరవింద బాబు చేతుల మీదుగా పాఠశాలకు టేబుళ్లు, బెంచీలు, కూలింగ్ వాటర్ క్యాన్లను పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున రావు ఆధ్వర్యంలో పాఠశాల అభివృద్ధి చెందిందని కొనియాడారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లపాటి రామచంద్ర ప్రసాద్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మన ఊరి బడి మన అందరి బాధ్యత

పెదనందిపాడు ఏప్రిల్ 22 (ప్రభాతవార్త) 2026 27 విద్యా సంవత్సరానికి బడి పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా పెదనందిపాడు కొత్తపాలెంలోని ఎంపీపీ ఎస్ పాఠశాల విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులు బుధవారం పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. మన ఊరి బడి మన అందరి బాధ్యత .ఉండాలి ఉండాలి పిల్లలందరూ బడిలో ఉండాలి. పిల్లల చదువు భవితకు వెలుగు. ప్రభుత్వ బడులు మన అందరికీ అందుబాటులో ఉంటాయి అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని కే అనిత. ఉపాధ్యాయులు పి రాజ్యలక్ష్మి .ఎం సీతారామమ్మ. ఏ సౌమ్య. ఎస్ కే దరియాబి. పి పూర్ణచంద్రరావు. ఎస్ పరిమళ తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌ఫలితాల్లో విశ్వసాయి కాలేజి సత్తా

వినుకొండ,ఏప్రిల్22,ప్రభాతవార్త: 2026 జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో పట్టణంలోని విశ్వసాయి కాలేజి విద్యార్థులు సత్తా చాటారు. కాలేజికి చెందిన విద్యార్థి షేక్ జాబీర్ జాతీయ స్థాయిలో 435వ ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ యడవల్లి శ్రీనివాస్ శర్మ,అధ్యాపక బృందం విద్యార్థులను అభినందించారు. తమ కాలేజి నందు అనుభవజ్ఞులైన అధ్యాపక బృందంచే క్రమశిక్షణతో కూడిన విద్య అందించడం జరుగుతుందని జాతీయ స్థాయి ర్యాంకులు సాధించడం ఆనందంగా ఉందని డైరెక్టర్ డాక్టర్ యడవల్లి శ్రీనివాస్ శర్మ పేర్కొన్నారు.

నాదెండ్ల భాస్కర్‌రావు మృతికి సంతాపం తెలిపిన జీ.వీ,మక్కెన

వినుకొండ,ఏప్రిల్22,ప్రభాతవార్త: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి,సీనియర్ రాజకీయ నాయకుడు నాదెండ్ల భాస్కర్ రావు (90),మృతి పట్ల ప్రభుత్వ చీఫ్‌విప్, సీనియర్ శాసనసభ్యులు జీ.వీ ఆంజనేయులు,డీసీసీబీ మక్కెన మల్లికార్జునరావులు సంతాపం తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని,కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

రెడ్డిపాలెం గ్రామంలో ఉచిత ఆయుష్ వైద్యశిబిరం

నూజెండ్ల,ఏప్రిల్22,ప్రభాతవార్త: మండలంలోని తలార్లపల్లి పంచాయితీ రెడ్డిపాలెం గ్రామంలో ఉచిత ఆయుష్ వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. ఆయుష్ వైద్యాధికారి మహదేవ్ శిబిరానికి హాజరైన ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో ఎక్కువగా మంచినీరు,మజ్జిగ,కొబ్బరినీరు సేవించాలన్నారు. ఎండలో ప్రయాణించేటప్పుడు తలకు టోపీ,తలపాగా,గొడుగును వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ సిబ్బంది గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

రూ.100కోట్లు మళ్ళింపుపై వైఎస్ఆర్‌సిపి అభ్యంతరం

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, ఏప్రిల్22, ప్రభాతవార్త: ఏఎన్‌యు నిధులు రూ.100 కోట్ల వరకు నిధులు ఏపీస్టేట్ ఫైనాన్షియల్ కార్పోరేషన్‌కు మళ్లించడంపై వైఎస్ఆర్‌సిపి విద్యార్థి విభాగం అభ్యంతరం వ్యక్తం చేసింది. బుధవారం విద్యార్థి సంఘం వర్సిటీ ఇన్‌చార్జ్ డా.పంతగాని రమేష్ ఒక ప్రకటన విడుదల చేశారు. అందులో ఆయన మాట్లాడుతూ వర్సిటీ ఉద్యోగులకు జీతాలు ఇచ్చేందుకు చేతుల రాని అధికారులు రూ.100కోట్లు డిపాజిట్ చేయడం సరికాదన్నారు. ఇన్‌చార్జులుగా ఉన్న అధికారులు తమ పదవులను కాపాడుకునేందుకు నిధులు మళ్ళిస్తున్నట్లు వాపోయారు. ఇది ఎంతవరకు సమంజసం అంటూ ప్రశ్నించారు. వర్సిటీలో 20 రోజులు దాటినా కూడా విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ ఇవ్వలేదని, ఉద్యోగులకు జీతాలు కూడా చెల్లించలేని స్థితిలో వర్సిటీ ఉందంటే అది ముమ్మాటికీ వర్సిటీ అధికారుల ఫెయిల్యూర్ అని అన్నారు. ఒ అధికారి పలు సందర్భాల్లో వర్సిటీలో ఫైనాన్షియల్ లిటరసీ లేదని దానిని గాడిలో పెట్టేచర్యలు తీసుకుంటామని ప్రకటించారని, ఇప్పుడు ఆ ఆలోచన ఎటుపోయిందన్నారు. గడిచిన 19 నెలలుగా వర్సిటీ పాలన, ఇన్‌చార్జ్‌ల పనితీరుపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ వ్యవస్థాపక ప్రముఖుడు రామిరెడ్డి వర్ధంతి సభ

-చిలకలూరిపేటలో నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు: గోడపత్రికను ఆవిష్కరించిన నేతలు

చిలకలూరిపేట, ఏప్రిల్ 22, ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ వ్యవస్థాపక సభ్యుల్లో ముఖ్యులు దాచూరి రామిరెడ్డి పదవ వర్ధంతి సభ పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో జరపాలని రాష్ట్ర కార్యవర్గం నిర్ణయించినదని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వి.వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్ తెలియజేసారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు వి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వ్యవస్థాపక

సభ్యులలో రామిరెడ్డి, అప్పారి వెంకటస్వామిముఖ్యులని ,రామిరెడ్డి పదవ వర్ధంతి సభ సందర్భంగా స్మారకోపన్యాసం చిలకలూరిపేటలో నిర్వహించడం చాలా గర్వకారణంగా భావిస్తున్నామని అన్నారు. చిలకలూరిపేట ప్రాంతం ఉపాధ్యాయ ఉద్యమానికి నాయకులను అందించినదని, ఉపాధ్యాయ ఉద్యమ పితామహుడు చెన్నుపాటి లక్ష్మయ్య వేలూరు నివాసి అని తెలిపారు. యుటిఎఫ్ ఆర్థిక అంశాల సాధన కోసం ఉద్యమాలు చేయడంతో పాటు, ఊరు బడిని కాపాడుకుందాం, ఎన్రోల్మెంట్ డ్రైవ్ పిలుపునివ్వడం, సంఘ కార్యక్రమాలు, ఉపాధ్యాయులు ప్రతి గ్రామంలో, వార్డులో పిల్లల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యతను వివరించి ప్రభుత్వ పాఠశాలలలో వారి పిల్లలను చేర్పే విధంగా కృషి చేయడం అభినందనీయమని అన్నారు. ప్రతి ఒక్కరు ఊరిలోని బడిని కాపాడుకుందాం.. కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ రామిరెడ్డి ఎప్పుడూ పిల్లలు ఉంటేనే బడి, బడి ఉంటేనే ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉంటేనే సంఘం అని చెబుతు ఉండేవారని, ఈ వర్ధంతి సభ సందర్భంగా స్థానికంగా ఎక్కువ మంది ఉపాధ్యాయులను సమీకరించాలని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకత్వం మే 2 తేదీన జరిగే పదవ వర్ధంతి సభ గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ టిఎస్ఎన్ మల్లేశ్వరరావు, రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం హనుమంతరావు , పల్నాడు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె. శ్రీనివాస్ రెడ్డి, ఎం మోహనరావు, జిల్లా కార్యదర్శులు కె. తిరుపతి స్వామి, ఎం. రామాంజనేయులు , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి.సుందరరావు, చిలకలూరిపేట ప్రాంతీయ శాఖల ముఖ్య బాధ్యులు డి.సుజాత, షేక్ఎండి యాసిన్, ఇంటూరి సునీత, వి.నాగమల్లేశ్వరరావు, టి. సుధాకర హరిప్రసాద్, జె.పార్థసారథి, కె.ఉమా మహేశ్వరరావు,టి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సర్వీసు నిబంధనల పట్ల అవగాహన పెంచుకోవాలి

-యుటిఎఫ్ పాకెట్ డైరీని ఆవిష్కరించిన సత్తెనపల్లి ఎంఇఓ శ్రీనివాసరావు

సత్తెనపల్లి, ఏప్రిల్ 22, ప్రభాతవార్త: ఉపాధ్యాయులు సర్వీస్ నిబంధనల పట్ల అవగాహన పెంచుకోవాలని సత్తెనపల్లి మండల విద్యాశాఖ అధికారి అనంతవరం శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు యుటిఎఫ్ సత్తెనపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన పాకెట్ డైరీ ని బుధవారం స్థానిక ఎంఈఓ కార్యాలయం ఆవరణలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హక్కులు, బాధ్యతలు రెండు నేత్రాలుగా భావించి పనిచేయాలని ఆయన ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. పుస్తకం చిన్నదైనప్పటికీ ఉపాధ్యాయుల సర్వీస్ నిబంధనలు గుది గుచ్చినం ముదావహమని ఆయన పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సర్వీసు నిబంధనలను సరళమైన భాషలో అందరికీ అర్థమయ్యే రీతిలో ఈ చిన్న పాకెట్ డైరీలో రూపొందించిన సత్తెనపల్లి యుటిఎఫ్ బాధ్యులను ఆయన అభినందించారు. భవిష్యత్తులో కూడా ఉపాధ్యాయులకు ఉపయోగపడే ఇటువంటి కార్యక్రమాలను యుటిఎఫ్ చేపట్టాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం యుటిఎఫ్ పాకెట్ డైరీలను ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి చిన్నం శ్రీనివాసరావు, జి.విజయ కమల, రాష్ట్ర కౌన్సిలర్ టి.శేషగిరి, ఆడిట్ కమిటీ సభ్యులు డి.కిషోర్

కుమార్,మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.రమేష్ బాబు, ఎన్.విష్ణు, సీనియర్ నాయకులు నర్రా వెంకటరావు, పి వెంకటేశ్వర్లు,కె నరసింహారావు, ఎస్వి శేషురెడ్డి, కె ఆనందరావు, వై శ్రీనివాసరావు, మహిళా నాయకులు ఎస్. పద్మావతి, కె.శివలక్ష్మి ఎస్,వాసవి, కన్యక, బివి అనంతలక్ష్మి,కె.అనూష, కె.కోటేశ్వరరావు,ఎం శ్రీనివాస్ రెడ్డి, కె అనురాధ,ఎం భద్రయ్య, కె.నాగమల్లేశ్వరరావు, కె అయ్యప్ప, ఎస్కె గౌస్, సిహెచ్ శివారెడ్డి, కె.రాంబాబు, ఎం.రవిచంద్ర,ఎ.సురేష్, కె ప్రేమ్ కుమార్, ఎ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాకెట్ డైరీ ముద్రణకు సహకారం అందించిన కె.రాజేశ్వరరావు ను ఉపాధ్యాయులు సత్కరించారు.

అంకమ్మతల్లి తిరునాళ్లలో వైద్యశిబిరం

రాజుపాలెం, ఏప్రిల్ 22, ప్రభాతవార్త: రాజుపాలెం మండలం అంకమ్మ తల్లి తిరుణాల్లో ప్రాంతీయ ఉపాసంచాలకులు ఎం.శేఖర్ రాజుఆదేశానుసారం సీజనల్ వ్యాధులు, ఆరోగ్యం పైన అవగాహన సదస్సు మరియు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆర్ శ్రీనివాస్, డాక్టర్ కాంచన, డాక్టర్ స్వర్ణలత ఆధ్వర్యంలో జరిగింది. ఆరోగ్యంపై అందరూ అవగాహన కలిగి ఉండాలని వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రత వాటి ప్రాముఖ్యత గురించి తెలియపరిచారు. వేసవి కాలంలో వృద్ధులు గర్భిణీ స్త్రీలు పిల్లలు వడదెబ్బ, నీరసం నుంచి తప్పించుకోవడానికి ప్రతిరోజూ 34లీటర్ల నీరు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ, పండ్ల రసాలు తీసుకోవాలి. ఎండలో వెళ్లేటప్పుడు రుమాలు చున్నీ టోపీ గొడుగు కాటన్ దుస్తులు, సన్స్క్రీన్ లోషన్ వాడాలన్నారు. ఉదయము 10 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య బయటకు వెళ్లకపోవడం ఉత్తమం అని తెలిపారు పుచ్చకాయ, దోసకాయ వంటి నీటి శాతం ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం ద్వారా శరీరాన్ని చల్లగా ఉంచుకోవచ్చు. అని తెలియపరచి అక్కడికి వచ్చిన భక్తులకు దీర్ఘకాలిక వ్యాధులకు తరు వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మండల అధ్యక్షులు తోట నరసయ్య హాజరై మందుల పంపిణీ చేశారను. సుమారుగా 363 మంది మందికి ఆయుష్ మందులను అందించినట్టు డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు వడదెబ్బ నివారణ పోస్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ జీవన్ ,ఎంఎల్ హెచపి ఏఎన్ఎం, ఆశ, ఆయుష్ సిబ్బంది లక్ష్మీనారాయణ, వెంకటరామయ్య, కోటేశ్వరమ్మ, హనుమంతరావు నాయక్, వెంకటరమణ, లక్ష్మీనారాయణ కాంపౌండర్, ఆయుష్ సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు .

మహిళ గోప్యతకు భంగం కలిగించి కేసులో ఐదుగురు నిందితులకు 3 సంవత్సరాలు జైలు శిక్ష

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 22, ప్రభాతవార్త : వ్యక్తిపై దాడి చేసి, మహిళల గోప్యతకు భంగం కలిగించి, బెదిరించిన కేసులో ఐదుగురు నిందితులకు ఒక్కొక్కరికి మూడు సంవత్సరాల జైలు శిక్షలు మరియు రూ.10 వేల జరిమానాలు గుంటూరు పీజేసీజే కోర్టు బుధవారం విధించింది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన క్రైమ్ నం.76/2022, యు/ఎస్ 326, 506, 354(సీ) ఆర్ /డబ్ల్యు 34 ఐపీసీ కేసులో శిక్షలు విధించారు. 2019 మే 7వ తేదీన మధ్యాహ్నం సుమారు 12:00 గంటల సమయంలో, కొర్నెపాడు గ్రామానికి చెందిన బాధితుడి కుటుంబానికి చెందిన మహిళలు స్నానం చేస్తుండగా, అదే గ్రామానికి చెందిన మంచాల సునీల్ (ఏ1) తొంగిచూసి వీడియోలు తీస్తున్నాడని,దీనిపై ప్రశ్నించడంతో ఆ విషయాన్ని మనసులో పెట్టుకొని, అదేరోజు బాధితుడు ఇంటికి వస్తున్న సమయంలో ఏ1నుంచి ఏ5 వరకు ఉన్న నిందితులు మంచాల సునీల్, యేసు రత్నం, కిరణ్, శ్రీను, భాగ్యమ్మలు కలిసి ఫిర్యాదిపై దాడిచేసి, చెక్కతో చేతిపై మరియు రాడుతో కాళ్లపై కొట్టడంతో గాయాలైయాయి.ఈ ఘటనకు సంబంధించి 2019 మే 8వ తేదీన బాధితుడి ఫిర్యాదు మేరకు క్రైమ్ నం.76/2022, వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసును అప్పటి పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ డి. వినోద్ కుమార్ దర్యాప్తుచేసి చార్జ్ షీట్ దాఖలు చేశారు. ప్రస్తుత పోలీసులు తదుపరి చర్యలు తీసుకుని కోర్టుకు తగిన సా ధారాలను సమర్పించగా సీసీ నెం1894/2019 గా గుంటూరు పీజేసీజే కోర్టులో విచారణ కొనసాగి బుధవారం తీర్పు వెలువడిందన్నారు. బాధితుల తరపున ఏపిపి మురళీ కృష్ణ వాదనలు వినిపించగా, కేసు వాదోపవాదనలకు తగిన సహకారం కోర్టు కానిస్టేబుల్ ఏటుకూరి ప్రకాష్ బాబు అందించగా, సీఎంస్, డిసిఆర్బి గుంటూరు ఇన్స్పెక్టర్ ఆర్.ధర్మేంద్ర బాబు పర్యవేక్షించారు.మహిళల గోప్యతకు భంగం కలిగించే చర్యలు, వేధింపులు, హింసకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ హెచ్చరిం చారు .ఎవరైనా ఇటువంటి చర్యలకు పాల్పడితే వెంటనే పోలీస్ వారికి తెలియపరచాలని సూచించారు.

మహిళను బెదిరించిన కేసులో నిందితుడికి జైలుశిక్ష

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 22, ప్రభాతవార్త : మహిళను బెదిరించి, అవమానకరంగా ప్రవర్తించిన కేసులో నిందితుడికి రెండు సెక్షన్ల కింద ఒక్కో సంవత్సరం జైలు శిక్ష పాటు రూ.10 వేల జరిమానా విధించారు. ప్రత్తిపాడు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన క్రైమ్ నెంబర్ 230/2023 కేసులో నిందితుడికి గౌరవ న్యాయస్థానం శిక్ష విధించిందన్నారు. 2023 అక్టోబర్ 11వ తేదీ రాత్రి గం.10:30ని.ల సమయంలో ప్రత్తిపాడు గ్రామంలో బాధితురాలు బిల్లా తిరుపతమ్మ, మహిళల వద్దకు నిందితుడు కమ్మ శివ ప్రసాద్ వచ్చి అసభ్య పదజాలంతో దూషిస్తూ, ఫోటోలు మరియు వీడియోలు తీసి, భయపెట్టి తీవ్ర పరిణామాలు ఉంటాయని బెదిరించాడు. మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మేరకు 2023 అక్టోబర్ 12వ తేదీన 230/2023 నెంబర్తో స్థానిక పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.ఈ కేసును అప్పటి ఎస్ఐ డి.రవీంద్ర బాబు దర్యాప్తు చేసి, న్యాయస్థానంలో ఛార్జ్ షీట్ దాఖలు చేశారని చెప్పారు. కేసు పూర్వపరాలాలు విచారించి గుంటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బుధవారం తీర్పు వెలువరించిన్నట్లు వెల్లడించారు .ఐపీసీ సెక్షన్ 506 కింద సంవత్సరం కఠిన కారాగార శిక్ష మరియు రూ.10వేలు జరిమానా, అది చెల్లించని పక్షంలో మరో రెండు నెలలు సాధారణ కారాగార శిక్ష. ఐపీసీ సెక్షన్ 509 కింద సంవత్సరం సాధారణ కారాగార శిక్ష మరియు రూ.10వేలు జరిమానా, చెల్లించని పక్షంలో 2 నెలలు సాధారణ కారాగార శిక్ష విధించినట్లు తెలిపారు. ఈ కేసులో దర్యాప్తు అధికారిగా ఎస్సై డి.రవీంద్రబాబు వ్యవహరించక ఏపిపి మురళీకృష్ణ కేసును వాదించి ఆధారాలతో న్యాయమూర్తి వద్ద నిరూపించారు దేనితో న్యాయమూర్తి దీప్తి నిందితుడికి శిక్ష పడే విధంగా తీర్పు ఇవ్వడం జరిగిందన్నారు.మహిళలపై వేధింపులు, బెదిరింపులు వంటి నేరాలకు కఠిన చర్యలు తీసుకుంటామని, ఇలాంటి ఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని స్థానిక పోలీసులు కోరారు.

దివంగత మాజీ సీఎం నాదెండ్ల భాస్కరరావు మృతి తెలుగు రాష్ట్రాలకు తీరని లోటు

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 22, ప్రభాతవార్త : గుంటూరు జిల్లాలో జన్మించి రాజకీయాల్లో అంచలంచలుగా ఎదుగుతూ విజయవాడ తూర్పు శాసన సభ్యులుగా, క్యాబినెట్ మంత్రిగా, ఖమ్మం పార్లమెంటు సభ్యులుగా, కొద్దికాలం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా సేవలందించిన బహుప్రముఖ ప్రజ్ఞాశాలి, మంచి వక్త, రాజకీయ భీష్ముడు నాదెండ్ల భాస్కరరావు మృతి తెలుగు రాష్ట్రాలకు తీరనిలోటని జనసేన పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పు వెంకట రత్తయ్య, 18వ డివిజన్ మాజీ కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ బుధవారం ఓ ప్రకటనలో తెలియజేశారు.

ఈ విషాద సమయంలో నాదెండ్ల భాస్కరరావు ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని కోరుకుంటూ, అయన కుమారుడు, జనసేన పార్టీ పీఏసీ ఛైర్మన్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్ కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నట్లు వెల్లడించారు.

భూముల రీసర్వేను పకడ్బందీగా నిర్వహించండి: నల్లమోతు హరిబాబు

నాదెండ్ల, ఏప్రిల్ 22, ప్రభాతవార్త: గ్రామంలో త్వరలో చేపట్టనున్న భూముల రీసర్వే ప్రక్రియలో రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సమర్థవంతంగా నిర్వహించాలని నాదెండ్ల సొసైటీ అధ్యక్షులు నల్లమోతు హరిబాబు రెవిన్యూ అధికారులను కోరారు. ఇప్పటికే గ్రామంలో రీసర్వే ప్రక్రియ చాలా ఆలస్యమైనదని, ఇకనైనా ప్రక్రియను మొదలుపెట్టి రైతులకు ఆమోదయోగ్యమైన విధంగా రీసర్వే నిర్వహించాలని ఆయన వారికి విజ్ఞప్తి చేశారు. మండల కేంద్రం నాదెండ్లలో బుధవారం జరిగిన రెవిన్యూ రీసర్వే గ్రామ సభలో ఆయన రైతుల పక్షాన పాల్గొని వారి సమస్యలను రెవిన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్ళారు. ఇంతకు ముందు రీసర్వే జరిగిన గ్రామాల్లో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అలాంటి సమస్యలు నాదెండ్లలో పునరావృతం కాకుండా జాగ్రతలు వహించాలని కోరారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా రీసర్వే ప్రక్రియను చేపడతామని డిప్యూటీ తహశీల్దార్ షేక్ సల్మాన్ ఈ సందర్భంగా రైతులకు వివరించారు. రైతులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సవివరంగా సమాధానాలు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ రాంబాబు, నాదెండ్ల విఆర్వోలు షేక్ అబ్దుల్ భాషా, ఈర్ల గోపి కృష్ణ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

హిందూ ఫార్మసీ కళాశాలలో మెడికల్ కోడింగ్ పై అవగాహన సదస్సు

గుంటూరు విద్య ఏప్రిల్ 22 ప్రభాతవార్త : స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో మెడికల్ కోడింగ్ పై అవగాహనా సదస్సు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం తెలిపారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ లోని ప్రముఖ మెడికల్ కోడింగ్ సంస్థ మేడ్వాజ్వ్ ఇన్స్టిట్యూట్ ప్రైవేట్ లిమిటెడ్ అధిపతి సీపీసీ సర్టిఫైడ్ కోడర్ కొమర శివాజీ ముఖ్య అతిథి గా విచ్చేసి మెడికల్ కోడింగ్ లోని వివిధ విభాగాలు, ఉపాధి అవకాశాలు పదోన్నతుల వివరాలను గురించి విద్యార్థులకు పవర్ పాయింట్ ద్వారా తెలియ చేశారు. బి. ఫార్మసీ లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు మెడికల్ కోడింగ్ సంస్థలలో ఉపాధి పొందిన వారికి ప్రారంభ దశ లో 20 నుంచి 25 వేల రూపాయల నెలసరి వేతనం ఉంటుందని తర్వాత సీనియర్ కోడర్ గా క్వాలిటీ అనలిస్ట్ గా, మేనేజర్ గా పదోన్నతులు పొందవచ్చునని అన్నారు. మెడికల్ కోడింగ్ లో 56 సంవత్సరాల తరువాత నెలకు లక్ష రూపాయల వేతనం పొందటానికి అవకాశాలు ఉన్నాయని తెలియచేసారు. భవిష్యత్తు లో మరికొన్ని బహుళ జాతి మెడికల్ కోడింగ్ సంస్థలు హైదరాబాద్, చెన్నై, బెంగళూరు లాంటి పట్టణాలలో వస్తాయని అలాంటి సంస్థలలో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయి అన్నారు. ఈ కార్యక్రమంలో మెడ్వాజ్వ్ బిజినెస్ మేనేజర్ గోపదేవ్, కళాశాల ఫార్మాడి డైరెక్టర్ డాక్టర్ పి. సీతారామయ్య, అధ్యాపకులు శ్రీ సి.హెచ్. ప్రసాద రావు, డాక్టర్ కె.సుమతి, డాక్టర్ పి. జవహర్ బాబు, బి.ఫార్మసీ మూడవ, నాలుగవ సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు.

నాదెండ్ల భాస్కరరావు మృతి తీరనిలోటు : రాధాకృష్ణ సంతాపం

చిలకలూరిపేట, ఏప్రిల్ 22, ప్రభాతవార్త: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు మరణం పట్ల చిలకలూరిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి ఎం. రాధాకృష్ణ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నాదెండ్లతో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.రాజకీయ గురువును కోల్పోయానని పేర్కొన్నారు.1989 ఎన్నికల్లో నాదెండ్ల భాస్కరరావు పోటీ చేసినప్పటి నుండి తమ మధ్య చిరకాల పరిచయం ఉందని తెలిపారు. నాదెండ్ల ఎన్నికల్లో పోటీ చేసిన సమయంలో తాను ప్రచార బాధ్యతలను ముందుండి నిర్వహించానని, ఆ రోజు నుంచి ఆయన తనకు రాజకీయ గురువుగా మార్గనిర్దేశం చేశారని పేర్కొన్నారు. నా వ్యక్తిగత, రాజకీయ ఉన్నతికి నాదెండ్ల భాస్కరరావు ఎంతో కృషి చేశారని తెలిపారు. ఆయన కేవలం ఒక నాయకుడిగానే కాకుండా, నా ఎదుగుదలలో కీలక పాత్ర పోషించిన వ్యక్తి అన్నారు ఆయన లేకపోవడం వ్యక్తిగతంగా తనకు, రాష్ట్ర రాజకీయాలకు తీరని లోటని రాధాకృష్ణ అన్నారు.నాదెండ్ల భాస్కరరావు మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని రాధాకృష్ణ ప్రార్థించారు.

ఈశాన్య ప్రసన్నాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

చిలకలూరిపేట, ఏప్రిల్ 22, ప్రభాతవార్త: చిలకలూరిపేట పట్టణంలోని రజక కాలనీలోని శ్రీ ఈశాన్య ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం 11వ వార్షిక మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

స్కేటింగ్ పోటీలో విజేత చైత్రదీపకను అభినందించిన కమీషనర్ ధ్యానచంద్ర

విజయవాడ కార్పొరేషన్,ఏప్రిల్ 22,ప్రభాతవార్త రాష్ట్ర,జాతీయ, అంతర్జాతీయ స్థాయి ఆర్టిస్టిక్ పోటీల్లో ఎన్నో పతకాలను సాధించిన చైత్రదీపకను మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర బుధవారం ప్రధాన కార్యాలయం లోని తన ఛాంబర్ లో అభినందించారు.తైవాన్ లో ఈ నెల 11

నుండి 19వ తేదీ వరకు జరిగిన 2026 తైవాన్ ఆర్టిస్టిక్ రోలర్ స్కేటింగ్ ఓపెన్ కాంపిటీషన్స్ లో చైత్రదీపిక మన దేశం తరపున పాల్గొని, మెరుగైన ప్రతిభను చూపి యూత్ కేటగిరిలో ఇన్లైన్ డాన్స్ ఈవెంట్ లో రజత పతకం,సోలో డాన్స్ ఈవెంట్లో కాంస్య పతకం,క్యాడెట్ కేటగిరిలో గ్రూప్ ఈవెంట్లో రజత పతకాలు సాధించి వరుసగా నాల్గోసారి అంతర్జాతీయ స్థాయిలో తన అద్భుతమైన క్రీడా ప్రతిభతో దేశానికి విశేషమైన గౌరవాన్ని తీసుకొచ్చింది. ఆమె ఈ విజయాలతో 61 పతకాలను సాధించి తన ప్రతిభ చాటుకుంది. భారతదేశం తరఫున స్కేటింగ్లో ఆరు దేశాలు(జపాన్,కొరియా, యుక్రెయిన్,ఆస్ట్రేలియా,నబీబియా,నైజీరియా) ధీటైన పోటీ ఇచ్చి మూడు పతకాలు సాధించి దేశానికి ఎంతో పేరు తీసుకొచ్చింది. గత 2023,23లలో చైనా,తైవాన్,ఆస్ట్రేలియా లలో జరిగిన 19వ ఆసియన్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్షిప్(వరల్డ్ స్కేటింగ్ అసోసియేషన్),తైవాన్ ఆర్టిస్టిక్ రోలర్ స్కేటింగ్ ఓపెన్ కాంపిటీషన్స్,వరల్డ్ స్కేట్ పసిఫిక్ కప్ లలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఆమె పలు విభాగాల్లో ఏడు బంగారు పతకాలను గెలుచుకొని అంతర్జాతీయ స్థాయిలో దేశానికి విశేషమైన గౌరవాన్ని తీసుకొచ్చింది. దేశానికి,రాష్ట్రానికి,జిల్లాకు క్రీడా ఖ్యాతిని,ప్రపంచానికి చాటించింది.చైత్రదీపికనేడ పలువురు అధికారులు,ప్రజాప్రతినిధులు,క్రీడా అభిమానులు,స్నేహితులు,ప్రవాసాంధ్రులు,కుటుంబ సభ్యులు ఆమెను అభినందించారు. టీం ఇండియా రోలర్ స్కేటింగ్ కోచ్ పి.సత్యనారాయణ ప్రత్యేకంగా పలువురు అధికారులు,ప్రజాప్రతినిధులు,క్రీడా అభిమానులు, స్నేహితులు,ప్రవాసాంధ్రులు అభినందించారు.అంతర్జాతీయ ఐస్ స్కేటర్ చైత్రదీపిక ఐస్ స్కేటింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నిర్వహిస్తున్న జాతీయ ఐస్ స్కేటింగ్ శిబిరానికి ఎంపికయ్యింది.ఈ ప్రతిష్ఠాత్మక శిక్షణా శిబిరం ఈ నెల 26 నుండి మే 9 వరకు డెహ్రాడూన్ లోని మహారాణా ప్రతాప్ స్పోర్ట్స్ కళాశాలలో నిర్వహించనున్నారు.ఈ సందర్భాన్ని పురస్కరించుకొని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్రను ఆయన కార్యాలయంలో ఆమె మర్యాదపూర్వకంగా కలిసింది. రానున్న రోజుల్లో మరిన్ని అంతర్జాతీయ పతకాలు సాధించి దేశానికి,రాష్ట్రానికి,జిల్లాకు,విజయవాడ క్రీడా ఖ్యాతిని ప్రపంచానికి చాటాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

చిలకలూరిపేటలో ట్రాఫిక్ ఉల్లంఘనల పై పోలీసులు ఉక్కుపాదం

చిలకలూరిపేట, ఏప్రిల్ 22, ప్రభాతవార్త: పట్టణ నడిబొడ్డున ఉన్న అత్యంత రద్దీ ప్రాంతం గడియారం స్తంభం సెంటర్లో స్థానిక పోలీసు మరియు ట్రాఫిక్ విభాగం సంయుక్తంగా ముమ్మర వాహన తనిఖీలు చేపట్టారు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలను అరికట్టడమే లక్ష్యంగా చేపట్టిన ఈ స్పెషల్ డ్రైవ్ పట్టణంలో ప్రధాన ఆకర్షణగా నిలిచింది.

తనిఖీల్లో పాల్గొన్న అధికారులు:

ఈ కార్యక్రమం ఎస్ఐ చెన్నకేశవులు, ట్రాఫిక్ ఏఎస్ఐ ప్రసాద్, మరియు ఎస్ఐ హజరత్తయ్య పర్యవేక్షణలో కట్టుదిట్టంగా జరిగింది. సిబ్బంది ప్రతి ద్విచక్ర వాహనాన్ని ఆపి పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు.

పోలీసులు స్పష్టం చేసిన తప్పనిసరి నిబంధనలు ఇవే:

వాహనదారులు రోడ్డెక్కాలంటే విధిగా కింది వాటిని కలిగి ఉండాలని అధికారులు స్పష్టం చేశారు

హెల్మెట్: ద్విచక్ర వాహనదారులకు ఇది ప్రాణరక్షకం. డ్రైవ్ చేసే వ్యక్తితో పాటు వెనుక కూర్చున్న వారు కూడా వాడటం ఉత్తమం.

ఇన్సూరెన్స్ (బీమా): ఊహించని ప్రమాదం జరిగినప్పుడు మీకు, ఎదుటి వారికి ఆర్థిక భద్రత కోసం ఇది అత్యవసరం. పొల్యూషన్ సర్టిఫికెట్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా కాలుష్య నియంత్రణ పత్రం ప్రతి వాహనానికీ తప్పనిసరి. సరైన వాహన పత్రాలు: డ్రైవింగ్ లైసెన్స్, మరియు ఆర్సీ కాపీ ఎల్లప్పుడూ వాహనదారుల వద్ద ఉండాలి. సరైన పత్రాలు లేని వారికి, నిబంధనలు ఉల్లంఘించిన వారికి అధికారులు అక్కడికక్కడే ఈచలానాలు విధించారు. పైన పేర్కొన్న వాటిలో ఏ ఒక్కటి లోపించినా చట్టపరమైన చర్యలు తప్పవని, ఫైన్ కట్టాల్సి వస్తుందని తీవ్రంగా హెచ్చరించారు.

జరిమానా మాత్రమే కాదు.. కనువిప్పు కలిగించేలా అవగాహన:

ఈ తనిఖీల సమయంలో పోలీసు అధికారులు కేవలం చలానాలు విధించి చేతులు దులుపుకోలేదు. ప్రయాణికుల భద్రతే తమ ప్రథమ ప్రాధాన్యతగా భావించి, ప్రతి వాహనదారుడికి రోడ్డు భద్రతపై కౌన్సెలింగ్ ఇచ్చారు. ట్రాఫిక్ నియమాలు పాటించడం వల్ల కలిగే లాభాలను, నిర్లక్ష్యం వల్ల జరిగే ప్రమాదాలు కుటుంబాలను ఎలా చిన్నాభిన్నం చేస్తాయో వివరించి వారిలో బాధ్యతను పెంచే ప్రయత్నం చేశారు."ట్రాఫిక్ నిబంధనలు మీ ప్రాణాలను కాపాడేందుకే కానీ, మిమ్మల్ని ఇబ్బంది పెట్టేందుకు కాదు. మీ కోసం మీ ఇంట్లో మీ కుటుంబం ఎదురుచూస్తుంటుంది అన్న విషయాన్ని మర్చిపోకండి. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతమైన పౌరులుగా రూల్స్ పాటిస్తూ పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

గణపవరంలో కార్మికుడి ఆత్మహత్య

చిలకలూరిపేట, ఏప్రిల్ 22, ప్రభాతవార్త: గణపవరంలో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం ఉదయం చోటుచేసుకుంది. ప్రాథమిక సమాచారం ప్రకారం ఒరిస్సాకు చెందిన నిదానిధర్ దాస్ (46) కుటుంబంతో కలిసి గణపవరంలో నివాసం ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో నేటి ఉదయం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ కలహాలే ఆత్మహత్యకు దారితీసినట్లు తెలుస్తుంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మృతిని కుటుంబీకులు

ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న నాదెండ్ల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

24న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

సత్తెనపల్లి, ఏప్రిల్ 22, ప్రభాతవార్త: సత్తెనపల్లి మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 24న శుక్రవారంఉదయం 11 గంటలకు జరుగుతుందని ఎమ్డీఓ తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగే సమావేశం మండల పరిషత్ అధ్యక్షుని అధ్యక్షత జరుగుతుందని, ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు తప్పక హాజరు కావాలని కోరారు. అందరు మండల స్థాయి అధికారులు వారి శాఖలకు సంబంధించి పూర్తి మాచరారంతో సర్వసభ్య సమావేశానికి తప్పక హాజరు కావాలని కోరారు.

నేటితరం న్యాయవాదులకు పొట్ల సుబ్బారావు ఆదర్శం

సత్తెనపల్లి, ఏప్రిల్ 22, ప్రభాతవార్త: స్థానిక సత్తెనపల్లి బార్ అసోసియేషన్ హాల్లో బుధవారం సత్తెనపల్లి లో సీనియర్ న్యాయవాది పొట్ల సుబ్బారావు 7వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

సత్తెనపల్లి బార్ అసోసియేషన్లో అనేకమంది పొట్ల సుబ్బారావు వద్ద జూనియర్ న్యాయవాదులు గా పనిచేసి వృత్తిలో మెలుకువలు ఆయన వద్ద నేర్చుకొని నేడు న్యాయవాద వృత్తిలో ఉన్నత స్థానంలో ఉన్నారని అన్నారు. పొట్ల సుబ్బారావు కక్షిదారులు కోసం వారికి సకాలంలో న్యాయం అందే దాకా శ్రమించే వారని వక్తలు పేర్కొన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగూరి అజయ్ కుమార్, దాసరి జ్యాన్ రాజ్ పాల్, బి.ఎల్.చిన్నయ్య, చావా బాబురావు, గుజ్జర్లపూడి మార్క్ రావు, పి. సి. హెచ్ వెంకటకోటయ్య, అనుమోలు జయరాం, కన్నెధార హనుమయ్య, దివ్వెల శ్రీనివాసరావు, సయ్యద్ అబ్దుల్ రహీమ్, పూదోట రాజు, సబ్కోర్టు ఏపిపి కొల్లా వెంకటేశ్వరరావు, మద్దినేని చలపతిరావు, షేక్ జానీ ఖాజావలి, చవల బాలకోటయ్య, రాజశేఖరుని గోపాలకృష్ణమూర్తి, బగ్గి నరసింహారావు, షేక్ బాలి షేదా, రాజవరపు నరసింహారావు, గంపా మదన్ మోహన్, పాటిబండ్ల రవికుమార్,యేసురత్నం, అమర్ నాయక్,చొప్పా సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రధాత ఎమ్మెల్యే యరపతినేని ఆర్థికసాయం

గురజాల, ఏప్రిల్ 22 ప్రభాతవార్త : నిన్నా మొన్నటి వరకు ఆపసోపాలు పడిన గురజాల ప్రభుత్వ వైద్యశాల ఎట్టకేలకు అభివృద్ధి బాట పట్టింది.. గురజాల నియోజకవర్గ ప్రజలు అభివృద్ధి ప్రధాతగా పిలుచుకునే శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు తన సొంత నిధులను వెచ్చిస్తూ ఆసుపత్రిని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తున్నారు.. ఇటీవల ప్రభుత్వ వైద్యశాలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే యరపతినేని

అక్కడి వసతులను చూసి చలించిపోయారు.. నియోజకవర్గ పేద ప్రజలకు కార్పోరేట్ హాస్పిటల్కు ధీటుగా మెరుగైన వైద్య సేవలందించాలని సంకల్పించారు..

మెరుగైన వసతులు : ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తన సంకల్పానికి రూపాన్ని ఇచ్చారు. ప్రస్తుతం గురజాల ప్రభుత్వ వైద్యశాల కార్పోరేట్ హాస్పిటల్ ధీటుగా రూపుదిద్దుకుంది. ఆసుపత్రిలో నూతనంతా ఓపీ గదిని నిర్మించారు. ఎమ్మెల్యే యరపతినేని తన సొంత ఖర్చుతో ఆసుపత్రిలో రోగులు కూర్చునేందుకు స్టీల్ చైర్స్, ఏసీలు తదితర సౌకర్యాలను కల్పించారు. ఎప్పటికప్పుడు వైద్యులతో సమావేశమవుతూ సూచనలందిస్తున్నారు. వైద్య సేవల కోసం వైద్యులకు అవసరమైన వసతులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ రోజుల వ్యవధిలోనే ఆసుపత్రిలో వసతులను ఏర్పాటు చేస్తున్నారు. ఆసుపత్రిలో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, జనరల్ పీడియాటిస్ట్, జనరల్ ఎంబీబీఎస్, డెంటల్, మత్తు డాక్టర్లతో పాటు నర్సులు, స్టాఫ్ నర్సులు, సిబ్బంది 30 మంది దాకా నిరంతరం రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలందిస్తున్నారు. ఆసుపత్రిని మరింతగా అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే యరపతినేని చర్యలు చేపడుతున్నారు. మే 1వ తేదీన మరోమారు ఎమ్మెల్యే యరపతినేని వైద్యులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వాసుపత్రి అభివృద్ధికి సొంత నిధులను ఖర్చు చేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ప్రజా సేవా తత్పరతకు నియోజకవర్గ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

భూమిని కాపాడడం అందరి బాధ్యత

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, ఏప్రిల్22, ప్రభాతవార్త: ప్రపంచ ధరిత్రి దినోత్సవం దినోత్సవం పురస్కరించుకుని ఏఎన్యులో ఉన్న ధరిత్రి సంరక్షణ చైతన్యం సొసైటీ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సోషల్వర్క్ విభాగాధిపతి ఆచార్య ఎం.త్రిమూర్తిరావు మొక్కలు నాటి మాట్లాడారు. మొక్కలు నాటండి- ప్రకృతిని కాపాడండి, భూమిని రక్షించండి అనే నినాదంతో ఈ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. సొసైటీ వ్యవస్థాపకులు గుప్తా మాట్లాడుతూ భూమిని రక్షించాలంటే వృక్ష సంపదను పెంచాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు డాక్టర్ రెహమాన్, సొసైటీ సభ్యులు మోహన్రావు, భరద్వాజ్, రమాకాంత్, బ్రహ్మం, అజీజ్, తనూజ్, సూర్య, సోము తదితరుల పాల్గొన్నారు.

మమ్మల్ని జన్మంతం మోసే నేలతల్లి రుణాన్ని మనము ఎప్పటికీ తీర్చుకోలేం

విశ్రాంత డిప్యూటీ సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ బాలశౌరి

పెదకూరపాడు,ఏప్రిల్ 22,ప్రభాతవార్త : మనల్ని జన్మంతం మోసే నేలతల్లి రుణాన్ని మనం ఎప్పటికీ తీర్చుకోలేమని అమ్మ మనల్ని 9 నెలలే మోస్తుందని విశ్రాంత డిప్యూటీ సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ ఎడ్లూరి బాలశౌరి అన్నారు.నియోజకవర్గ కేంద్రమైన పెద్దకూరపాడు లోని జన చైతన్య సమితి స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో బుధవారం సాయంత్రం (ఎర్త్ డే)ధరిత్రి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న విశ్రాంత డిఎస్పి బాలశౌరి మాట్లాడుతూ మనతో పాటు ఎన్నో జీవరాసులకు ఇల్లు ఈ భూమి అని భూమిని కాపాడడం మన బాధ్యత అని అన్నారు. జన చైతన్య సమితి స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి తుళ్లూరి సాంబశివరావు మాట్లాడుతూ ప్రకృతిని రక్షించి భవిష్యత్తును కాపాడుకుంటూ రేపటి తరానికి ఆరోగ్యవంతమైన భూమిని అందించేందుకు అందరూ తమ వంతు కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో జన చైతన్య సమితి కోఆర్డినేటర్ వెలితోటి అనిల్ కుమార్,షేక్ ఇస్మాయిల్,దాసరి విజయ్ బెన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

వీనస్ సంచలన ఓటమి

న్యూఢిల్లీ: తన కెరీర్‌లో ఏడు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లను గెలుచుకున్న మాజీ ప్రపంచ నంబర్ 1 వీనస్ విలియమ్స్ సంచలన ఓటమి చవిచూసింది. ఈ అనుభవజ్ఞురాలైన అమెరికన్ స్టార్ మాడ్రిడ్ ఓపెన్‌లో వరుసగా తన 10వ సింగిల్స్ మ్యాచ్‌లో ఓడిపోయింది. 45 ఏళ్ల విలియమ్స్, మాడ్రిడ్ ఓపెన్ మొదటి రౌండ్‌లో కైట్లిన్ క్వెవెడో చేతిలో 6-2, 6-4 తేడాతో ఓడిపోయి, వరుసగా 10 మ్యాచ్‌లలో ఓడిపోయిన మొదటి మాజీ నంబర్ వన్ క్రీడాకారిణిగా నిలిచింది. తన ప్రత్యర్థి పుట్టకముందే తన ఎనిమిది గ్రాండ్ స్లామ్ టైటిల్స్‌లో ఆరింటిని గెలుచుకున్న 2010 ఫైనలిస్ట్ విలియమ్స్‌ను, వైల్డ్‌కార్డ్ క్రీడాకారిణి రెండవ సెట్‌లో 3-0 తో వెనుకబడినప్పటికీ ఓడించింది. ఈ ఏడాది ఇండియన్ వెల్స్ టోర్నమెంట్‌కు వీనస్ విలియమ్స్‌కు వైల్డ్ కార్డ్ ఎంట్రీ లభించిందని నిర్వాహకులు ధృవీకరించారు. దక్షిణ కాలిఫోర్నియా ఎడారిలో జరిగే ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్‌లో ఈ అమెరికన్ క్రీడాకారిణి డబుల్స్‌లో కూడా పోటీపడనుంది. ఈ స్టార్ క్రీడాకారిణి చివరిసారిగా జూలై 2025లో వాషింగ్టన్ ఓపెన్‌లో తన తోటి అమెరికన్ క్రీడాకారిణి పేటన్ స్టెర్న్స్‌ను ఓడించి మ్యాచ్ గెలిచింది. అలాగే 2000, 2001, 2005, 2007, 2008లో ఈ ప్రతిష్టాత్మకమైన గడ్డి కోర్టులలో విజయం సాధించి, ఐదుసార్లు వింబుల్డన్ టైటిల్‌ను గెలుచుకుంది. అంతేకాకుండా వీనస్ 2000, 2001లో యూఎస్ ఓపెన్‌ను కూడా గెలుచుకుంది. ఒక గ్రాండ్ స్లామ్‌లో అత్యధిక సార్లు పాల్గొన్న రికార్డు ఆమె పేరిట ఉంది. ఈ ఏడాది జరిగిన ఆస్ట్రేలియన్ ఓపెన్ ఆమెకు 95వ టోర్నమెంట్.

ఆట

శాఫ్ మహిళల ఛాంపియన్‌షిప్‌కు భారత్ ఆతిథ్యం

టోర్నీ నుండి వైదొలిగిన పాక్

న్యూఢిల్లీ: దశాబ్దం తర్వాత శాఫ్ మహిళల ఛాంపియన్‌షిప్‌కు భారత్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ టోర్నమెంట్‌లో బంగ్లాదేశ్‌తో డ్రా ఖరారు కాగా, పాకిస్థాన్ వైదొలిగింది. మే 24 నుండి జూన్ 7 వరకు గోవాలో జరగనున్న ఈ మహిళల ఛాంపియన్‌షిప్‌లో భారత్‌తో పాటు, డిఫెండింగ్ ఛాంపియన్ బంగ్లాదేశ్, మాల్దీవులు కూడా చోటు దక్కించుకున్నాయి. ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన భారత్ దశాబ్ద కాలంలో తొలిసారిగా ఈ టోర్నమెంట్‌కు ఆతిథ్యం ఇవ్వనుంది. ఫటోర్డాలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఆరు జట్లు ఛాంపియన్‌షిప్ టైటిల్ కోసం పోటీపడనున్నాయి. గ్రూప్ ఎలో నేపాల్, శ్రీలంక, భూటాన్, గ్రూప్ బిలో భారత్, బంగ్లాదేశ్, మాల్దీవులు ఉన్నాయి. అయితే పాకిస్తాన్‌కు భారత్‌లో ఆడేందుకు అక్కడి ప్రభుత్వం నుండి అనుమతి లభించలేదు. దీంతో టోర్నమెంట్ నుండి పాకిస్థాన్ మహిళా జట్టు వైదొలగాల్సి వచ్చింది. ఇక ప్రతి గ్రూపు నుండి అగ్రస్థానంలో నిలిచిన రెండు జట్లు సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి, ఫైనలిస్టులను నిర్ణయించడానికి ఈ సెమీఫైనల్స్‌ను సింగిల్‌లెగ్ నాకౌట్ పద్ధతిలో ఆడతారు. కాగా గ్రూప్ దశలోనే నిష్క్రమించిన ఎఎఫ్‌సి ఆసియా కప్ 2026 తర్వాత, భారత్‌కు శాఫ్ ఛాంపియన్‌షిప్ మొట్టమొదటి పోటీ టోర్నమెంట్ కానుంది. పోటీలో అత్యంత విజయవంతమైన జట్టుగా ఉన్నప్పటికీ భారత్ గత రెండు ఎడిషన్లలో ఆధిపత్యం చెలాయించలేకపోయింది. 2022, 2024 లో బంగ్లాదేశ్, నేపాల్ జట్లు ఫైనల్స్‌లో తలపడ్డాయి. 2019లో జరిగిన ఫైనల్‌లో ఆతిథ్య దేశమైన నేపాల్‌ను 3-1 తేడాతో ఓడించి భారత్ చివరిసారిగా శాఫ్ మహిళల ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను కైవసం చేసుకుంది.

బాక్సింగ్ టాప్స్ కోర్ గ్రూప్‌లో..

సచిన్, ప్రీతి, అరుంధతి, ప్రియ

న్యూఢిల్లీ: నలుగురు భారత బాక్సర్లు ప్రీతి పవార్, ప్రియా, అరుంధతి చౌదరి మరియు సచిన్ సివాచ్ టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్ కోర్ గ్రూప్‌కు పదోన్నతి పొందారు. ఇటీవల ముగిసిన ఆసియా బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లలో పవార్, ప్రియా, చౌదరి స్వర్ణ పతకాలు సాధించగా, సివాచ్ రజత పతకాన్ని కైవసం చేసుకున్న తర్వాత ఈ పరిణామం చోటుచేసుకుంది. టాప్స్ ఫ్రేమ్‌వర్క్ కింద అథ్లెట్ల ప్రదర్శనలను బుధవారం సమీక్షించిన 172వ మిషన్ ఒలింపిక్ సెల్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆసియా ఛాంపియన్‌షిప్‌ల సమయంలో అర్హత సాధించిన పవార్, ఈ ఏడాది చివర్లో గ్లాస్గోలో జరిగే కామన్వెల్త్ గేమ్స్, జపాన్‌లో జరగనున్న ఆసియా గేమ్స్ రెండింటిలోనూ పోటీపడనుంది. ఆమెతో పాటు జైస్మిన్, ప్రియా, అరుంధతి, సివాచ్ కూడా పాల్గొననున్నారు. బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్దేశించిన అర్హత ప్రమాణాలను నెరవేర్చినందున, పవార్, ప్రియా మరియు శివాచ్ కూడా ఆసియా క్రీడల్లో పోటీపడనున్నారు. అంతేకాకుండా, ఆసియా ఛాంపియన్‌షిప్‌లలో వారి ప్రదర్శనల ఆధారంగా, ఎమ్‌ఒసి ఆదిత్య (65 కేజీలు), దీపక్ (70 కేజీలు), హర్ష్ (90 కేజీలు) అనే ముగ్గురు బాక్సర్లను టాప్ డెవలప్‌మెంట్ గ్రూప్‌లో చేర్చింది. నరేందర్ (+90 కేజీలు) టార్గెట్ ఏషియన్ గేమ్స్ గ్రూప్‌లో చేర్చబడ్డాడు, ఈ నెల ప్రారంభంలో ఉలాన్‌బాతర్‌లో జరిగిన మీట్‌లో హర్ష్ మరియు నరేందర్ కాంస్య పతకాలు సాధించగా, ఆదిత్య మరియు దీపక్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నారు.

నేడు ఐపిఎల్ కీలక పోరు

చెన్నై, ముంబై ఇండియన్స్‌కు డు ఆర్ డై.. ఒకరిపై ఒకరు గెలిస్తేనే ప్లే ఆఫ్స్ ఆశలు!

న్యూఢిల్లీ: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)-2026 సీజన్లో చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఇప్పటివరకు ఆరు మ్యాచ్‌లు ఆడిన చెన్నై కేవలం రెండు విజయాలు మాత్రమే అందుకుంది. దీంతో ప్రస్తుతం 4 పాయింట్లతో పాయింట్ల పట్టికలో 8వ స్థానంలో ఉంది. ఇప్పటికే లీగ్ దశలో దాదాపుగా సగం మ్యాచ్‌లు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో ప్లే ఆఫ్స్ రేసులో నిలవాలంటే మ్యాచ్ కీలకం కానుంది. సూపర్ కింగ్స్, ఇండియన్స్‌కు ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టుకు ప్లే ఆఫ్స్ అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఓడిన జట్టుకు ప్లే ఆఫ్స్ అవకాశాలు సన్నగిలుతాయి.

కాగా ప్రస్తుతం పంజాబ్ కింగ్స్ 11 పాయింట్లతో ప్లే ఆఫ్స్ రేసులో ముందంజలో ఉంది. అలాగే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, రాజస్థాన్ రాయల్స్ జట్లు 8 పాయింట్లతో బలమైన స్థితిలో ఉన్నాయి. ఈ

ఇకపై ప్రతి మ్యాచ్ చెన్నై సూపర్ కింగ్స్‌కు అత్యంత కీలకం. ఒక్కో మ్యాచ్ ఓడిపోతే ప్లే ఆఫ్స్ అవకాశాలు సన్నగిల్లుతుంటాయి. ఈ నేపథ్యంలో ఈ నేల 23న వాంఖడేలో ముంబై ఇండియన్స్ పై గెలవడం తప్పనిసరి. మరోవైపు ముంబై ఇండియన్స్ కూడా చెన్నై సూపర్ కింగ్స్ లాంటి పరిస్థితినే ఎదుర్కొంటోంది.

తాజాగా గుజరాత్ టైటాన్స్‌పై విజయం సాధించి ముంబై 4 పాయింట్లతో తిరిగి పోటీలోకి వచ్చింది. ముంబై జట్టుకు మంచి కాంబినేషన్ ఉండటంతో బలంగా తిరిగి వచ్చే అవకాశాలు ఉన్నాయి. దీంతో ముంబై ఇండియన్స్‌కు కూడా సూపర్ కింగ్స్‌తో జరగనున్న పరిస్థితుల్లో చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ ప్లే ఆఫ్స్‌కు చేరాలంటే ఇకపై తప్పనిసరిగా వరుస విజయాలు సాధించాల్సి ఉంటుంది. ముఖ్యంగా ముంబైపై జరిగే మ్యాచ్‌లో గెలిస్తే చెన్నై 6 పాయింట్లకు చేరుకుని ఆశలను సజీవంగా ఉంచుకోగలదు. అదే సమయంలో ముంబై 4 పాయింట్ల వద్దే ఉంటుంది. ఓడిపోతే సీఎస్కే ప్లే ఆఫ్స్ ఆశలు ప్రమాదంలో ఉంటాయి.

ఈ కీలక సమయంలో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ ఎలా జట్టును నడిపిస్తాడో చూడాలి. మొత్తానికి చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్‌కు ఈ మ్యాచ్ ఇది డూ ఆర్ డై పరిస్థితి అనే చెప్పాలి.

టి20 మహిళా ర్యాంకింగ్స్‌లో..

దుమ్ము రేపిన షెఫాలీ

దిగజారిన స్మృతి

న్యూఢిల్లీ: టీమిండియా స్టార్ బ్యాటర్ షెఫాలీ వర్మ ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో దుమ్ము రేపింది. ఐసీసీ విడుదల చేసిన తాజా జాబితాలో షెఫాలీ (731) రెండు ప్లేస్లు ఎగబాకి ఆరో ర్యాంక్లో నిలిచింది. సౌతాఫ్రికాతో జరుగుతున్న ఐదు మ్యాచ్ల సిరీస్లో భాగంగా ఆదివారం జరిగిన రెండో టీ20లో హాఫ్ సెంచరీ చేయడం ఆమెకు కలిసొచ్చింది. అలాగే వైస్ కెప్టెన్ స్మృతి మంధాన (762) ఒక్క ప్లేస్ దిగజారి నాలుగో ర్యాంక్‌కు పడిపోయింది. గత రెండు మ్యాచ్‌ల్లో స్మృతి 13, 12 రన్స్ మాత్రమే చేసింది. ఇక విండీస్ బ్యాటర్ హేలీ మాథ్యూస్ (767) మూడో ర్యాంక్‌కు ఎగబాకింది. టీమిండియా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (639) రెండు ర్యాంకులు మెరుగుపడి 11వ స్థానంలో నిలవగా, జెమీమా రోడ్రిగ్స్ (637) 14వ ర్యాంక్‌నకు పడిపోయింది. జార్జియా వోల్ (815), బెత్ మూనీ (788), హేలీ మాథ్యూస్ (767) టాప్-3లో కొనసాగుతున్నారు. కాగా బౌలింగ్లో దీప్తి శర్మ (705) రెండు స్థానాలు కిందకు దిగి ఐదో ర్యాంక్‌తో సరిపెట్టుకుంది. రేణుకా సింగ్ (699) నాలుగు ప్లేస్‌ను అరుంధతి రెడ్డి (665) మూడు స్థానాన్ని కోల్పోయి వరుసగా 9, 12వ ర్యాంక్‌ల్లో నిలిచారు. రాధా యాదవ్ (620) 20వ ర్యాంక్‌లో ఉంది.

పశ్చిమాసియా ఎఫెక్ట్!

నష్టాల్లోకి సెన్సెక్స్, నిఫ్టీ

వాణిజ్యం

ముంబయి, ఏప్రిల్ 22: దేశీయ ఈక్విటీసూచీలు ఒక్కసారిగా నష్టాల్లోకి మళ్లాయి. ఇరాన్‌పై శాంతిచర్చలకు గడువు నిరవధిక పొడిగింపు, హర్ముజ్‌లో నౌకలపై దిగ్బంధం కొనసాగుతుందన్న ట్రంప్ ప్రకటనలు మార్కెట్లను కుంగదీసాయి. బుధవారం బిఎస్ఇ సెన్సెక్స్ 756.84 పాయింట్లు క్షీణించి 78,516.49 పాయింట్లవద్ద ట్రేడింగ్ ముగిస్తే నిఫ్టీ 50 సూచీ కూడా 198.50 పాయింట్లు క్షీణించి 24,378.10 పాయింట్లవద్ద ట్రేడింగ్ ముగిచింది. గడచిన మూడు సెషన్లలో సెన్సెక్స్, నిఫ్టీలు వరుసగా 1.65 శాతం, 1.57శాం చొప్పున పెరిగాయి. ఇన్వెస్టర్లు వేచి చూసేధోరణి అవలంభించారు. హెచ్‌సిఎల్‌టెక్నాలజీస్ 10.74శాతం భారీగా క్షీణిస్తే ఇన్ఫోసిస్ 3.38శాతం, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 1.52శాతం చొప్పున సూచీలో భారీ క్షీణతను ఎదుర్కొన్నాయి. బిఎస్ఇ మిడ్‌క్యాప్‌సూచీ 0.29శాతం పెరిగితే స్మాల్‌క్యాప్‌సూచీ 0.90శాతంపెరిగింది. మార్కెట్లపరంగా బిఎస్ఇలో 2440 కంపెనీలషేర్లుపెరిగాయి. 1838 కంపెనీల షేర్లు దిగజారాయి. మొత్తం 154 షేర్లు యదాతథంగా కొనసాగాయి. భారతప దేళ్ల బాండ్లరాబడులు 6.915 శాతంవద్దకు చేరాయి. విదేశీ కరెన్సీ మార్కెట్‌పరంగా రూపాయి 93.78వద్ద కదలాడింది. అంతకుముందురోజు 93.44 వద్ద ముగిసిన సంగతి తెలిసిందే. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు జూన్ ఐదు సెటిల్‌మెంట్లు రూ.1,53,190వద్ద రికార్డయింది. అమెరికా పదేళ్ల బాండ్ల రాబడులు కూడా 0.21శాతం క్షీణించి 4.282వద్ద ముగిసింది. నిఫ్టీ ఐటిఊచీ 3.89శాతం క్షీణించింది. నాలుగోత్రైమాసిక ఫలితాలు క్షీణించడమే ఇందుకు కారణం. హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ 10.74శాతం, కోఫోర్జ్ 4.24శాతం, ఇన్ఫోసిస్ 3.38, ఎల్‌అండ్‌టి టెక్ సేవలు 3.11శాతం, ఎంఫసిస్ 3.02శాతం, టిసిఎస్ 2.88శాతం విప్రో 0.49శాతం చొప్పున క్షీణించాయి. ఒరాకిల్ ఫైనాన్షియల్స్ మాత్రం 2.51శాతంపెరిగింది. ఇక అద్వైత్ ఎనర్జీ ట్రాన్సిషన్స్ 2.20శాతం, అజంతా ఫార్మా 0.18శాతంపెరిగితే 360 వన్‌వామ్ 4.31శాతం క్షీణించింది. కేంద్రప్రభుత్వ సిఎంపిడిఐ సంస్థ 3.40శాతం హెచ్‌డిఎఫ్‌సి లైఫ్ 1.65శాతం చొప్పున క్షీణించాయి. లూపిన్ 0.51శాతం,. ఎల్‌అండ్‌టి 1.32శాతం దిగువన నమోదయితే టాటాఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ 1.17శాతంపెరిగింది. టెక్ మహీంద్ర 2.5శాతం పెర్సిస్టెంట్ సిస్టమ్స్ 4.88శాతం క్షీణించాయి.

ఎన్ఎస్ఇ వివాదాల సెటిల్‌మెంట్‌కు

రూ.1800 కోట్లు

సెబీ ఉన్నతస్థాయి ప్యానెల్ సిఫారసులు

ముంబయి, ఏప్రిల్ 22: దేశంలోని అతిపెద్ద ఈక్విటీ ఎక్స్ఛేంజ్ అయిన నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్ఈ), మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ మధ్య పదేళ్లుగాకొనసాగుతున్న చట్టపరమైన పోరాటం కొలిక్కివస్తోంది. సెబీ ఏర్పాటు చేసిన ఒక ఉన్నత స్థాయి ప్యానెల్, ఎన్ఎస్ఈపై ఉన్న పెండింగ్ వివాదాలు సెటిల్‌మెంట్‌కు సుమారు రూ. 1,800 కోట్లకు పైగా చెల్లించాలని సిఫార్సు చేసింది. గతంలో ఎన్ఎస్ఈ పాలనలో జరిగిన లోపాలు, ముఖ్యంగా ట్రేడింగ్ కోలొకేషన్ వివాదం వంటి అంశాల కారణంగా ఈ వివాదం తలెత్తింది. ఈ సమస్యల వల్లే ఎన్ఎస్ఈ ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఐపిఒ దాదాపు పదేళ్ల పాటు వాయిదా పడింది. ఈ తాజా సిఫార్సు అమలులోకి వస్తే, ఎన్ఎస్ఈ ఐపీఓ మార్గం సుగమం కావడమే కాకుండా, మార్కెట్ రెగ్యులేటర్‌తో ఉన్న విభేదాలు కూడా తొలగిపోయే అవకాశం ఉంది. ఈ కేసులను పరిష్కరించుకోవడానికి ఎన్ఎస్ఈ గతంలో రూ. 1,300 కోట్లను కేటాయించగా, ప్యానెల్ మాత్రం అంతకంటే ఎక్కువగా రూ. 1,800 కోట్లు చెల్లించాలని సూచించింది. పక్షం రోజుల క్రితం ఎన్ఎస్ఈ పంపిన సెటిల్‌మెంట్ ప్రతిపాదనను పరిశీలించిన తర్వాత ప్యానెల్ ఈ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఈ సెటిల్‌మెంట్ ప్రక్రియను అధికారికంగా ఖరారు చేసే ముందు, సెబీ ఒక డిమాండ్ లేఖను జారీ చేసే అవకాశం ఉంది. ఈ భారీ మొత్తం చెల్లింపు ద్వారా ఎన్ఎస్ఈ తనపై ఉన్న పాత మరకలను తుడిచేసుకుని, ఒక పారదర్శకమైన సంస్థగా ఐపీఓ వైపు అడుగులు వేయాలని భావిస్తోంది. మరోవైపు ఐపీఓ దిశగా ఎన్ఎస్ఈ తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒకే ఐపీఓ కోసం ఏకంగా 20 బ్యాంకులని మర్చంట్ బ్యాంకర్లుగా నియమించుకోవడం ఎన్ఎస్ఈ ప్రాముఖ్యతను చాటిచెబుతోంది. ప్రస్తుతం ఎన్ఎస్ఈలో దాదాపు 1.90 లక్షల మంది ఇన్వెస్టర్లున్నారు. ఈ సెటిల్‌మెంట్ ప్రక్రియ సజావుగా సాగితే, మే నెలాఖరు నాటికి ఎన్ఎస్ఈ తన ఆర్థిక ఫలితాలను ప్రకటించిన వెంటనే ఐపీఓ కోసం సెబీ వద్ద ముసాయిదా పత్రాలు దాఖలు చేసే అవకాశం ఉందన్న అంచనాలు పెరిగాయి.

ట్రెంట్ నికరలాభం రూ.455కోట్లు!

ముంబయి, ఏప్రిల్ 22: టాటాగ్రూప్‌లోని ట్రెంట్ సంస్థ నికరలాభాలు 30%పెరిగి రూ.455 కోట్లకు చేరాయి. అంతకుముందు ఏడాది ఇదేకాలంలో ఆర్జించిన 350 కోట్లతోపోలిస్తే 30% పెరిగింది. నికరలాభాలు పెరగడంతో కంపెనీ ప్రతి ఈక్విటీ షేరుకు రూ.6 డివిడెండ్ ప్రకటించింది. 74 సర్వసభ్య సమావేశం ముగిసిన మూడోరోజునుంచి డివిడెండ్ చెల్లింపులు ప్రారంభిస్తామని వెల్లడించింది. కంపెనీ రాబడులు కూడా 20.2%పెరిగి 4106 కోట్లనుంచి రూ. 4937 కోట్లకు పెరిగాయి. ఇక నిర్వహణ లాభాలు కూడా 40శాతం పెరిగాయి. 656 కోట్ల నుంచి రూ.919 కోట్లకు పెరిగినట్లు కంపెనీ ఎక్స్ఛేంజిలకు నివేదికిచ్చింది. ఎబిడిటా మార్జిన్ కూడా 16 నుంచి 18శాతానికి పెరిగింది. బోనస్ ఇష్యూను కూడాప్రకటించింది. 1:2 నిష్పత్తిలో షేర్లు జారీచేస్తోంది. ప్రతి రెండుషేర్లకు అదనంగా ఒకటి కేటాయిస్తుంది. అయితే వాటాదారుల ఆమోదం పొందాల్సి ఉంది. ట్రెంట్ లాభాలు పెరగడంతో కంపెనీ షేర్లు ఒకటిశాతం పెరిగి 4434.50 గా ట్రేడ్ అయ్యాయి.

6నెలల్లోనే 26 లక్షలకోట్ల వృద్ధి

భారత్‌లో భావితరం బిజినెస్ టైకూన్ల సంపద వృద్ధి!

ముంబయి, ఏప్రిల్ 22: భారత్‌కార్పొరేట్ రంగంలోని భావితరం బిజినెస్ టైకూన్‌లు 50 మంది కేవలం ఆరునెలల్లోనే తమ సంపదను రూ.26 లక్షలకోట్లు పెంచుకోగలిగారని ఎఎస్‌కె ప్రైవేట్ వెల్త్, హురూన్ ఇండియా సక్సెసర్స్ 50 సర్వేలో వెల్లడి అయింది. ఈ భావితరం 50 మంది బిజినెస్ దిగ్గజాలు తమ కుటుంబ సంస్థలను మరింతగా విస్తరించి సంపదను గణనీయంగా పెంచారు. దేశంలోని వారసత్వ వ్యాపారాలు కొత్త తరహా విస్తరణదిశగా వెళుతున్నట్లు తేలింది. మొత్తం రూ.26.3 లక్షలకోట్లు మార్కెట్ విలువలుపెరిగాయంటే వారి వ్యాపార సామ్రాజ్యాలు మరింత విస్తరించుకోగలిగినట్లు తెలుస్తోంది. 2020లో రూ.4.6 లక్షలకోట్లు ఉన్న ఈ మొత్తం విలువలు 2026 నాటికల్లారూ.30.9 లక్షలకోట్లకు సంస్థల మార్కెట్ విలువలు పెరిగాయని అంచనా. అంటే 6.7 రెట్లు సంపద సృష్టిజరిగిందని హురూన్ ఇండియా వెల్లడించింది. మొత్తం పదిమంది భావితరం వాణిజ్యవేత్తలు విస్తరణలో మరింత వేగంతో దూసుకుపోతున్నారు. వీరిలోజూపిటర్ వ్యాగన్స్ అధినేత వికాస్ లోహియా డిప్యూటీ ఎండిగా సంపదను 152.8 రెట్లు వృద్ధిచేసారు. అందరికంటే అగ్రస్థానంలో నిలిచారు. ఆయన నాయకత్వంతోకంపెనీ రూ.10,666 కోట్లు పెరిగిమొత్తం రూ.10,736 కోట్లకు చేరింది. ఆ తర్వాత తిలక్‌నగర్ ఇండస్ట్రీస్ జెఎండి అమిత్ దహానుకర్, జిందాల్ స్టెయిన్‌లెస్ ఎండి అభ్యుదయ్ జిందాల్‌లు తమతమ సంపదను 52.5 రెట్లు పెంచుకోగలిగారు. ఈ విస్తరణలో ఆటోమొబైల్, ఆటో విడిభాగాల రంగాలు అత్యధికంగా విస్తరించాయి. మొత్తం తొమ్మిది కంపెనీలు ఈ విభాగంలో ఉంటే హెల్త్‌కేర్ కంపెనీలు ఆరువరకూ ఉన్నాయి. వీటి మొత్తం మార్కెట్ విలువలు రూ.7.26 లక్షలు పెంచుకోగలిగాయి. ముంబయి, ఢిల్లీ నగరాల్లోనే వ్యాపారవేత్తలే ఎక్కువగా టర్నోవర్ పెంచుకోగలిగారు. ఈ రెండునగరాల్లో మొత్తం 12 కంపెనీల కేంద్రకార్యాలయాలున్నాయి. కార్పొరేట్ పరంగా 50 కంపెనీలు రూ.8.2లక్షలకోట్లు వార్షిక రాబడులు సాధించాయి. రూ.90,168 కోట్లు నికరలాభం ఆర్జించగలిగాయి. వార్షికవృద్ధి 14.4శాతంగా ఉంది. ఈ కంపెనీలు మొత్తంగా 8.6 లక్షలమంది ఉద్యోగులతో సిఎస్ఆర్ కార్యకలాపాలకు ఈ 50 కంపెనీలు రూ.1028 కోట్లు అందిస్తున్నాయి. కంపెనీ విలువలు వృద్ధిచేయడంలో ఆదాని విభాగంలో కరన్ ఆదానికూడా రూ.2,67,525 కోట్లకు పెంచగలిగారు.

పశ్చిమాసియా ఉద్రిక్తతలే

రెపోరేట్లకు గండి!

ఆర్బీఐ ఎంపిసి మినిట్స్ విడుదల

ముంబయి, ఏప్రిల్ 22: రిజర్వుబ్యాంకు ఇటీవల నిర్వహించిన మానిటరీపాలసీ సమీక్షలో కమిటీ సభ్యులు పశ్చిమాసియా ఉద్రిక్తతలనే ఎక్కువగా పరిగణనలోనికి తీసుకోవాల్సి వచ్చింది. పశ్చిమాసియా సంక్షోభంతో ద్రవ్యోల్బణంపై ప్రభావం ఎక్కువ పడిందని ఎంపిసి సమీక్ష మినిట్స్ నివేదికల్లో వెల్లడి అయింది. ఎంపిసి మినిట్స్‌ను బుధవారం విడుదలచేసింది. భారత ఆర్థికవ్యవస్థపై పశ్చిమాసియా యుద్ధ ప్రభావం తీవ్రస్థాయిలో ఉందని ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు. ఎగుమతులపరంగానే కాకుండా సంక్లిష్ట ఉత్పత్తుల సరఫరాపరంగాను, ఇంధనం, కమోడిటీ ధరలు, విదేశీ జమలు వంటి వాటితోపాటు గ్లోబల్ డిమాండ్‌కూడా రెపోరేట్లు యదాతథంగా కొనసాగించేందుకు దోహదంచేసిందని అభిప్రాయపడ్డారు. భౌగోళిక అనిశ్చితి పరిస్థితులు గతనెలలో మరింతగా విస్తరించినందున వడ్డీరేట్లజోలికి వెళ్లకపోవడమే సముచితమని ఎంపిసి సమీక్షలో సభ్యులాంతా ఏకాభిప్రాయం వ్యక్తంచేసారు. సరఫరా అంతరాయాలు రవాణా నెట్‌వర్క్‌ను పూర్తిగా పక్కన పెట్టాయని, దీనివల్ల వృద్ధిమాట అటుంచి ఎక్కువ సమస్యలు ఎదురయినట్లు ఆర్బీఐ మినిట్స్‌లో పొందుపరిచారు. ఈపరిస్థితులవల్ల ద్రవ్యోల్బణం మరింతపెరిగే ప్రమాదం ఉందని అందువల్లనే రెపోరేట్లు సవరణలు మంచిది కాదనే అభిప్రాయం వ్యక్తం అయిందని నివేదికలో తెలిపారు. మూడురోజుల సమీక్షలో సెంట్రల్ బ్యాంకు తన రెపోరేట్లను స్థిరంగానే కొనసాగించింది. అప్రమత్తతతో వ్యవహరిస్తూ సవరణలపట్ల వేచిచూసే ధోరణి అనుసరించింది. ఆరునెలలుగా కొనసాగుతున్న ఇరాన్ వివాదంలో ఇంధన సరఫరా బ్రేక్‌డౌన్‌తోపాటు ద్రవ్యోల్బణం, ఆర్థికవృద్ధి కి బ్రేకులు వేసాయి. ఆరుగురుసభ్యులున్న ఎంపిసిలో అందరూ కూడా కొనుగోలురేటును 5.25శాతంవద్దనే ఉంచినట్లు తేలింది. రూపాయి క్షీణత, వాణిజ్య ఎగుమతులు క్షీణించడం వంటి వాటితో రెపోరేట్లలో వేచిచూసేధోరణి అనుసరించింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14